V3 NEWS

www.vishvambhara.com

తెలుగు దినపత్రిక

# విశ్వంభర

అక్షరం సాక్షిగా..

శనివారం
18-01-2025

సంపుటి : 01 | సంచిక : 256 | పేజీలు : 12 | వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్







# 20న తహసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా

- వార్డులలో ప్రచార కార్యక్రమం
- అర్హుల జాబితాలోని లబ్ధిదారులకు డబల్ బెడ్ రూమ్ లు వెంటనే ఇవ్వాలి
- నివాస స్థలం లేని పేదలకు 150 చ.గజాల భూమి, ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం చేసి ఇవ్వాలి
- ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి కనీసం 15 లక్షల రూపాయలు ఇవ్వాలి



**విశ్వంభర,మహబూబ్ నగర్ :** జనవరి 17న మహబూబ్నగర్ పట్టణంలోని మదీనా మజీద్, వీరన్న పేట, ఎర్రమను గుట్ట తదితర ప్రాంతాలలో డిమాండ్లతో కూడిన కరపత్రం పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో టి ఎఫ్ టి యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం డి.ఖలీల్, మహబూబ్నగర్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు పీ. విజయకుమార్, జిల్లా నాయకులు జలాల్ పాషా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మహబూబ్నగర్ పట్టణంలోని పూర్వం నుండి మూలవాసులుగా ఉన్న పై వార్డులలో పేదలకు గత బిఆర్ఎస్ ప్రభుత్వము తీరని అన్యాయం చేసిందని తెలిపారు. తమ సర్వేలో అనేక విషయాలు వెలుగులోకి వచ్చాయని తెలిపారు. వీరన్న పేట, ఎర్రమనుగుట్ట, మదీనా మజీద్ తదితర ప్రాంతాలలో అనేక మంది పేదలకు ఇంటి స్థలాలు లేక చిన్నచిన్న అద్దె ఇళ్లల్లో రెండు మూడు కుటుంబాలు నివాసం ఉంటున్నాయని వారు తెలిపారు. ప్రభుత్వం వారికి ఇంటి స్థలాలు ఇవ్వాలని, ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇవ్వాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. సర్వేనెంబర్ 523 లో ఆ పట్టా సర్టిఫికెట్లు ప్రభుత్వానికి స్వాధీనపరిచిన వారికి గత బిఆర్ఎస్ ప్రభుత్వం మొండి చేయి చూపిందని ఈ ప్రభుత్వం వారికి తక్షణ డబల్ బెడ్ రూమ్ లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈనెల 20న మహబూబ్నగర్ అర్బన్ మండల తహసీల్దార్ కార్యాలయం ముందు జరిగే ధర్నా కార్యక్రమంలో అధిక సంఖ్యలో పేదలు పాల్గొంటారని వారు తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి వారికి న్యాయం చేయాలని వారు కోరారు. లేనియెడల ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## భూపాలపల్లిలో లారీల సమ్మె



**విశ్వంభర, భూపాలపల్లి:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో భూపాలపల్లి, గణపురం మండలాల లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 8వ రోజు లారీల సమ్మె కొనసాగుతుంది. డీజిల్, మెంటనేన్స్ ఖర్చులు భారీగా పెరిగిపోయాయని, దీనికి తోడు ఫైనాన్స్ కిస్తీలు కూడా కట్టలేని పరిస్థితి నెలకొందని వారు విలేఖర్ల సమావేశంలో ఆవేదన వ్యక్తం చేసారు. లారీల నిర్వహణ భారం పెరగడం, కిస్తీలు కట్టలేక అప్పుల బాధతో పలువు యజమానులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని వాపోయారు. పెరిగిన ఖర్చులు దృష్టిలో పెట్టుకొని కోల్ ట్రాన్స్పోర్ట్ యాజమాన్యాలు టన్ను బొగ్గు కు రు.300, బ్రిక్స్ కు రు.400 పెంచాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో భూపాలపల్లి లారీ అసోసియేషన్ అధ్యక్షుడు మేకల చంద్రయ్య, ప్రధాన కార్యదర్శి అన్వర్ పాషా, గణపురం లారీ అసోసియేషన్ అధ్యక్షుడు జగ్గారావు, గౌరవాధ్యక్షులు శ్రీరాములు, టిప్పర్ అసోసియేషన్ అధ్యక్షుడు పుట్ట రవి, కావటం సురేందర్, ఎనగంటి రమేష్, తిరుపతిరావు, రొడ్డ రవి, బాల్ చందు నాయక్ పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ



**విశ్వంభర, తంగళ్ళపల్లి:** రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి మండలం చీర్లవంచ గ్రామంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ప్రవీణ్ ఆధ్వర్యంలో సీసీ రోడ్డుకు భూమి పూజ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ చీర్లవంచ గ్రామంలో ఎన్ఆర్ ఈజీఎస్ విధుల నుండి మంజూరైన పది లక్షల రూపాయలతో సీసీ రోడ్లు నిర్మించుతూ గ్రామ అభివృద్ధి కోసం పది లక్షల రూపాయలు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నేరెళ్ల నర్సింగ్ గౌడ్, గంగు కొండయ్య గ్రామ శాఖ అధ్యక్షులు గంగు మహేష్, నాయకులు నలువాల జలంధర్ రెడ్డి, గ్రామ శాఖ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

### రామన్నపేటలో రైళ్ళు ఆపాలని

## కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి వినతి



**విశ్వంభర, రామన్నపేట:** బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రివర్యులు జి.కిషన్ రెడ్డిని యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండల బీజేపీ నాయకులు 17 జనవరి 2025 న తమ నివాసంలో కలిసి, రామన్నపేట పట్టణ కేంద్రంలో ఆపవలసిన నారాయణద్రి ఎక్స్ ప్రెస్, ఫలక్ నూమా ఎక్స్ ప్రెస్, కాచిగూడమిర్యాలగూడ డెమో రైళ్లని ఆపకపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, వీటిని తక్షణమే పునరుద్ధరించాలని వినతిపత్రం ఇవ్వడం జరిగింది. అందుకు వారు స్పందించి రైల్వే అధికారులతో మాట్లాడి, రామన్నపేటలో పలు రైళ్లను ఆపేందుకు కృషి చేస్తానని సానుకూలంగా స్పందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షులు పివి శ్యామ్ సుందర్ రావు, నకిరేకల్ ఇంచార్జ్ ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నకిరేకంటి మొగులయ్య, జిల్లా ఉపాధ్యక్షులు మండల వెంకన్న, జిల్లా కార్యదర్శి తాటిపాముల శివకృష్ణ, మండల అధ్యక్షులు బండ మధుకర్ రెడ్డి, నార్కట్ పల్లి మండల అధ్యక్షుడు శంకర్, వెంకటేశం పాల్గొనడం జరిగింది.

## లబ్ధిదారుల పరిశీలనలో పాల్గొన్న అడిషనల్ కలెక్టర్



**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండలం, సిరిపురం గ్రామంలో జరుగుతున్న రేషన్ కార్డుల పరిశీలన, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పరిశీలనను యాదాద్రి భువనగిరి జిల్లా అడిషనల్ కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేయడం జరిగింది. లబ్ధిదారులు పరిశీలన వేగవంతంగా, సరైన డేటాతో పరిశీలనను పూర్తి చేయాలని, తగు సూచనలు చేయడం జరిగింది. లబ్ధిదారుల ఇండ్లు స్వయంగా పరిశీలన చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి, తహసీల్దార్, మండల పంచాయతీ అధికారి, ఏపీఓ హాజరు కావడం జరిగింది.

## ఎస్పీని కలిసిన జేపీఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు



**విశ్వంభర, జూలూరుపాడు:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజుని జేపీఆర్ ట్రస్ట్ అధ్యక్షులు ఇదుపుల రాజు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛమిచ్చి నూతన సంవత్సర మరియు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆయన చిత్రపటాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో భూక్యా అజయ్ రాథోడ్ పాల్గొన్నారు.

## వివాహానికి హాజరైన ఎస్కే చాంద్, జోగు అంజన్న



**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండలం, బోగారం గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర మైనార్టీ సెల్ నాయకులు ఎండి.ఇమామ్ కుమారుని వివాహానికి తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎస్కే చాంద్, ఉద్యమ కారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు జోగు అంజన్న హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షులు నోముల శంకర్, జిల్లా నాయకులు బొడ్డుపల్లి లింగన్న, శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## అర్జున అవార్డు అందుకున్న దీప్తి జీవంజి



**విశ్వంభర, హనుమకొండ:** రాష్ట్రపతి భవన్‌లో జరిగిన జాతీయ క్రీడా అవార్డుల ప్రధానోత్సవంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా శుక్రవారం అర్జున అవార్డును అందుకున్న తెలంగాణ క్రీడారత్నం, వరంగల్ జిల్లా పర్వతగిరి మండల పరిధిలోని కల్లెడ గ్రామానికి చెందిన పారా ఒలింపియన్ అథ్లెట్ దీప్తి జీవంజి కి వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.

## మెడికల్ కళాశాలను సందర్శించిన ఎమ్మెల్యే మురళీ నాయక్

*** కాలేజీ నిర్మాణ పనుల్లో నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు**



**విశ్వంభర, మహబూబాబాద్:** మెడికల్ కళాశాలను ఎమ్మెల్యే మురళీ నాయక్ సందర్శించారు. అధికారులతో మాట్లాడి పనుల పురోగతి పై ఎమ్మెల్యే చర్చించారు. నేడు మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఉన్న మెడికల్ కాలేజ్ నిర్మాణం పూర్తి గా వాడకంలోకి రాకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మురళీ నాయక్ శుక్రవారం మెడికల్ కళాశాలను సందర్శించిడం జరిగింది. ఈ సందర్భంగా అధికారులు, కాంట్రాక్టర్ల ను ఉద్దేశించి మాట్లాడారు. ఎంతో కష్టపడి చదివితే మెడికల్ కాలేజ్ లో సిటు లభిస్తుందని, అంతేకాకుండా ఎంతోమంది ప్రాణాలు కాపాడాలని వాళ్ళు వైద్య విద్యను ఎంపిక చేసుకొని చదువుతున్న విద్యార్థులకు ఇబ్బందులు కావొద్దని, అన్ని విధాలుగా వారికి సౌకర్యాలు కల్పించాలని అన్నారు. వైద్య విద్య పట్ల నిర్లక్ష్యం వహిస్తే అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట మెడికల్ కలశాల ప్రిన్సిపాల్, మరియు ఆర్ అండ్ బి అధికారులు కళాశాల యాజమాన్యం కాంట్రాక్టర్లు సంభందిత అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే చిత్రపటానికి పాలభిషేకం



**విశ్వంభర, జూలూరుపాడు:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన భూ సర్వే ప్రక్రియలో భాగంగా వైరా నియోజకవర్గ జూలూరుపాడు మండలంలోని పాపకొల్లు గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసినందుకు సహకరించిన వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ చిత్రపటానికి పాపకొల్లు గ్రామ ప్రజలు పాలభిషేకం చేశారు. తరతరాలుగా ఉన్న భూములకు పట్టాలు లేక హక్కులు పొందులేక ఇన్నేళ్లుగా చాలా ఇబ్బందులు పడుతున్నామని ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వెళ్లడంతో వెంటనే ఎమ్మెల్యే స్పందించినందుకు ఆ ప్రాంత రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రొకటి సురేష్. రామిశెట్టి రాంబాబు, అచ్చయ్య, పొదిని బాబు, వేట వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మాజీ మంత్రి



**విశ్వంభర, దేవరుప్పుల:** దేవరుప్పుల మండలం పెద్ద మదూరు గ్రామ బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త భార్య కెమిడి మమత (25) వ్యవసాయ బావి వద్ద అకస్మాత్తుగా తేనెటీగలు కుట్టి ఆరోగ్య పరిస్థితి విషమించి చికిత్స పొందుతూ మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు మృతురాలి ఇంటికి వెళ్లి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అదే గ్రామంలో సీనియర్ నాయకులు గొడిశాల నర్సయ్య తండ్రి గొడిశాల అబ్బయ్య ఇటీవలే మృతి చెందగా ఆ కుటుంబాన్ని పరామర్శించి అండగా ఉంటానని ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు పల్లా సుందర్ రాంరెడ్డి, తీగల దయాకర్, బస్వా మల్లేష్, ఉమేష్, పెద్ద మదూరు గ్రామ పార్టీ అధ్యక్షుడు బందారు రాములు, సంపత్ కార్యకర్తలు యూత్ నాయకులు, సోషల్ మీడియా నాయకులు పాల్గొన్నారు.

## హెల్మెట్ ధరించి రోడ్డు ప్రమాదాలను నివారిద్దాం

*** రోడ్డు భద్రత వారోత్సవాల్లో బైక్ ర్యాలీ నిర్వహించిన పోలీస్ సిబ్బంది**



**విశ్వంభర, ఏటూరునాగారం :** రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా మండలం కేంద్ర లోని బస్టాండ్ నుండి వై జంక్షన్ వరకు పోలీసులు బైక్ ర్యాలీ నిర్వహించారు. రోడ్డు ప్రమాదాల ను నివారించడంలో ప్రతి ఒక్క వాహనదారులు ట్రాఫిక్ నియమ నిబంధనలు తప్పకుండా పాటించాలని ఏటూరు నాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ అన్నారు. మండల కేంద్రంలో గురువారం బస్టాండ్ ఆవరణలో వాహనదారులకు, ప్రయాణికులకు జాతీయ రోడ్డు భద్రత మహోత్సవాల కార్యక్రమంలో భాగంగా ద్విచక్ర వాహనదారులు. ఆటో డ్రైవర్లు ర్యాలీ నీ ఏటూరు నాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ జెండా ఊపి ప్రారంభించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించండి హెల్మెట్ ధరించండి. తమ ప్రాణాలను కాపాడుకోండి అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీని వై జంక్షన్ వరకు నిర్వహించారు. అనంతరం స్థానిక ఏటూరు నాగారం ఎస్ఐ తాజుద్దీన్ ఆధ్వర్యంలో రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సివిల్, సిఆర్పిఎఫ్ పోలీసులు, ద్విచక్ర వాహనదారులు, ఆటో డ్రైవర్లు ప్రజా ప్రతినిధులు,యువత తదితరులు పాల్గొన్నారు.

## విజేతలకు బహుమతి ప్రదానం




**విశ్వంభర, మిర్యాలగూడ:** మిర్యాలగూడ పట్టణంలోని కాలేజీ గ్రౌండ్ నందు గత ఆరు రోజులుగా నూకల వేనన్న మిత్ర బృందం ద్వారా ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న నియోజవర్గ స్థాయి ఎన్.వి.ఆర్ క్రికెట్ కప్ టోర్నమెంట్లో లో భాగంగా శుక్రవారం రోజున ఫైనల్లో సీ బీ కే వర్సెస్ ఎన్ వి ఆర్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్ లో ఇరుజట్లు పోటాపోటీగా ఆడి చివరికి సి బి కే జట్టు ఎన్ వి ఆర్ కప్పును గెలవడం జరిగినది. ద్వితీయ బహుమతిగా ఎన్ వి ఆర్ 11 గ్రౌండ్ టీం నిలవడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే శ్రీ బత్తుల లక్ష్మారెడ్డి, మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ యూసుఫ్ చేతుల మీదుగా విజేతలకు బహుమానాలు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎన్ వీ ఆర్ ఫౌండేషన్ అధినేత నూకల వేణుగోపాల్ రెడ్డి, డీసీసీ జనరల్ సెక్రెటరీ చిలుకూరి బాలకృష్ణ , కౌన్సిలర్లు రవి నాయక్ , ఎండి జానీ పాషా, ముదిరెడ్డి నర్సిరెడ్డి , గౌట్ హై స్కూల్ హెడ్ మాస్టర్ దిరావత్ ధర్మానాయక్, ఇన్చార్జిలు ధీరవత్ రమేష్ నాయక్ , అంగోత్ చక్రి నాయక్ , కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ పాతూరి శరత్ మరియు ఎన్.వి.ఆర్ ఫౌండేషన్ సభ్యులు ఆడోత్ అశోక్ నాయక్ , గడగోజు ఆశోకచారి , గుడిపాటి కృష్ణ , మహేశ్వరపు అనిల్ కుమార్ , ధనావత్ నాగు నాయక్ , దాసరి భీమేష్ , కొమ్ముకోటి , ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు అభిమానులు బీఎల్ఆర్ బ్రదర్స్ పాల్గొన్నారు.

## కాళేశ్వరం పుష్కరాలపై సమీక్ష



**విశ్వంభర, భూపాలపల్లి :** భూపాల్ పల్లి జిల్లాలోని కాళేశ్వరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరిగిన సరస్వతి పుష్కరాలపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖాదికారి డాక్టర్ మధుసూదన్ సమీక్ష సమావేశం నిర్వహించారు. మే నెలలో జరిగే సరస్వతి పుష్కరాలలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే మెడికల్ క్యాంప్స్, సిబ్బంది, కావలసిన సామాగ్రి, మందులు చేయవలసిన ఏర్పాట్ల వసతులు మరియు ఫిబ్రవ లో జరిగే మహాకుంబాభిషేకం, రాబోయే మహా శివరాత్రి తదితర కార్యక్రమ ఏర్పాట్ల గురించి యన్.సి.వి.బి.డి.సి ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఉమాదేవి,మదర్ అండ్ చైల్డ్ హెల్త్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శ్రీదేవి, డిస్ట్రిక్ట్ ఇమ్మ్యూనైజెషన్ ఆఫీసర్ డాక్టర్ ప్రమోద్, ఎపిడోమాల జిస్ట్ భాషా నాయక్, డాక్టర్ సుస్మిత సమక్షంలో పీహెచ్సీ సిబ్బంది తో రివ్యూ నిర్వహించి దిశా నిర్దేశం చేసి తగుసూచనలు చేయటం జరిగింది.

## సమ్మక్క సారలమ్మలను దర్శించుకున్న ఎమ్మెల్యే నాయిని దంపతులు



**విశ్వంభర, మేడారం:** ఆసియ ఖండంలోనే అతిపెద్ద జన, వన జాతరైన ములుగు జిల్లా, మేడారం శ్రీ సమ్మక్క సారాలమ్మ సన్నిధిలో శుక్రవారం వరంగల్ పశ్చిమ నియోజకవర్గం శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి సతీమణి నాయిని నీలిమ రెడ్డి ,అల్లుడు విష్ణువర్ధన్ రెడ్డి కుటుంబ సభ్యులు అమ్మ వాళ్లకు మొక్కులు చెల్లించారు. ఆలయ సాంప్రదాయ పద్ధతుల్లో ఎమ్మెల్యే కుటుంబ సభ్యులకి పండితులు స్వాగతం పలికారు. అమ్మవార్లకు ప్రత్యేక పూజ కార్యక్రమం నిర్వహించి మొక్కులు సమర్పించుకున్నారు. తదనంతరం ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ సమ్మక్క సారలమ్మ వన దేవతల దీవెన వల్ల తెలంగాణ రాష్ట్రంలోని ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని అన్నారు.

## పీవైఎల్ జిల్లా సహాయ కార్యదర్శిగా అనిల్



**విశ్వంభర, నెల్లికుదురు:** పీవైఎల్ జిల్లా సహాయ కార్యదర్శిగా మండలంలోని బంజర గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు ఇరుగు అనిల్ ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన ఎంపికకు సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

## రోడ్లపై మతపరమైన నిర్మాణాలు తీసేయాలి



**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం (టి.పి.ఎస్.కే) తెలంగాణ సిటిజన్స్ రైట్స్ అసోసియోషన్ సంయుక్తంగా హైదరబాద్ బాగ్ లింగంపల్లెర్ సుందరయ్య విజ్ఞాన కేంద్రం లో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశం లో తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం రాష్ట్ర అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ హైదరాబాద్ నగరంలో 533 గుడులు, మస్జిద్ లు, చర్చ్ లు రోడ్లకు ఆటంకం గా ఉన్నాయి. వీటిని తోలగించాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన జీహెచ్ఎంసీ కేవలం 26 మాత్రమే తోలగించారని ఈ విషయంలో జీహెచ్ఎంసీ పూర్తి గా విఫలమైందని అన్నారు. 114 స్మశాన వాటికలు 357 రోడ్లు ఆక్రమణ కు గురైనాయని అన్నారు. తక్షణమే మత పరమైన నిర్మాణాలపై ఓ కమిటీ వేయాలని, విచారణ చర్యలు తీసుకోవాలని 2012 హైకోర్టు ఆదేశించినా నేటికీ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా ఉందని వారన్నారు. ఈ కార్యక్రమానికి గిరిష్ అధ్యక్షుడు గా వ్యవహరించారు. టి.పి.ఎస్.కే గౌరవ అధ్యక్షుడు జి రాములు కులనిర్మూలన సంఘం అధ్యక్షుడు వహిద్, గంజి ఈశ్వర్ లింగం, సౌమ్య, జి.యాదగిరిరావు, తుమ్మ భాస్కర్, శ్రీ మన్నారాయణ, ఐద్వా అరుణ శారదాదేవి, మహేష్ దుర్గే తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు సేవ చేయడమే నా లక్ష్యం

**విశ్వంభర, జూలూరుపాడు:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండల కేంద్రంలోని అనంతారం గ్రామంలో సాయిరామ్ సేవా సంస్థ ఆధ్వర్యంలో మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించా దానికి కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు అనంతారం గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కురసం రమేష్ ఎంతో కృషి చేశాడు. గ్రామంలో కిడ్నీ వ్యాధితో చిన్నతనంలోనే ప్రాణాలు కోల్పోతున్నారని, ఈ విషయం తనకు చాలా బాధ కలిగించిందని,ఆవేదన వ్యక్తం చేస్తూ ఖమ్మం లోని సాయి రామ్ హాస్పిటల్, జంగాల కోటేశ్వరరావు ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత హెల్త్ క్యాంపు ఏర్పాటు చేశారు. ఈ హెల్త్ క్యాంప్ నుడాక్టర్ కిషోర్ రెడ్డి, డాక్టర్.విజయ్ వర్మ ఆధ్వర్యంలో రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచిత మెడిసిన్ అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మాలోతు మంగీలాల్ నాయక్, ఉసికలవెంకటేశ్వర్లు, రేపకోటేశ్వరరావు, శ్రీకాంత్, ప్రభాకర్, గోపయ్య, జూలూరుపాడు సర్కిల్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి పాల్గొన్నారు.

## మంద కృష్ణ మాదిగను కలిసిన నాయకులు



**విశ్వంభర, పాల్వంచ:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలో జరిగిన వేల గొంతులు లక్ష డబ్బులు వచ్చే నెలలో హైదరాబాదులో జరిగే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ ఏర్పాటు చేసిన సభకు ముఖ్యఅతిథిగా వచ్చిన ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మంద కృష్ణ మాదిగను తుడుం దెబ్బ జిల్లా నాయకులు తంబల్ల రవి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో తుడుం దెబ్బ నాయకులు తంబళ్ల రవి, వాసం పోలయ్య, ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీలు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తులపై ఇంటింటి సర్వే



**విశ్వంభర, రాజన్న సిరిసిల్ల :** తంగళ్ళపల్లి మండలంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లపై దరఖాస్తులను ఇంటింటా సర్వే ఫీల్డ్ లో భాగంగా బి శేషాద్రి మండల్ నోడల్ ఆఫీసర్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి లక్ష్మీనారాయణ, పాపయ్య పల్లె గ్రామంలో దరఖాస్తుదారుల వివరాలను పరిశీలించడం జరిగిందని, మండలంలో పలు గ్రామాలలో సర్వే నిర్వహించడం జరుగుతున్నదని తెలిపారు.

## ఫుట్ పాతులపై డబ్బాల తొలగింపు




**విశ్వంభర, హైదరాబాద్:** బాగ్లింగంపల్లి సుందరయ్య పార్కు, సుందరయ్య విజ్ఞాన కేంద్రం పరిసరాలలో ఫుట్ పాత్ పై డబ్బాలను శుక్రవారం సాయంత్రం సెంట్రోజెన్ అడిషనల్ డీజీపీ ట్రాఫిక్ రామదాసు తేజావత్, ట్రాఫిక్ ఏసీపీ బి ఎర్రా, జీహెచ్ఎంసీ ఏసీపీ దేవేందర్ల ఆధ్వర్యంలో సుమారు రెండు గంటల పాటు చిరు వ్యాపారులు అని కనికరం లేకుండా వారి జీవనోపాధికి అడ్డుగా ఉన్నటువంటి డబ్బాలను తోపుడుబండ్లను తొలగించారు.

## ఏసీబీ వలలో చిక్కిన ఆర్ ఐ శ్యాం నాయక్



**విశ్వంభర, డిండి:** నల్లగొండ జిల్లా డిండి మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ గా పనిచేస్తున్న శ్యాం నాయక్ శుక్రవారం ఏసీబీ వలలో చిక్కాడు. వివరాలకు వెళ్తే డిండి మండలంలోని పడమటి తండా కు చెందిన పాండు నాయక్ తన కూతురు కు రావలసిన కళ్యాణ లక్ష్మి చెక్కు నిమిత్తము ఆర్ ఐ శ్యామ్ నాయకు ను అనేకసార్లు కలిసి విన్నవించినప్పటికీ , పదివేల రూపాయలు డిమాండ్ చేసినట్లు తెలిసింది. చివరకు ఐదువేల రూపాయలు ఇస్తానని ఒప్పందం కుదుర్చుకొని పాండు నాయక్ ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. హైదరాబాదులోని హస్తినాపురంలోని ఊర్మిళా నగర్ లో నివాసం ఉంటున్న శ్యామ్ నాయక్ శుక్రవారం ఉదయం ఎనిమిది గంటలకు పాండు నాయక నుండి 5వేల రూపాయల నగదును తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. ఏసీబీ బృందంలో ఇన్స్పెక్టర్ బి వెంకటరావు, బి రామారావు, సుజాత, రంగారెడ్డి ఇతర అధికారులు పాల్గొన్నారు.

www.vishvambhara.com

తెలుగు దినపత్రిక

# విశ్వంభర

అక్షరం సాక్షిగా..

శనివారం
18-01-2025

సంపుటి : 01 | సంచిక : 256 | పేజీలు : 12 | వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్



డా॥ కాచం సత్యనారాయణ
CMD

## విశాఖ ఉక్కుకు రూ.11,440 కోట్లు

- ప్యాకేజీ ప్రకటించిన కేంద్రం
- అధికారికంగా వెల్లడించిన కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్
- తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఉన్న కర్మాగారానికి పునర్వైభవం తీసుకురావాలని నిర్ణయం
- స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నాం: రామ్మోహన్ నాయుడు

10




## విశాఖ ఉక్కును కాపాడుకోగలిగాం

- విశాఖ స్టీల్ ప్లాంట్ నిర్వహణకు ఎప్పుడు ఇబ్బంది వచ్చినా ఆదుకున్నది ఎన్డీయే ప్రభుత్వమే
- చిత్తశుద్ధితో ముందుకు పోయాం
- ఏడు నెలలుగా చేసిన ప్రయత్నాలు ఫలించాయి
- సీఎం చంద్రబాబు

5



# నైపుణ్యాల అభివృద్ధికి కలిసి పనిచేద్దాం

### ఐటీఈతో స్కిల్ యూనివర్సిటీ ఎంవోయూ

- సీఎం రేవంత్ సింగపూర్ పర్యటనలో తొలి రోజునే కీలక ఒప్పందం
- త్వరలోనే హైదరాబాద్‌ను సందర్శించనున్న ఐటీఈ ప్రతినిధి బృందం
- సింగపూర్ విదేశాంగ మంత్రి వివియన్ బాలకృష్ణన్‌తో కూడా రేవంత్‌రెడ్డి భేటీ
- గ్రీన్ ఎనర్జీ, మూసీ పునరుజ్జీవనం, పర్యాటకం, విద్య, ఐటీ, నైపుణ్య నిర్మాణంపై చర్చ




**విశ్వంభర, సింగపూర్:**

ముఖ్యమంత్రి విదేశీ పర్యటనకు తొలిరోజునే విశేష స్పందన లభించింది. పర్యటనలో భాగంగా తెలంగాణ రైజింగ్ టీమ్ శుక్రవారం సింగపూర్ లో పర్యటించింది. సీఎం రేవంత్ రెడ్డి వెంట ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్, టీజీఐఐసీ ఎండీ విష్ణువర్ధన్, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ వీఎల్ వీ ఎస్ఎస్ సుబ్బారావు ఈ టీమ్‌లోఉన్నారు. తొలి రోజునే తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం సింగపూర్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఐటీఈ) క్యాంపస్ ను సందర్శించింది. అక్కడ మిగతా5లో...

సీఎం రేవంత్‌రెడ్డి సింగపూర్‌లో పర్యటిస్తున్నారు. ఈ పర్యటనలో అక్కడి ఐటీఈతో(ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్) తెలంగాణలోని యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ఒప్పందం చేసుకుంది. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు సమక్షంలో ఈ ఒప్పందం జరిగింది. ఇందులో భాగంగా ఐటీఈ పాఠ్యాంశాలను స్కిల్ వర్సిటీ ఉపయోగించుకోనుంది. ఈమేరకు స్కిల్ వర్సిటీ వీసీ, ఐటీఈ డిప్యూటీ డైరెక్టర్ మధ్య ఒప్పందం కుదిరింది. సింగపూర్ విదేశాంగ మంత్రి వివియన్ బాలకృష్ణన్‌తో కూడా రేవంత్‌రెడ్డి భేటీ అయ్యారు. గ్రీన్ ఎనర్జీ, మూసీ పునరుజ్జీవనం, పర్యాటకం, విద్య, ఐటీ, నైపుణ్య నిర్మాణంపై వారు చర్చించారు. సీఎంతో పాటు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ భేటీలో పాల్గొన్నారు.

## భారత్ పెట్టుబడులకు స్వర్గధామం

- ప్రతీ పెట్టుబడిదారుడికి అత్యుత్తమ గమ్యస్థానం
- ఎలక్ట్రిక్ మొబిలిటీ విస్తరణకు ప్రభుత్వం విధానపరమైన నిర్ణయాలు తీసుకుంటోంది
- మేక్ ఇన్ ఇండియా కార్యక్రమానిది దేశంలో ఆటో పరిశ్రమ అభివృద్ధిలో కీలక పాత్ర



9

## పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక

- ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇచ్చే బాధ్యత ప్రభుత్వానిదే
- మొదటి విడతలో ఇంటి స్థలం ఉన్నవారికి ప్రాధాన్యం
- రెండో విడతలో ఇంటి స్థలంతోపాటు ఇందిరమ్మ ఇంటిని నిర్మించి ఇస్తాం
- జీహెచ్ఎంసీలో ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపికకు ప్రత్యేక కార్యాచరణ
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



5

## సబ్ ప్లాన్ నిధులను పూర్తిస్థాయిలో వినియోగించాలి

### శాఖల వారీగా ఖర్చుల వివరాలు ప్రతినెలా వెల్లడించాలి

పట్టణాల్లో ఎస్సీ, ఎస్టీలకు విస్తృతంగా స్వయం ఉపాధి పథకాలు అందుబాటులోకి తెస్తాం

ఆవర్గాల మహిళలను గుర్తించి స్వయం సహాయక సంఘం సభ్యులుగా చేర్పించాలి

వారికి వడ్డీ లేని రుణాలు అందించి వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దాలి

ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం అమలు తీరుపై భట్టి విక్రమార్క సమీక్ష



**విశ్వంభర, హైదరాబాద్:**

ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం ప్రకారం నిధులు ఖర్చు చేయాలని.. శాఖల వారీగా ఖర్చుల వివరాలు ప్రతినెలా వెల్లడించాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం అమలు తీరుపై భట్టి విక్రమార్క సమీక్ష నిర్వహించారు. సబ్ ప్లాన్ నిధులను పూర్తిస్థాయిలో వినియోగించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రజల ఆదాయం పెరిగేలా అధికారులు ప్రణాళికలు తయారు చేయాలని భట్టి విక్రమార్క ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌పై ఈనెల 23న సమావేశం నిర్వహించనున్నట్లు చెప్పారు. కోటా ప్రకారం మిగతా5లో...



## పల్లెను గెలుద్దాం.. ఢిల్లీని ఏలుదాం

- వచ్చేది బీసీల రాజ్యమే
- రాష్ట్రంలో బిసి ఉద్యమం బలంగా ఉంది..
- బీసీ రిజర్వేషన్లు పెంచకుండా స్థానిక ఎన్నికలకు వెళితే సహించం.
- మేధావులు బీసీ ఉద్యమాన్ని భూజానికెత్తుకోవాలి
- బీసీ సంఘం జాతీయ అధ్యక్షులు, ఎంపీ ఆర్.కృష్ణయ్య

5



### ఆరు గ్యారెంటీలని చెప్పి..

## అర గ్యారెంటీ మాత్రమే అమలు చేశారు

- హామీల అమలులో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైంది
- రైతులందరికీ రుణమాఫీ చేశామని నిరూపిస్తే రాజీనామా చేస్తా
- ఓట్లు అడిగేందుకు వచ్చే కాంగ్రెస్ నాయకులను నిలదీయాలి
- షాబాద్ రైతుదీక్షలో కేటీఆర్ వ్యాఖ్యలు
- ఈసభలో రేవంత్‌పై మండిపడ్డ మహిళా రైతు చెన్నమ్మ

**విశ్వంభర, షాబాద్:** కాంగ్రెస్ నాయకులు ఆరు గ్యారెంటీలని చెప్పి.. అర గ్యారెంటీ మాత్రమే అమలు చేశారని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. చేవెళ్ల నియోజకవర్గం షాబాద్‌లో నిర్వహించిన రైతు దీక్షలో ఆయన ప్రసంగించారు. హామీల అమలులో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ధ్వజమెత్తారు. మిగతా5లో...

మరిన్ని తాజా వార్తల కోసం స్కాన్ చేయండి



### నేటి చికెన్ ధరలు

| ఫామ్ ధర | రిటైల్ |
|---|---|
| ₹ 117 | ₹ 139 |
| **స్కిన్** | **స్కిన్ లెస్** |
| ₹ 202 | ₹ 229 |

### అంతేగా!




## తెలంగాణకు తీరని ద్రోహం చేశారు

### కృష్ణా నీటి వాటాల పాపం బీఆర్ఎస్‌దే

- పదేళ్లుగా పట్టించుకోకుండా ఇప్పుడు నీతులు చెబుతున్నారు
- తాత్కాలిక కేటాయింపులపై ప్రతి ఏడాది సంతకాలు చేసింది వారుకాదా?
- బీఆర్ఎస్ హయాంలోనే ఏపీ ప్రభుత్వం కృష్ణా జలాలను అడ్డగోలుగా తరలించింది
- తెలంగాణకు 70 శాతం వాటా రావాలనే వాదనను లేవనెత్తింది కాంగ్రెస్ ప్రభుత్వం
- భారీ నీటిపారుదల శాఖామంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



విశ్వంభర, హైదరాబాద్: నీటి వాటాల పాపం బీఆర్ఎస్‌దేనని, పదేళ్ల పాటు తెలంగాణకు తీరని ద్రోహం చేశారని నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి మండిపడ్డారు. కృష్ణా జలాలను పదేళ్లుగా పట్టించుకోని బీఆర్ఎస్ నేతలు ఇప్పుడు నీతులు చెబుతున్నారని ఆక్షేపించారు. ఉమ్మడి ఏపీకి కేటాయించిన 811 టీఎంసీల్లో తెలంగాణకు 299, ఏపీకి 512 టీఎంసీలు వాడుకునేలా ఒప్పందం మిగతా5లో...

### నేడు గ్రూప్-2

## ప్రాథమిక కీ విడుదల

- 18 నుంచి 22వరకు అభ్యంతరాల స్వీకరణ
- ప్రకటించిన టీజీపీఎస్సీ




5



తెలుగు జాతి సగర్వంగా తలెత్తుకునేలా చేసిన మహనీయులెందరో ఉన్నారు. వారిలో నందమూరి తారక రామారావు ముందు వరుసలో నిలుస్తారు. తెలుగు వారికి రాముడు, కృష్ణుడు ఆయనే. తెలుగు తెరపై అంతలా.. చెరగని ముద్ర వేశారు. తరాలు మారినా తెలుగు వారి గుండెల్లో చిరస్థాయిగా నిలిచే పేరు ఎన్టీఆర్. సినీ రంగంలో ఎవరెస్ట్ అంత ఎత్తుకు ఎదిగినా.. రాజకీయాల్లో ప్రవేశించి పెను మార్పులు తీసుకొచ్చినా ఎన్టీఆర్‌కే చెల్లింది. తెలుగు దేశం పార్టీ స్థాపించిన తొమ్మిది నెలల్లోనే అధికారంలోకి రావడం, ముఖ్యమంత్రి అవ్వడం అనేది నాటికీ, నేటికీ.. ఎప్పటికీ ఓ అరుదైన రికార్డే. నేడు సీనియర్ ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా విశ్వంభర ప్రత్యేక కథనం..

# తెలుగు జాతికి ఘనకీర్తి తెచ్చిన మహనీయుడు

## సినీరంగం ద్వారా తెలుగు ప్రజల్లో గుండెల్లో చెరగని ముద్రవేసిన మహానటుడు

## కాషాయం కట్టిన లౌకికవాది నందమూరి తారకరామారావు

తెలుగువారి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయే పేరు ఎన్టీఆర్. కృష్ణా జిల్లా పామర్రు మండలంలోని నిమ్మకూరు గ్రామంలో నందమూరి తారక రామారావు జన్మించారు. సినిమాల్లో రాముడు, కృష్ణుడిగా ఆయన వేసిన పాత్రలు జనం గుండెల్లో నిలిచిపోయాయి. దాన వీర శూర కర్ణ సినిమా అయితే రికార్డులను కొల్లగొట్టింది. రాజకీయాల్లో కూడా ఎన్టీఆర్ తనదైన ముద్రవేశారు. ముఖ్యమంత్రిగా ఆంధ్రప్రదేశ్‌లో అనేక సంస్కరణలు తీసుకొచ్చారు ఎన్టీఆర్.

**ఎన్టీఆర్ వ్యక్తిగత జీవితం..**

నందమూరి తారక రామారావు 1923 మే 28న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కృష్ణా జిల్లా పామర్రు మండలంలోని నిమ్మకూరు గ్రామంలో లక్ష్మయ్య, వెంకట రామమ్మ దంపతులకు జన్మించారు. చిన్నతనంలో నాటకాలు వేసేవారు. ఆర్థిక పరిస్థితులు బాగోలేకపోవడంతో చిన్నాచితకా పనులు చేసేవారు. చివరకు ఎన్టీఆర్‌కు సబ్-రిజిస్ట్రారు ఉద్యోగం వచ్చింది. నటన మీద మమకారంతో దాన్ని మధ్యలోనే వదిలేసి సినిమాల్లోకి వచ్చారు ఎన్టీఆర్.

**ఎన్టీఆర్ కుటుంబం..**

తారక రామారావు, బసవతారకం దంపతులకు 11 మంది సంతానం. పదకొండు మందిలో ఏడుగురు కుమారులు, నలుగురు కుమార్తెలు. జయకృష్ణ, సాయికృష్ణ. హరికృష్ణ, మోహనకృష్ణ, బాలకృష్ణ, రామకృష్ణ, జయశంకర్ కృష్ణ కుమారులు కాగా.. లోకేశ్వరి, దగ్గుబాటి పురంధరేశ్వరి, నారా భువనేశ్వరి, కంటమనేని ఉమామహేశ్వరి కుమార్తెలు.

**ఎన్.టి. రామారావు సినీ జీవితం..**

పల్లెటూరి పిల్ల సినిమాతో అరంగేట్రం చేశారు ఎన్టీఆర్. అయితే, ఆ తర్వాత నటించిన 'మన దేశం' సినిమాను ముందు విడుదలైంది. ఆ తర్వాత పాతాళ భైరవి, మల్లీశ్వరీ, మాయాబజార్ ఇలా ఎన్నెన్నో బ్లాక్ బస్టర్ హిట్స్.. ఎన్టీఆర్ ఖాతాలో నిలిచాయి. స్వీయ దర్శకత్వంలో మూడు పాత్రల్లో నటించిన దాన వీర శూర కర్ణ అయితే దర్శకులకు, నటీనటులకు నేటికీ ఒక పాఠం లాంటి సినిమా. ఆ సినిమా ఎన్నో రికార్డులను బద్దలు కొట్టింది. అడవి రాముడు, యమగోల మళ్లీ కొత్త ఎన్టీఆర్‌ను అందరికీ పరిచయం చేశాయి. రాజకీయాల్లో బిజీగా ఉంటూనే బ్రహ్మర్షి విశ్వామిత్ర సినిమాలో నటించారు.

**అవార్డులు**

విశ్వ విఖ్యాత నటసార్వభౌముడుగా పేరుగాంచిన ఎన్టీఆర్.. తన 44 ఏళ్ల సినిమా జీవితంలో 13 చారిత్రకాలు, 55 జానపద సినిమాలు, 186 సాంఘిక, 44 పౌరాణిక చిత్రాలు చేశారు. 1968 భారత ప్రభుత్వం నుంచి పద్మశ్రీ అవార్డ్ అందుకున్నారు. 1978లో ఆంధ్రా విశ్వవిద్యాలయం నుంచి గౌరవ డాక్టరేటు 'కళాప్రపూర్ణ' స్వీకరించారు.

**ఎన్.టి.ఆర్. రాజకీయ జీవితం**

1982 మార్చి 29 సాయంత్రం 2:30 లకు కొత్త పార్టీ పెడుతున్నట్లు హైద్రాబాద్‌లో ప్రకటించారు ఎన్టీఆర్. దాని పేరు తెలుగుదేశం పార్టీగా ప్రకటించారు. చైతన్య రథంలో రాష్ట్రమంతా సుడిగాలి పర్యటన చేశారు. 1983 జనవరి 7న మధ్యాహ్నం ఎన్నికల ఫలితాలను ప్రకటించారు. ఆ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి 199 సీట్లు వచ్చాయి. అలా పార్టీ పెట్టిన తొమ్మిది నెలల్లోనే ఎన్టీఆర్.. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. రాజకీయ నాయకుడిగా ఎన్టీఆర్ ఎన్నో సవాళ్లు ఎదుర్కొన్నారు. ఎన్నో విప్లవాత్మకమైన సంస్కరణలు చేపట్టారు. శాసనమండలిని రద్దు చేశారు. ఇదే సమయంలో తన సేవకురాలు లక్ష్మీపార్వతిని వివాహం చేసుకున్నారు.

1989 ఎన్నికల్లో మళ్లీ కాంగ్రెస్ గెలిచింది. తెలుగుదేశం పార్టీ ఓడింది. దేశ స్థాయిలో కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయంగా నేషనల్ ఫ్రంట్‌ను ఏర్పాటు చేయడంలో ఎన్టీఆర్ చొరవ చూపించారు. మళ్లీ 1994లో కిలో బియ్యం రెండు రూపాయలు, సంపూర్ణ మద్య నిషేధం లాంటి హామీలతో మళ్లీ ఎన్టీఆర్ అధికారంలోకి వచ్చారు. ఆ తర్వాత కొద్ది కాలానికే పార్టీలో జరిగిన అంతర్గత సంక్షోభం వల్ల ఎన్టీఆర్‌ను ముఖ్యమంత్రి పదవి నుంచి తప్పించి చంద్రబాబును తమ నేతగా ఎన్నుకున్నారు టీడీపీ ఎమ్మెల్యేలు. 1996 జనవరి 18న ఎన్టీఆర్ గుండెపోటుతో కన్నుమూశారు. అప్పటికి ఆయన వయస్సు 73 సంవత్సరాలు.



**ఎటువంటి రాజకీయ నేపథ్యం లేకుండానే ప్రజా జీవితంలోకి..**

ఎటువంటి రాజకీయ నేపథ్యం లేకుండానే ప్రజా జీవితంలోకి వచ్చినా.. రాష్ట్రాల స్వతంత్ర ప్రతిపత్తిని, సమాఖ్య వ్యవస్థ అవసరాన్ని నొక్కిచెప్పి తనదైన ఒక సైద్ధాంతిక పునాదిని ఎన్టీఆర్ ప్రతిపాదించారు. రాజకీయాన్ని వృత్తిగా కాకుండా లక్ష్యసాధనకు మార్గంగా పరిగణించారు. నందమూరి తారక రామారావు రాజకీయ జీవితం అంతా కలిపితే పద్నాలుగేళ్లు కూడా ఉండదు. అంత తక్కువ సమయంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్ని తీవ్రంగా ప్రభావితం చేసిన వాళ్లు మరొకరు లేరు. ఎటువంటి రాజకీయ నేపథ్యం లేకుండా ఆయన రాజకీయాల్లోకి వచ్చారు. అయినా, తెలుగుదేశం పార్టీకి గట్టి సిద్ధాంత పునాది కల్పించారు. రాష్ట్రాల హక్కుల కోసం ఎడతెగని పోరాటం చేశారు. కేంద్రం పెత్తనాన్ని ఎదుర్కొన్నారు. పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే కమ్యూనిస్టులు, భాజపా నేతలను ఒకతాటి మీదకు తీసుకువచ్చారు. 1989లో నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వం ఏర్పడటంలో ముఖ్య భూమిక పోషించారు. నటుడిగానే కాకుండా, రాజకీయ నాయకుడిగా కూడా సామాన్య ప్రజానీకం మీద అంత ప్రభావం చూపిన వ్యక్తి తెలుగునాడులో మరొకరు లేరు.

ఎన్టీఆర్ రాజకీయ జీవితంలో అనేక అబ్బురపరిచే అంశాలున్నాయి. అరవై ఏళ్ల వయసులో రాజకీయరంగ ప్రవేశమొక్కటే విశేషం కాదు. పార్టీ పెట్టిన 9 నెలల్లోనే అధికారాన్ని చేజిక్కించుకున్న ఆయన రికార్డును అన్నాడీఎంకే నుంచి ఆమ్ ఆద్మీ పార్టీ వరకు ఇంతవరకు ఎవరూ అధిగమించలేదు. ఉత్తర భారతంలో విస్తృతంగా పర్యటించి, హరియాణా నుంచి అసోం వరకు జనాన్ని ఉర్రూతలూగించిన దక్షిణాదికి చెందిన ఏకైక నాయకుడు ఎన్టీఆరే.

ఎటువంటి రాజకీయ నేపథ్యం లేకుండానే ప్రజా జీవితంలోకి వచ్చినా.. రాష్ట్రాల స్వతంత్ర ప్రతిపత్తిని, సమాఖ్య వ్యవస్థ అవసరాన్ని నొక్కిచెప్పి తనదైన ఒక సైద్ధాంతిక పునాదిని ఎన్టీఆర్ ప్రతిపాదించారు. ఒక ప్రాంతీయ పార్టీ నాయకుడైనా జాతీయ ప్రత్యామ్నాయం కోసం అహర్నిశలూ కృషి చేశారు. కాషాయ వస్త్రాలను ధరించినా లౌకికవాదాన్ని బలంగా నమ్మారు. తెలుగు ఆత్మగౌరవ నినాదంతో వచ్చినా, జాతీయవాదిగా నిలబడ్డారు. సంక్షేమ పథకాలకు మారుపేరుగా నిలిచినా, ప్రైవేటు రంగ ప్రాధాన్యాన్ని గుర్తించారు. భూస్వామ్య నేపథ్యం నుంచి వచ్చినా, పాలనావ్యవస్థలో పెనుమార్పులు తీసుకువచ్చారు. రాజకీయాన్ని వృత్తిగా కాకుండా లక్ష్యసాధనకు మార్గంగా పరిగణించారు. రాజకీయ పదవులను తృణప్రాయంగా చూశారు.

**అంతర్జాతీయ యవనికపై తెలుగు బావుటా..!**

ఎన్టీఆర్ తెలుగువారి ఆత్మగౌరవ నినాదంతో రాజకీయాల్లోకి వచ్చారు. ఆయనను రాజకీయంగా విభేదించే వారు కూడా.. తెలుగు జాతికి గుర్తింపును తీసుకొచ్చిన వ్యక్తిగా ఎన్టీఆర్‌ను అభిమానిస్తారు. ఎన్టీఆర్ ఒక సునామీలాగా రాష్ట్ర రాజకీయాల్లోకి వచ్చి, అధికారాన్ని చేజిక్కించుకున్న సమయంలో ఐఏఎస్ అధికారి, ప్రముఖ ఆర్థిక వేత్త బీపీఆర్ విఠల్ ..సూడాన్ ప్రభుత్వంలో ఆర్థిక సలహాదారుగా పనిచేస్తున్నారు. 'ఎన్టీఆర్ ప్రమాణ స్వీకారాన్ని నేను సూడాన్ టీవీలో చూశాను. భారతదేశంలో తెలుగువారు ఒకరున్నారని ఈ ప్రాంతంలో మొదటిసారిగా తెలిసింది. తెలుగువారిగా గుర్తింపు కోసం మద్రాసు రాష్ట్రం నుంచి విడిపోయినా, నిజానికి ఆ గుర్తింపు వచ్చింది ఎన్టీఆర్ రాకతోనే' అని విఠల్ రాశారు.ఎన్టీఆర్ ఆత్మగౌరవ నినాదానికి ఒక ప్రత్యేకత ఉంది. అది ఇతర రాష్ట్రాల వారికి, భాషల వారికి వ్యతిరేకం కాదు. ఎన్నడూ మరొక భాషను, ప్రజా సమూహాన్ని వేలెత్తి చూపలేదు. దూషించలేదు. కాంగ్రెస్ దిల్లీ నాయకత్వం మీదే ఆయన తన విమర్శలు గురిపెట్టారు. ఈ విషయంలో తమిళనాడు, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో జరిగిన భాషా ఉద్యమాలకి, ఎన్టీఆర్ తెలుగు ఆత్మ గౌరవ పోరాటానికి గుణాత్మక తేడా ఉంది. ఆయన ఎన్నడూ వేరొక సంస్కృతిని కించపరచలేదు. ద్రవిడ పార్టీల మాదిరిగా ఉత్తరాది మీద, మరీ ముఖ్యంగా హిందీ మీద వ్యతిరేకత చూపలేదు. పైగా ఇతర భాషలకు, మైనారిటీ వర్గాల సంస్కృతి, సంప్రదాయాలకు ప్రత్యేక రక్షణ కల్పిస్తామని కూడా ఎన్టీఆర్ తొలి మ్యానిఫెస్టోలో పేర్కొన్నారు. అందుకే తెలుగు భాషాసంస్కృతులకు అంతర్జాతీయ ప్రాభవం తీసుకొచ్చిన ఆయనను తెలుగు జాతి ఎన్నటికీ మరువలేదు.

**ఎన్టీఆర్ గురించి ఒక పది విషయాలు..**

- 1982లో తెలుగు దేశం పార్టీని స్థాపించిన అనంతరం ఎన్టీఆర్ ప్రచారరీత్యా 90 రోజుల వ్యవధిలో 35000 కిలోమీటర్లు ప్రయాణించారు. అది ఒక ప్రపంచ రికార్డుగా ఆయన అభివర్ణిస్తారు.
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సంవత్సరాల తరబడి ముఖ్యమంత్రి పదవి కాంగ్రెస్ చేతిలో ఉండేది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఎన్టీఆర్ మొదటి కాంగ్రెసేతర ముఖ్యమంత్రి.
- 1940ల్లో కుటుంబానికి అండగా ఉండడం కోసం విజయవాడలో హోటళ్లకు ఎన్టీఆర్ పాలు పోసేవారు.
- 40 ఏళ్ళ వయసులో ఎన్టీఆర్ నృత్యం నేర్చుకోవడం మొదలుపెట్టారు. ప్రముఖ కూచిపూడి డాన్సర్ వెంపటి చినసత్యం దగ్గర ఆయన నృత్యం నేర్చుకున్నారు.
- ఎన్టీఆర్ ను భగవత్స్వరూపంగా భావించే ఆయన అభిమానులను అలరించడానికి ఆయన 17 సినిమాలలో శ్రీ కృష్ణుడి వేషం కట్టారు.
- ఆలయాల్లో పూజారి వృత్తిని చేపట్టే అవకాశాన్ని పరీక్ష ద్వారా బ్రాహ్మణేతరులకు కూడా కల్పించింది ఎన్టీ రామారావే.
- ఎన్టీఆర్ ఒకసారి న్యూయార్క్ వెళ్లినప్పుడు అక్కడి స్టాట్యూ అఫ్ లిబర్టీని చూసి మైమరచిపోయారంట. అలాంటి విగ్రహం హైదరాబాద్‌లో కూడా ఉండాలని ట్యాంక్ బండ్ దగ్గర ఉన్న బుద్ధుడి విగ్రహాన్ని చెక్కించడం మొదలుపెట్టారు.
- శ్రీమద్విరాట్ పోతులూరి వీర బ్రహ్మేంద్ర స్వామి చరిత్ర' సినిమాలోని ఒక సీన్ ని కట్ చెయ్యాలని సెన్సార్ బోర్డు పట్టుబడితే... ఎన్టీఆర్ కోర్టుకు వెళ్లి 3 ఏళ్ళ తరువాత కేసు గెలిచి సినిమాను విడుదల చేసుకున్నారు.
- 1987 హర్యానా ఎన్నికల్లో దేవీ లాల్ కు మద్దతుగా ప్రచారం చెయ్యడానికి ఆయన తనయుడు నందమూరి హరికృష్ణను తోడుగా తీసుకొని హైదరాబాద్ నుంచి రోడ్ మార్గంలో వెళ్లారు. అనూహ్యంగా దేవి లాల్ ఆ ఎన్నిక గెలిచి ముఖ్యమంత్రి కూడా అయ్యారు.
- తెలుగు సంప్రదాయానికి ప్రాధాన్యమిచ్చే ఎన్టీఆర్.. మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు ఇంటికి వచ్చినప్పుడు బయటకు వెళ్లి చెంబుతో స్వయంగా నీళ్లిచ్చి కాళ్లు కడిగించి లోపలికి తీసుకొచ్చారు. ఇంటికి విందుకు ఆహ్వానించినప్పుడు, ఎన్టీఆరే స్వయంగా అతిథులకు భోజనం వడ్డించేవారు.
- ఎన్టీఆర్ కృష్ణుడు, రాముడు, వెంకటేశ్వరుడు లాంటి పురాణ పాత్రలు చేసిన సినిమాల్లో ఎడమచేతితోనే ఆశీర్వదించేవారు, అభయం ఇచ్చేవారు. అలా ఎందుకని చాలా మందికి సందేహం ఉండేది, కొందరు ఆయన్నే డైరెక్టుగా అడిగారు కూడా.దానికి ఎన్టీఆర్ స్పందిస్తూ.. "మన హృదయం ఉన్నది ఎడమవైపు. పూజలలో భార్యను ఎడమవైపే కూర్చోబెట్టుకుంటాం. మన శరీరంలోని మాలిన్యాన్ని శుభ్రం చేసేది కూడా ఎడమ చెయ్యే. ఎడమ భాగానికున్న ప్రాధాన్యత కుడి భాగానికి లేదు. అందుకే ఎడమ చేతితోనే ఆశీర్వదిస్తున్నాను" అన్నారట.. అవతలివారు ఆశ్చర్యపోయాక అసలు గుట్టు విప్పేవారట ఎన్టీఆర్. సినిమాల్లో తీసే అడ్వెంచర్స్, ఫైటింగుల వల్ల, ఒక రోడ్డు ప్రమాదం వల్ల ఎన్టీఆర్ కుడిచెయ్యి నాలుగు సార్లు విరిగింది. వరుస ప్రమాదాలతో కుడిచేయి పట్టు తప్పడంతో ఎడమచేత్తోనే దీవెనలు ఇవ్వడం ప్రారంభించారట ఎన్టీఆర్.









## నేడు గ్రూప్-2 ప్రాథమిక కీ విడుదల

**విశ్వంభర, హైదరాబాద్:** గ్రూప్-2 ప్రాథమిక కీ శనివారం విడుదల చేయనున్నట్లు టీజీపీఎస్సీ ఓ ప్రకటనలో తెలిపింది. ఈనెల 18 నుంచి 22 వరకు అభ్యర్థుల లాగిన్‌లో ప్రాథమిక కీ అభ్యంతరాలను స్వీకరిస్తారు. రాష్ట్రంలో 783 గ్రూప్-2 పోస్టుల భర్తీకి టీజీపీఎస్సీ పరీక్షలు నిర్వహించింది. రాష్ట్రవ్యాప్తంగా 1368 కేంద్రాల్లో ఈ పరీక్షలు జరిగాయి.

## విశాఖ ఉక్కును కాపాడుకోగలిగాం

**విశ్వంభర, మంగళగిరి:** విశాఖ స్టీల్ ప్లాంట్ నిర్వహణకు ఎప్పుడు ఇబ్బంది వచ్చినా ఆదుకున్నది ఎన్డీయే ప్రభుత్వమేనని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్రకార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు.''గడిచిన ఐదేళ్లలో స్టీల్ ప్లాంట్‌ను పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. స్టీల్ ప్లాంట్‌ను కాపాడుతామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చాం. పట్టుదలతో పనిచేశాం. చిత్తశుద్ధితో ముందుకు పోయాం. ఏడు నెలలుగా చేసిన ప్రయత్నాలు ఈ రోజు ఫలించాయి. ప్రధాన మంత్రి దీనిపై సానుకూలంగా స్పందించారు. అసాధ్యమనుకున్నది సాధ్యమైంది. ఇది విశాఖ ప్రజల అభీష్టం..కార్మికుల శ్రమ. విశాఖ ఉక్కును మళ్లీ కాపాడుకోగలిగాం. రూ.11,440 కోట్లు రివైవ్ ప్యాకేజీ ఇవ్వడం అరుదైన అనుభవం. స్టీల్ ప్లాంట్‌కు 20వేల ఎకరాల భూమి ఉంది. ఏ స్టీల్ ప్లాంట్‌కు ఇంత భారీ భూమి లేదు. అందరం కలిసి కష్టపడి స్టీల్ ప్లాంట్‌ను అభివృద్ధి బాటలో నడిపించి మంచి పేరు తీసుకురావాలని కార్మికులకు విజ్ఞప్తి చేస్తున్నా'' అని చంద్రబాబు తెలిపారు.

## సబ్ ప్లాన్ నిధులను పూర్తిస్థాయిలో వినియోగించాలి

(మొదటి పేజీ తరువాయి)
ఇప్పటివరకు నిధులు ఖర్చు చేయని శాఖల అధికారులు రాబోయే రెండు నెలల్లో లక్ష్యాన్ని చేరుకునేందుకు ఎలాంటి ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారో తెలపాలని భట్టి ఆదేశించారు. అటవీ భూముల్లో సోలార్ పవర్ ద్వారా మోటార్లు వినియోగించడం.. వెదురు, అవకాడో, పామాయిల్ సాగుకు అనువైన ప్రాజెక్టులు డిజైన్ చేయాలని అధికారులను ఉపముఖ్యమంత్రి ఆదేశించారు. ఉపాధి హామీ పథకం పనులను అనుసంధానం చేసుకోవాలన్నారు. తద్వారా అడవులను సంరక్షించడంతోపాటు ఆదివాసీ, గిరిజన రైతులకు ఆదాయం పెరిగేందుకు అవకాశం ఉంటుందన్నారు. మూసీ పునరుజ్జీవనం కార్యక్రమంలో భాగంగా నిర్వాసితులవుతున్న ఎస్సీ, ఎస్టీ మహిళలను గుర్తించి స్వయం సహాయక సంఘం సభ్యులుగా చేర్పించాలన్నారు. వారికి వడ్డీ లేని రుణాలు అందించి వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దాలన్నారు. పట్టణాల్లో ఎస్సీ, ఎస్టీలకు స్వయం ఉపాధి పథకాలు విస్తృతంగా అందుబాటులోకి తీసుకురావాలన్నారు.

## ఆరు గ్యారెంటీలని చెప్పి.. అర గ్యారెంటీ మాత్రమే అమలు చేశారు



(మొదటి పేజీ తరువాయి)
కేవలం ఉచిత బస్సు ప్రయాణంతో సరిపెట్టారని ఆరోపించారు. ''100 రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామన్నారు. ఈ రాష్ట్రంలో ఉన్న 1.67 కోట్ల మంది ఆడబిడ్డలకు ఒక్కొక్కరికి నెలకు రూ.2,500 చొప్పున రూ.30వేలు సీఎం రేవంత్‌రెడ్డి బాకీ ఉన్నారు. ఒక్కో రైతుకు ఎకరానికి రూ.17,500 బాకీ పడ్డారు. రైతులందరికీ రుణమాఫీ చేశామని నిరూపిస్తే రాజీనామా చేస్తా. గతంలో రైతు బంధుకు అడ్డుగా పిటిషన్ వేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓట్లు అడిగేందుకు వచ్చిన కాంగ్రెస్ నేతలను ఎక్కడికక్కడ మహిళలు, రైతులు నిలదీయాలి'' అని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి, బీఆర్ఎస్ నేతలు శ్రీనివాస్‌గౌడ్, పట్నం నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**రేవంత్‌పై మండిపడ్డ ఓ మహిళా రైతు**

రంగారెడ్డి జిల్లా షాబాద్‌లో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ రైతు ధర్నా సభలో ఓ మహిళా రైతు.. రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని కడిగి పారేసింది. నాకు నాలుగు ఎకరాల పొలం ఉంది.. క్రాప్ లోన్ రూ. 54 వేలు తీసుకున్నాను.. కానీ రుణమాఫీ కాలేదు నాకు. అందరికీ రుణమాఫీ అయిందని ముఖ్యమంత్రి అబద్ధం చెబుతున్నాడు. అందరికీ మాఫీ అయింది కానీ మాకు కాలేదు. రూ. 500కే గ్యాస్ అన్నాడు.. కానీ రూ. 900 తీసుకుంటున్నరు. తిరిగి రూ. 400 మా ఖాతాలో పడట్లేదు. రైతుబంధు కూడా రాలేదు. ఫ్రీ బస్సులో పోతలేను. అది ఒక్కటి నడుస్తున్నది. తులం బంగారంలేదు. రూ. 2500 లేవు. మా ఆయనకు కేసీఆర్ 2 వేల పెన్షన్ ఇచ్చిండు. ఇప్పుడు ఆ నాలుగు వేల పెన్షన్ ఎక్కడ పోయిందో. పుల్ల గీసి అంటుపెట్టాలి.. మరి ఏం మంచిగ జేస్తుండు.. ఫ్రీ బస్సు అని మగపిల్లలకు ఇజ్జత్ లేకుండా చేసిండు. అది పద్ధతి కాదు అని రేవంత్ రెడ్డి సర్కార్‌పై మహిళా రైతు చెన్నమ్మ రుసరుసలాడారు.

## గత ప్రభుత్వం చేసింది వడ్డీ మాఫీనే: ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



**విశ్వంభర, హైదరాబాద్:** సన్నాలు పండిస్తే తెలంగాణలో రైతులకు రూ.500 బోనస్ ఇస్తున్నట్లు కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి తెలిపారు. దేశంలో ఎక్కడా రూ.500 బోనస్ ఇవ్వట్లేదని చెప్పారు. హైదరాబాద్‌లోని సీఎల్పీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రేషన్ కార్డుల జారీని గత ప్రభుత్వం మర్చిపోయిందని విమర్శించారు. ఈ నెల 26 నుంచి వీటి జారీ కార్యక్రమం జరుగుతుందని వివరించారు. ''గత ప్రభుత్వం రుణమాఫీ చేయలేదు.. వడ్డీ మాఫీ చేసింది. వరంగల్ డిక్లరేషన్‌లో ఇచ్చిన మాట ప్రకారమే రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేశాం. రుణమాఫీ కోసం కేంద్రం నుంచి రూ.10 వేల కోట్లు సాయం చేసి ఉంటే ప్రభుత్వానికి ఉపయోగపడేది'' అని జీవన్‌రెడ్డి తెలిపారు.

# పల్లెను గెలుద్దాం.. ఢిల్లీని ఏలుదాం



**విశ్వంభర, కాచిగూడః**

బీసీ మేధావుల సదస్సులో మేధావులు,బీసీ సంఘాలు, అఖిలపక్ష పార్టీల నేతలు వెల్లడి జనాభా దామాషా ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ల సాధనే లక్ష్యంగా శనివారం కాచిగూడ లోని అభినందన్ గ్రాండ్ లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం అధ్యక్షతన బీసీ మేధావుల సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి బీసీ సంఘం జాతీయ అధ్యక్షులు రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య మండలి ప్రతిపక్షనేత సిరికొండ మధుసూదనాచారి , ఏఐసీసీ ఓబీసీ జనరల్ సెక్రటరీ కత్తి వెంకటస్వామి, బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్ , అఖిలపక్ష ప్రజా ప్రతినిధులు, ఉద్యోగ, ఉపాధ్యాయ, న్యాయవాదులు, డాక్టర్స్, వివిధ పార్టీల ప్రతినిధులు, వివిధ కులసంఘాల బాధ్యులు, ప్రజా సంఘాల నాయకులు, సమాజ సేవకులు, మీడియా ప్రతినిధులు, మహిళా నాయకురాళ్లు, యువజన, విద్యార్థి నాయకులు హాజరయ్యారు.ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ అసెంబ్లీలో బీసీల రిజర్వేషన్లను పెంచిన తర్వాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచినట్లయితే పంచాయతీ సభ్యులుగా, సర్పంచ్‌లుగా, ఎంపీటీసీలుగా, ఎంపీపీలుగా, జడ్పీటీసీలుగా, జడ్పీ చైర్మన్లుగా వారు ఎన్నికయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని అన్నారు. అందుకే ఈ విషయంపై తక్షణమే అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేసి స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ చట్టం చేయాలని సూచించారు. స్థానిక ఎన్నికల్లో పల్లెలను గెలిచి, ఢిల్లీని ఏలుదామన్నారు. సుప్రీంకోర్టు సిఫారసు మేరకు డెడికేషన్ కమిషన్ రిపోర్టుతో సహా అసెంబ్లీలో చట్టం చేస్తే రాబోయే కాలంలో ప్రభుత్వానికి ఏ విధమైనటువంటి న్యాయపరమైన ఇబ్బందులు ఉండవని అన్నారు. దేశంలో జరిగే జనగణనలో బీసీ కుల గణన చేర్చాలని, బీసీ రిజర్వేషన్ల కోసం పోరాటం చేస్తూనే రాజకీయ అధికారమే లక్ష్యంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయనున్నట్లు తెలిపారు. సమావేశానికి హాజరైన అతిథులు మాట్లాడుతూ దేశంలో ఎక్కడ లేనంత పోరాట చరిత్ర మన తెలంగాణ గడ్డకు ఉంది. మహోన్నత తెలంగాణ సాయుధ పోరాటం, తెలంగాణలో పుట్టి దేశమంతా విస్తరించిన విప్లవోద్యమం, తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం మరియు కుల ప్రజాస్వామిక ఉద్యమాలు దీని కొనసాగింపుగా నేడు బీసీ ఆ ఉద్యమం పురుడు పోసుకున్నది. అయితే తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో త్యాగాలు బీసీలవి, భోగాలు అగ్రకులాలది అయిపోయింది. ఇంచుమించు ఇదే పరిణామ క్రమం దేశమంతా జరిగింది.. దేశానికి స్వాతంత్రం వచ్చి 78 ఏళ్లు గడిచిన ప్రపంచంలోనే గణనీయ ఘనమైన గణతంత్రమని, ఘనమైన ప్రజాస్వామ్య దేశమని డబ్బా కొట్టుకుంటున్నా నూటికి 60 శాతం మంది ఉన్న బీసీలు, ఈ దేశపు అసలైన మూలవాసులు బీసీలు, ఏ రంగంలో చూసిన కేవలం 15 శాతం లోపే ఉంటారన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో బీసీలు మరింత చైతన్యవంతంగా సంఘటితంగా నిలబడాలన్నారు. ఈ కార్యక్రమంలో మేకల రాములు, గౌరిగ మల్లేష్, నీలం వెంకటేష్ వేముల రామకృష్ణ , ,అనంతయ్య, రాజేందర్, చింతల శంకర్ , గుండేటి శంకర్, మట్ట జయంతి గౌడ్ , రమాదేవి, రాందేవ్, రమణ, శ్రీనివాస్, శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, సుదర్శన్, రఘుపతి పలువురు బీసీ నాయకులు పాల్గొన్నారు.

## నైపుణ్యాల అభివృద్ధికి కలిసి పనిచేద్దాం



(మొదటి పేజీ తరువాయి)
నిర్వహిస్తున్న స్కిల్ డెవెలప్ మెంట్ కోర్సులు, అధునాతన సదుపాయాలను పరిశీలించింది. అక్కడ శిక్షణను అందిస్తున్న దాదాపు 20 రంగాలకు చెందిన నిపుణులు, కాలేజీ సిబ్బందిని కలిసి మాట్లాడారు. అనంతరం ఐటీఈ ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి బృందం చర్చలు జరిపింది. హైదరాబాదులోని ఫోర్ట్ సిటీలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసే యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ కి సహకరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. వివిధ రంగాల్లో యువతకు ఉపాధి కల్పించేందుకు మార్కెట్ డిమాండ్ కు అనుగుణంగా వివిధ కోర్సులు నిర్వహిస్తున్న తీరును ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. నైపుణ్యాల అభివృద్ధి (స్కిల్ డెవెలప్మెంట్) శిక్షణలో భాగస్వామ్యం కోసం పరస్పర సహకారం అందించాలని కోరారు. ఐటీఈ ప్రతినిధి బృందం సానుకూలంగా స్పందించింది. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీతో కలిసి పని చేసేందుకు సంసిద్ధతను వ్యక్తం చేసింది. చర్చల అనంతరం నైపుణ్యాల అభివృద్ధిలో కలిసి పని చేసేందుకు ఐటీఈ, స్కిల్ యూనివర్సిటీ పరస్పర అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఈ ఒప్పందంపై యూనివర్సిటీ వీసీ సుబ్బారావు, సింగపూర్ ఐటీఈ ప్రతినిధి బృందం తరఫున అకడమిక్ అండ్ అడ్మిన్ సర్వీసెస్ డిప్యూటీ డైరెక్టర్ పర్వేందర్ సింగ్, ఐటీ ఎడ్యుకేషన్ సర్వీసెస్ డిప్యూటీ డైరెక్టర్ ఫాబియన్ చియాంగ్ సంతకాలు చేశారు. త్వరలోనే ఐటీఈ ప్రతినిధి బృందం హైదరాబాద్ ను సందర్శించనుంది.

## తెలంగాణకు తీరని ద్రోహం చేశారు

(మొదటి పేజీ తరువాయి)
చేసుకొని రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టుపెట్టిందని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసుకున్న చీకటి ఒప్పందంతోనే తెలంగాణకు తీరని అన్యాయం జరిగిందన్న ఆయన.. తాత్కాలిక కేటాయింపులపై ప్రతి ఏడాది సంతకాలు చేసింది బీఆర్ఎస్‌నేతలు కాదా? అని ప్రశ్నించారు. కృష్ణా జలాల్లో తెలంగాణకు 70 శాతం వాటా రావాలనే వాదనను లేవనెత్తింది కాంగ్రెస్ ప్రభుత్వం అని మంత్రి పేర్కొన్నారు. తెలంగాణకు దక్కాల్సిన వాటా విషయంలో బీఆర్ఎస్ ప్రభుత్వ వైఖరిని కాంగ్రెస్ నిలదీసినందుకే సెక్షన్ (3) అంశం తెరపైకి వచ్చిందన్నారు. ఎన్నికలకు కొద్ది రోజుల ముందు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్‌కు ఓకే చెప్పిందని పేర్కొన్నారు. ఇందులో భారాస గొప్పతనమేమీ లేదని ఉత్తమ్ వ్యాఖ్యానించారు. బ్రిజేశ్ కుమార్ ట్రైబ్యునల్ నిర్దిష్ట కాల వ్యవధిలో కేటాయింపులు జరిగేలా గడిచిన పదేళ్లలో ఎందుకు ఒత్తిడి చేయలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాతే బ్రిజేశ్ కుమార్ ట్రైబ్యునల్ ద్వారా త్వరగా నీటి కేటాయింపులు చేయాలని కేంద్రంపై ఒత్తిడి పెంచినట్లు వివరించారు. బీఆర్ఎస్ హయాంలోనే ఏపీ ప్రభుత్వం కృష్ణా జలాలను అడ్డగోలుగా తరలించిందని, పోతిరెడ్డిపాడు సామర్థ్యాన్ని అదనంగా మరో 44 వేల క్యూసెక్కులకు పెంచిందని ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. రాయలసీమ ఎత్తిపోతల, 80 వేల క్యూసెక్కుల సామర్థ్యంతో పోతిరెడ్డిపాడు విస్తరణ పనులకు ఏపీ అనుమతులు జారీ చేస్తే భారాస ప్రభుత్వం ఎందుకు చూసీ చూడనట్లు వ్యవహరించిందని ఆరోపించారు.

## పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక



**విశ్వంభర, హైదరాబాద్:**

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం నిరంతర ప్రక్రియ అని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇచ్చే బాధ్యత ఈ ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. మొదటి విడతలో ఇండ్ల స్థలం ఉన్నవారికి , రెండో విడతలో ఇంటి స్థలంతో పాటు ఇందిరమ్మ ఇల్లును నిర్మించి ఇస్తామని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు, గ్రామాల్లో రెవెన్యూ వ్యవస్థ,సర్వేయర్ల నియామకంపై డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలోని తన కార్యాలయంలో శుక్రవారంనాడు చీఫ్ సెక్రటరీ శాంతికుమారితో కలిసి ఆయన సమీక్షించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి అవసరమైన ఇంజనీరింగ్ విభాగాన్ని సమకూర్చుకోవడం, ప్రతి రెవెన్యూ గ్రామానికి రెవెన్యూ అధికారి నియామకం, సర్వేయర్ల నియామకంపై సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు.ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇండ్లకు అర్హులైన లబ్దిదారులకు సంబంధించిన నివాస స్థలం ఉన్నవారి, నివాస స్థలం లేని వారి ప్రకారం రెండు జాబితాలను గ్రామసభల్లో పెట్టాలని అధికారులకు సూచించారు. దశల వారీగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని చేపడుతున్నామని తెలిపారు.ప్రస్తుతం హౌసింగ్ కార్పొరేషన్‌లో 274 మంది ఇంజనీర్లు మాత్రమే ఉన్నారని రాష్ట్రంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం , పర్యవేక్షణకు మరో 400 మంది ఇంజనీర్లు అవసరమని ఈ సందర్భంగా అధికారులు మంత్రి పొంగులేటి దృష్టికి తీసుకువచ్చారు. ఇతర ప్రభుత్వ విభాగాలలో ఇంజనీరింగ్ సిబ్బంది సేవలను ఏ విధంగా ఉపయోగించుకోవచ్చనే అంశాలను పరిశీలించాలని సీఎస్ శాంతికుమారికి ఈ సందర్భంగా మంత్రి సూచించారు.గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలో ఇండ్ల నిర్మాణానికి సంబంధించి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని అధికారులకు సూచించారు. విలేజ్ రెవెన్యూ వ్యవస్థకు సంబంధించి ప్రతి రెవెన్యూ గ్రామానికి ఒక రెవెన్యూ అధికారిని నియమిస్తామని ఇందుకోసం వీఆర్వో, వీఆర్ఏ నుంచి అర్హులైన వారిని ఎంపిక చేసి ప్రత్యేకంగా పరీక్ష నిర్వహించాలని, ఈ పరీక్షకు సంబంధించిన విధివిధానాలను తక్షణమే రూపొందించి పరీక్ష నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ప్రస్తుతం 450 మంది సర్వేయర్లు ఉన్నారని అదనంగా మరో వెయ్యి మంది సర్వేయర్లు అవసరమున్న నేపథ్యంలోసర్వేయర్ల ఎంపికకు కావలసిన ప్రణాళిక తయారు చేయాలని, ఎంపిక విధానం పారదర్శకంగా ఉండాలని అధికారులకు సూచించారు.

## కలర్స్ హెల్త్‌కేర్‌కు చుక్కెదురు..

### అప్పీల్‌ను కొట్టేసిన వినియోగదారుల కమిషన్




**విశ్వంభర, హైదరాబాద్:** కేంద్ర ఆరోగ్యశాఖ నుంచి కలర్స్ హెల్త్‌కేర్‌కు తగిన అనుమతులు లేవని రాష్ట్ర వినియోగదారుల కమిషన్ తేల్చి చెప్పింది. ఆ సంస్థకు ఉన్న అనుమతులపై 2 నెలల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. ఈ మేరకు హైదరాబాద్ డీఎంహెచ్ఓ, వైద్య విధాన పరిషత్ డైరెక్టర్‌ను ఆదేశించింది.

**అసలేం జరిగిందంటే..**

కలర్స్ హెల్త్‌కేర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌కు సంగారెడ్డి జిల్లా వినియోగదారుల కోర్టు జరిమానా విధించింది. బరువు, కొవ్వు తగ్గిస్తామంటూ మోసం చేశారని సంగారెడ్డికి చెందిన ఓ యువతి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కోర్టు విచారణ చేపట్టింది. యువతి చెల్లించిన రూ.1,05,000.. తొమ్మిది శాతం వడ్డీతో చెల్లించాలని ఆదేశించింది. జిల్లా వినియోగదారుల కోర్టు ఇచ్చిన తీర్పును కలర్స్ హెల్త్ కేర్ అప్పీల్ చేసింది. దీనిపై విచారణ చేపట్టిన రాష్ట్ర వినియోగదారుల కమిషన్ అప్పీల్‌ను కొట్టేసింది.

## అఫ్జల్‌గంజ్‌లో కాల్పుల కేసులో అమిత్ కుమార్ గ్యాంగ్ కోసం పోలీసుల వేట




**విశ్వంభర, హైదరాబాద్:** కలకలం రేపిన అఫ్జల్‌గంజ్ కాల్పుల కేసులో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. పది ప్రత్యేక బృందాలతో హైదరాబాద్ సహా రాయ్‌పూర్, బిహార్‌తో పాటు అనుమానిత ప్రాంతాల్లో పోలీసుల గాలింపు కొనసాగుతోంది. కాల్పులు జరిపింది బిహార్‌కు చెందిన అమిత్ కుమార్ ముఠాగా పోలీసులు గుర్తించినట్టు సమాచారం. బీదర్‌లో దోపిడీకి పాల్పడి అక్కడ ఇద్దరిపై కాల్పులు జరిపి.. నగరంలోకి ప్రవేశించి ఇక్కడ నుంచి రాయ్‌పూర్ మీదుగా పారిపోవాలని ప్రయత్నించినట్టు పోలీసులు గుర్తించారు. దొంగలు హైదరాబాద్‌కు ఎలా చేరుకున్నారనే అంశంపై పోలీసులు దృష్టి సారించారు. కాల్పులు జరిపిన ముఠా బిహార్ పారిపోయిందా అనే కోణంలోనూ పోలీసులు విచారణ జరుపుతున్నారు. ముఠాలో ప్రధానంగా అమిత్‌కుమార్ కీలకంగా ఉన్నట్టు.. అతనిపై బిహార్‌లో దోపిడీ, దొంగతనం వంటి పలు కేసులు ఉన్నట్టు గుర్తించారు. సీసీఎస్, టాస్క్‌ఫోర్స్, శాంతిభద్రతల విభాగం పోలీసులు నిందితుల కోసం వేట కొనసాగిస్తున్నారు. బిహార్ పోలీసులను సంప్రదించిన నగర పోలీసు ఉన్నతాధికారులు అమిత్‌కుమార్ నేరాల చిట్టా గురించి ఇప్పటికే తెలుసుకున్నట్టు సమాచారం.

**బీభత్సం సృష్టించిన అమిత్ గ్యాంగ్..**

అమిత్ ముఠా కర్ణాటకలోని బీదర్, ఆ తర్వాత హైదరాబాద్‌లో కాల్పులతో బీభత్సం సృష్టించారు. బీదర్‌లో ఏటీఎంలో డబ్బులు నింపేందుకు వచ్చిన ఇద్దరు సెక్యూరిటీ సిబ్బందిపై కాల్పులు జరిపి నగదుతో ద్విచక్ర వాహనంపై పరారై హైదరాబాద్‌లో ప్రత్యక్షమయ్యారు. అఫ్జల్‌గంజ్ నుంచి ప్రైవేటు ట్రావెల్స్‌లో రాయ్‌పూర్ వెళ్లేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలోనే ట్రావెల్స్ సిబ్బంది బ్యాగులు తనిఖీ చేయడం, కట్టలకొద్దీ డబ్బును చూసి అనుమానంతో ప్రశ్నించడంతో నిందితులు ఒకరిపై రెండు రౌండ్ల కాల్పులు జరిపి పరారయ్యారు. బీదర్‌లో జరిపిన కాల్పుల్లో ఒకరు మరణించగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. హైదరాబాద్‌లో జరిపిన కాల్పుల్లో ఒకరు తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. సినీఫక్కీలో జరిగిన ఈ ఘటనలతో స్థానికులు ఉలిక్కిపడ్డారు. రెండు చోట్లా అత్యంత రద్దీ ప్రదేశాల్లో ఆగంతుకులు ఇంతటి తెగింపు ప్రదర్శించడం గమనార్హం.

## సీఐడీ మాజీ చీఫ్ సునీల్‌కుమార్‌పై ఏసీబీకి డిప్యూటీ స్పీకర్ రఘురామ లేఖ



**విశ్వంభర, అమరావతి:** ప్రజాధనం దుర్వినియోగం విషయంలో సీఐడీ మాజీ చీఫ్ సునీల్ కుమార్‌పై చర్యలు తీసుకోవాలని ఏసీబీ డీజీకి ఏపీ ఉపసభాపతి రఘురామ కృష్ణరాజు లేఖ రాశారు. అగ్రిగోల్డ్ రిలీఫ్ ఫండ్స్‌ను సునీల్ దుర్వినియోగం చేశారని లేఖలో పేర్కొన్నారు. ''అగ్రిగోల్డ్ నిధుల మళ్లింపులో సునీల్, అనుచరుడు తులసిబాబు ప్రమేయం ఉంది. అగ్రిగోల్డ్ బాధితులకు నిధుల బదిలీ పేరుతో అక్రమాలు జరిగాయి. 2021లో బాపట్ల జిల్లాలో 96 ఖాతాల్లో రూ.20 వేల చొప్పున వేశారు. అగ్రిగోల్డ్ బాధితులు కాని 96 ఖాతాల్లో నిధులు జమచేశారు. కొందరి నుంచి రూ.15 వేల చొప్పున తులసిబాబు వెనక్కి తీసుకున్నారు. వాటి వివరాలు తెలిపేందుకు సాక్షులు కూడా సిద్ధంగా ఉన్నారు.ప్రకాశం జిల్లాలో మరో 400 మందికి అగ్రిగోల్డ్ నిధులు చెల్లించారు. అక్రమ నిధులతో సునీల్ కుమారులు వ్యాపారం చేస్తున్నారు. రోహిత్, హర్షల్ దుబాయ్‌లో స్థిరాస్తి, హోటల్ వ్యాపారాలు చేస్తున్నారు. సునీల్ పాస్‌పోర్టులో పర్యటన వివరాల ద్వారా ఆరా తీయవచ్చు. సీఐడీ చీఫ్‌గా ఓ కాంట్రాక్టు విషయంలో సునీల్ కుమార్ రూ.75 లక్షలు తీసుకున్నారు. తక్షణం దర్యాప్తు చేసి తగిన చర్యలు తీసుకోవాలని'' రఘురామ కృష్ణరాజు లేఖలో పేర్కొన్నారు. దీంతో పాటు రెండు ఎస్‌బీఐ ఖాతాల వివరాలు సమర్పించారు.

# కామ్రేడ్ యానాల వీరారెడ్డి సేవలు ఎనలేనివి

**○ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కామ్రేడ్ అవునూరి మధు**



**విశ్వంభర, నాగారం:** కామ్రేడ్ యానాల వీరారెడ్డి 34 వ వర్ధంతి సందర్భంగా సూర్యాపేట జిల్లా నాగారం మండలం వర్ధమానుకోట గ్రామంలో బహిరంగ సభ నిర్వహించారు. ముందుగా కామ్రేడ్ యానాల వీరారెడ్డి స్థూపం వద్ద న్యూడెమోక్రసి రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు అవునూరి మధుజెండా ఆవిష్కరణ చేశారు. వర్ధమానుకోట గ్రామంలో ఉన్న దిమ్మేలా పై న్యూడెమోక్రసి జిల్లా కార్యదర్శి మండారి డేవిడ్ కుమార్, ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు జాజుల సామెలు లు జెండా ఆవిష్కరణ చేసి భారీ ర్యాలీ తీశారు. అనంతరం ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి బొడ్డు శంకర్ అధ్యక్షతన బహిరంగ సభ నిర్వహించడం జరిగింది. వీరారెడ్డి చిత్రపటానికి తల్లి చంద్రమ్మ, ముఖ్య వక్తలు పూలా మాల వేసి నివాళ్లు అర్పించి రెండు నిముషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి న్యూడెమోక్రసి రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు అవునూరి మధు మాట్లాడుతూ పి.డి.ఎస్.యు విద్యార్థి ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించి మల్లేపల్లి వద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కామ్రేడ్ యానాల వీరారెడ్డి నేటి యువతరానికి ఆదర్శప్రాయమని, ఆయన అడుగుజాడల్లో ముందుకు కొనసాగాలని అన్నారు. కామ్రేడే యానాల వీరారెడ్డి తన ఉన్నతమైన చదువులను, ఉద్యమ అవసరాల కోసం వదిలేసుకొని సూర్యాపేట ప్రాంతం నుండి దేవరకొండ ప్రాంతానికి పూర్తి కాలపు కార్యకర్తగా వెళ్లి ఆ ప్రాంత ప్రజలు, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాడారని అన్నారు. పాలేర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై, అధిక వడ్డీలపై, బ్లాక్ మార్కెట్లో ఎరువుల దందాపై పోరాడి విజయాల సాధించాడని అన్నారు. అనేకమంది పేద ప్రజలు ఇళ్ల స్థలాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటుంటే పోరాడి పేదలకు మత్స్య కార్మికులకు ఇళ్ల స్థలాలు ఇప్పించాడని అన్నారు. ఆ ప్రాంతం పెద్దదారులు, భూస్వాములు, సారా కాంట్రాక్టర్లు కామ్రేడ్ వీరారెడ్డి పై కక్ష సాధింపుతో హత్య చేయడానికి పూనుకున్నారని అయినా బెదరకుండా చెదరకుండా ఉద్యమాన్ని నడిపించాడు అని అన్నారు. సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసి జిల్లా కార్యదర్శి మండారి డేవిడ్ కుమార్ మాట్లాడుతూ 1990 దశకంలో హిందూ మతోన్మాదం బుసలు కొడుతున్న నేపథ్యంలో దానికి వ్యతిరేకంగా నల్గొండలో జరిగిన బహిరంగ సభకు పెద్ద ఎత్తున ప్రజలను కదిలించడంలో నాయకత్వం వహిస్తూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడని అన్నారు. అయినా ఇప్పటికీ బ్రాహ్మణీయ మనువాద పెత్తందారులు దళితులు, ఆదివాసులు, మైనార్టీలు ఇతర ప్రజలపై అణచివేతకు గురి చేస్తున్నారని అన్నారు. నాడు వీరారెడ్డి ఏదైతే హిందూ మతోన్మాదం పై పోరాడాడో నేటికీ పోరాడాల్సిన పరిస్థితిలు ఏర్పడ్డాయని అన్నారు. అసమానతలు లేని వ్యవస్థ కోసం వీరారెడ్డి పోరాడారని ఆయన ఆశయాల సాధన కోసం కంకణబద్ధులై ముందుకు కొనసాగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా యుద్ధ నౌక ఏపూరి సోమన్న, ఐఎఫ్టీయూ జిల్లా కార్యదర్శి గంట నాగయ్య, పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షులు ఇందూరు సాగర్, ఐఎఫ్టీయూ జిల్లా ఉపాధ్యక్షులు కునుకుంట్ల సైదులు, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు పోలేబోయిన కిరణ్, అరుణోదయ జిల్లా అధ్యక్షులు ఉదయగిరి, బీఓసీ జిల్లా కార్యదర్శి దేసోజు మధు, ఏఐకేఎంఎస్ డివిజన్ అధ్యక్షులు సంపేట కాశయ్య, అరుణోదయ రాష్ట్ర నాయకులు తడకమళ్ల సంజవ్, ఎస్‌డీఎల్‌సీ పోలేబోయిన లింగయ్య, మొగిళ్ళ అంజయ్య, సోమయ్య, నాతి ఉప్పలయ్య, అరుణోదయ జిల్లా నాయకులు గండు నాగే, ఎర్ర ఉమేష్, బోల్లే వెంకన్న, నర్సిరెడ్డి పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు పుల్లూరి సింహాద్రి డివిజన్ కార్యదర్శి పిడమర్తి భరత్, మందడి శ్రీధర్, గంట మల్లయ్య, తోట్ల మహేందర్, బయన్న, కృష్ణమూర్తి, సైదులు, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.



## కాళేశ్వరంలో క్రీడా స్థలం ఏర్పాటు చేయాలని వినతి

**విశ్వంభర, భూపాలపల్లి:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా లోని ప్రముఖ పుణ్యక్షేత్రం కాళేశ్వరం బస్ స్టాండ్ సమీపం లోని సాకి కుంట చెరువు లో గల పల్లె ప్రకృతి వనమును తొలగించి ఆ స్థలములో స్థానిక యువతకు క్రీడా స్థలములు ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మకు కాళేశ్వరం యువత వినతి పత్రం అందజేశారు. గత ప్రభుత్వ హయాంలో 15 గుంటల విస్తరణములో గల సాకి కుంట చెరువులో పల్లె ప్రకృతి వనం నిర్మించడం వలన మిగతా స్థలం కబ్జాకు గురవుతుందని కావున దానిని తొలగిస్తే ఆ స్థలము ఆట స్థలమునకు, బహిరంగ కూరగాయల మార్కెట్ కు, పుష్కరాలు, పర్వదినాలలో పార్కింగ్కు ఉపయోగపడుతుందని కలెక్టర్ కు యువత విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం కాలేశ్వరంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్మించిన, అలాగే హనుమాన్ దేవాలయం వద్ద నిర్మించిన ప్రకృతి వనాలు ఉన్నాయని కావున అట్టి స్థలమును ప్రజలకు ఉపయోగపడే విధంగా చేయాలని యువకులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మహాదేవపూర్ మండల కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు లేతగారి రాజబాబు, మాచర్ల అరుణ్, విజయ్, దీన్, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

**దివ్యాంగులకు, వయోవృద్ధులకు**

## సహాయ ఉపకరణాల ఎంపిక శిబిరాలు

**విశ్వంభర, మహబూబాబాద్:** మహబూబాబాద్ జిల్లాలో దివ్యాంగులకు, వయోవృద్ధులకు అలెంకో వారి సహకారంతో సహాయ ఉపకరణముల ఎంపిక శిబిరములు ఈ నెల 20న మహబూబాబాద్ లోని గిరిజన భవనం, 21న మరిపెడ లోని ఇండోర్ స్టేడియం, 22న డోర్నకల్ లోని రత్నం ఇంజనీర్ హౌస్ ప్రక్కన హాల్, 23న తొర్రూర్ లోని రైతువేదిక, 24న కొత్తగూడ లోని రైతు వేదిక నందు శిబిరములు నిర్వహిస్తున్నామని దివ్యాంగులకు మరియు వయోవృద్ధులకు అవసరమైన సహాయ ఉపకరణములు బ్యాటరీ ట్రైసైకిల్స్, వీల్ చైర్స్, ట్రైసైకిల్స్, వినికిడి యంత్రాలు, అంధుల చేతికర్రలు, వాకింగ్ స్టిక్స్ మొదలైన ఉపకరణములు ఎంపిక శిబిరములు నిర్వహిస్తున్నామని, ఈ సదవకాశమును ఉపయోగించుకొవాలని శిబిరములకు హాజరయ్యే వారు తమ వెంట తప్పక యూడీఐడీ కార్డు, సదరమ్ మెడికల్ సర్టిఫికెట్, ఆధార్, రేషన్/ఆదాయం, రెండు పాస్ ఫోటోలు యూడీఐడీ కార్డు లేని వారు యూడీఐడీ పోర్టల్ నందు పేరును నమోదు చేసుకొని జీరాక్స్ ప్రతులను తెచ్చుకోవాలని జిల్లా సంక్షేమ శాఖ అధికారి యం. ధనమ్మ, నేడు ఒక ప్రకటనలో తెలిపారు. ఇతర వివరములకు 9133415312, 9177260816 లను సంప్రదించాలని తెలిపారు.

## ఐఎన్‌టీయూసీ క్యాలెండర్ ఆవిష్కరణ



**విశ్వంభర, హైదరాబాద్:** తార్నాకలో ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఐఎన్‌టీయూసీ) క్యాలెండర్ ను గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత రెడ్డి, టి.టి.యు.సి రాష్ట్ర అధ్యక్షులు మోతే శోభన్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి మాట్లాడుతూ కార్మికుల హక్కులను పరిరక్షించడం, వారి శ్రేయస్సు కోసం కార్యాచరణను తీసుకోవడం తమ బాధ్యత అని పేర్కొన్నారు. ఆమె కార్మికుల సేవలను ప్రశంసిస్తూ వారి ఆర్థిక, సామాజిక అభివృద్ధికి ఐఎన్‌టీయూసీ వంటి సంఘాలు చేసిన కృషిని అభినందించారు. ఈ కార్యక్రమంలో టి.టి.యు.సి రాష్ట్ర అధ్యక్షులు శోభన్ రెడ్డి మాట్లాడుతూ కార్మిక సంఘాల సమీకరణ ద్వారానే వారి సమస్యలను పరిష్కరించగలమని అభిప్రాయపడ్డారు. తదుపరి కార్యాచరణ పథకాలు, కార్మికుల హక్కుల కోసం చేపట్టబోయే కార్యక్రమాల గురించి చర్చించారు. కార్యక్రమంలో సెక్రెటరీ శివకుమార్ గారు, వి సత్యనారాయణ, టీఎన్‌జీఓ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు, జయేందర్, గొల్లపల్లి అనిల్, కే శ్రీనివాస్, వివిధ కార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గన్నారు.

## రక్తదానం సామాజిక బాధ్యత : చేపూరి శంకరయ్య



**విశ్వంభర, ఎల్బీనగర్ :** కామినేని హాస్పిటల్ లో లక్ష్మీ ప్రసన్న ఆపరేషన్ కొరకు వెళ్లగా ఓ నెగటివ్ బ్లడ్ హాస్పిటల్లో స్టాక్ లేకపోవడంతో వారు చాలా చోట్ల ప్రయత్నం చేసినప్పటికీ బ్లడ్ అందుబాటులో లేదు. మదర్ తెరిసా చారిటబుల్ సొసైటీ ఆధ్వర్యంలో సామాజిక కార్యకర్త చేపూరి శంకరయ్య సహకారంతో ఓ నెగటివ్ బ్లడ్ ఇద్దరి దాతల సహకారంతో రక్తదానం చేయించారు. వారికి, వారి స్వచ్ఛంద సంస్థకు జైపాల్ రెడ్డి లకు కృతజ్ఞతలు తెలిపారు. సామాజిక కార్యకర్త చేపూరి శంకరయ్య మాట్లాడుతూ ఆపద సమయంలో ప్రతి ఒక్కరిని ఆదుకోవడమే సామాజిక బాధ్యత అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రక్త దాతలు అనంత వేణి నగర్ కాలనీ సెక్రెటరీ రాజేష్, పీయూష్ అగర్వాల్ సొసైటీ సభ్యులు, అచ్యుత్ యోగిత తదితరులు పాల్గొన్నారు.

## అర్హులకు మాత్రమే ఇందిరమ్మ ఇండ్లు

**- మండల ప్రత్యేక అధికారి రాజారత్నం**



**విశ్వంభర, కేశంపేట:** అర్హులైన పేద వారిని మాత్రమే గుర్తించి ఇందిరమ్మ ఇండ్లు అందేలా చూడాలని మండల ప్రత్యేక అధికారి టి.రాజారత్నం ఆదేశించారు. ప్రభుత్వం ప్రకటించిన ఆరు పథకాలైన ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా లపై అల్వాల్ రైతు వేదికలో సంబంధిత అధికారులతో మండల అభివృద్ధి అధికారి ఆధ్వర్యంలో సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా నాలుగు పథకాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా రావాల్సిన పథకాలలో ఎవరికి అన్యాయం జరగరాదని, అసలైన లబ్ధిదారులను గుర్తించి అందేలా చూడాల్సిన బాధ్యత ప్రతి శాఖ అధికారులు, సిబ్బంది పై ఉందన్నారు. ఈ సమీక్షా సమావేశంలో తహసీల్దార్ రాజమౌళి, ఏవో, వ్యవసాయ శాఖ అధికారిణి శిరీష, ఎంపీవో కిష్టయ్య, ఏపీవో అజీజ్, డిప్యూటీ తహసీల్దార్, ఏఈవోలు ఉన్నారు.

## గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా మల్లేష్ ముదిరాజ్

**విశ్వంభర, మెహిది పట్నం:** గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ గా మల్లేష్ ముదిరాజ్ ప్రమాణ స్వీకారం చేశారు. శుక్రవారం గుడిమల్కాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలవర్గం ప్రమాణ ఉత్సవంలో ముఖ్య అతిథులుగా స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ప్రభుత్వ చీఫ్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి లు హాజరై ప్రమాణ స్వీకారం చేయించారు. చైర్మన్ గా మల్లేష్ ముదిరాజ్, వైస్ చైర్మన్ గా కావలి చంద్రశేఖర్, డైరెక్టర్లచే ప్రమాణ స్వీకారం చేశారు. మహేందర్ రెడ్డి మాట్లాడుతూ జనవరి 26 నుండి రైతులందరికీ రైతు భరోసా ఎకరాకు రూ. 6,000 లు అందించనున్నాం అని ఇందిరమ్మ ఇళ్లు, అర్హులందరికీ రేషన్ కార్డులు అందించబోతున్నాం అని అన్నారు. ప్రభుత్వంపై భారం ఉన్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నాం అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు ప్రకాష్ గౌడ్, శ్రీహరి ముదిరాజ్, యాదయ్య, శంకర్, మాజీద్ హుస్సేన్, కౌసర్ మైనుద్దీన్ లు పాల్గొన్నారు.

## క్రీడలు స్నేహ భావాన్ని పెంపొందిస్తాయి

**- ఎస్ఐ వెంకటేష్**



విశ్వంభర, ఆమనగల్లు: ఆమనగల్లు మండలం చెన్నంపల్లి (మాలేపల్లి) గ్రామంలో సంక్రాంతి సంబరాల ముగింపు కార్యక్రమంలో భాగంగా గ్రామంలో గ్రామ పెద్దల, యువకుల సహకారంతో వివిధ క్రీడలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అమనగల్లు ఎస్ఐ వెంకటేష్, యువ రచయిత కేంద్ర సాహిత్య పురస్కార గ్రహీత తగుళ్ల గోపాల్ పాల్గొని బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ వెంకటేష్ మాట్లాడుతూ చెన్నంపల్లి గ్రామ ప్రజలు శాంతియుతంగా ఉంటారని ఇప్పటివరకు గ్రామంలో ఒక కేసు కూడా నమోదు కాలేదని ప్రశంసించారు. క్రీడలు విద్యార్థుల, యువకులు మధ్య స్నేహభావం పెంపొందిస్తాయని తెలిపారు. గ్రామంలో నూతనంగా ఉద్యోగాలు సాధించిన లక్ష్మణ్, లింగమయ్య, మౌనిక లను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పి రాములు, టి రవికుమార్, మైసయ్య, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తెలగమల జగన్, పరశురాం రెడ్డి, విక్రమ్ రెడ్డి, బి రాములు తదితరులు పాల్గొన్నారు.

## మెడికేర్ డయాగ్నొస్టిక్ సెంటర్ ప్రారంభం



**విశ్వంభర, తలకొండపల్లి:** తలకొండపల్లి మండల పరిధిలోని గట్టు ఇప్పలపల్లి గ్రామంలో డాక్టర్ ఈశ్వర్ గౌడ్ మరియు శేఖర్ కు చెందిన నూతన మెడికేర్ డయగ్నోస్టిక్ సెంటర్ ని కాంగ్రెస్ సీనియర్ నాయకులు గాదే రేణు రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా గాదే రేణు రెడ్డి యజమానులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జయమ్మ వెంకటయ్య, డేవిడ్, రేణు రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, శెట్టి రాజశేఖర్, సొప్పరి శీను, బొడ్డే, శ్యామల కుమార్, శివయ్య, ఇట్టాల రవీందర్ గౌడ్, అశోక్ గౌడ్, పవన్ వాల్మీకి, తదితరులు పాల్గొన్నారు.

**ఆర్‌ఆర్‌బీ, ఎస్‌ఎస్‌సీ, బ్యాంకింగ్**

## పరీక్ష కోసం ఉచిత శిక్షణ

**విశ్వంభర, మహబూబాబాద్:** ఆర్‌ఆర్‌బీ, ఎస్‌ఎస్‌సీ, బ్యాంకింగ్ రిక్రూట్మెంట్ ఫౌండేషన్ కోర్సు కోసం 100 రోజుల ఉచిత శిక్షణ ఇవ్వనున్న స్టడీ సర్కిల్ డైరెక్టర్ డా. ఎంపీవీ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత గల అభ్యర్థులు www.tgbcstudycircle.cgg.gov.in ఆన్ లైన్ ద్వారా ఈనెల 20వ తేదీ నుండి ఫిబ్రవరి 9వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన సూచించారు. అయితే తల్లిదండ్రుల ఆదాయం గ్రామీణ ప్రాంతాలలో రూ.1,50,000 లు, పట్టణ ప్రాంతాల్లో రూ.2,00,000 లు మించకూడదని ఆయన పేర్కొన్నారు. ఎంపిక విధానం ఇంటర్మీడియట్, డిగ్రీ పరీక్షలో పొందిన మార్కుల ఆధారంగా అలాగే రిజర్వేషన్ నియమం ప్రకారం ఉంటుందని స్పష్టం చేశారు. అర్హత గల అభ్యర్థులకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఫిబ్రవరి 12 నుండి 14 వరకు ఉంటుందని, ఫిబ్రవరి 15వ తేదీ నుండి ఉచిత శిక్షణ ప్రారంభం అవుతుందని తెలిపారు. వివరాలకు 0870 2571192, 04024071178 నెంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

## బహుజన వర్గాల పక్షాన పోరాడుతున్న కవితక్క

**- అందోజు శంకరా చారి**

**విశ్వంభర, సంస్థాన్ నారాయణపురం:** మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చి అన్నివర్గాలను నిరాశ పరచిన కాంగ్రెస్ పార్టీపై పోరాటం చేస్తున్న బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత వెంట తెలంగాణ సమాజం బాసటగా నిలవాలని అందోజు శంకరా చారి పిలుపునిచ్చారు. శుక్రవారం ఆమె నివాసంలో శంకరా చారి మర్యాదపూర్వకంగా కలిశారు. కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అమలుపై ఇందిరాపార్కు వద్ద చేసిన ధర్నా విజయవంతం అయిన సందర్భంగా బీసీ సమాజం తరపున కృతజ్ఞతలు తెలిపారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగడుతూ అన్ని వర్గాల ప్రజల తరపున పోరాటాలకు నాయకత్వం వహించి మళ్ళీ కేసీఆర్ సంక్షేమ పాలనను తీసుకురావాలని కోరారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ ల వాటా తెలకపోతే ఎన్నికలు జరగనివ్వమని, గ్రామ గ్రామాన పెద్దఎత్తున లడాయికి సిద్ధమని అన్నారు. ఈ కార్యక్రమంలో మునుగోడు నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు కత్తుల పద్మ యాదవ్, పోకల ఎలిజబెత్, గండు నాగేంద్రబాబు, పూదరి కృష్ణ, వేముడాల రాణి, సంతోష్ పాల్గొన్నారు.



## ఎల్ అండ్ టీ చైర్మన్ కార్మిక వర్గానికి క్షమాపణ చెప్పాలి



**విశ్వంభర, బషీర్‌బాగ్ :** ఎల్ అండ్ టీ చైర్మన్ సుబ్రహ్మణ్యన్ భారత కార్మిక వర్గానికి క్షమాపణ చెప్పాలని, ఎల్ & టి చైర్మన్ సుబ్రహ్మణ్యన్ భారత కార్మికులను ఉద్దేశించి వారానికి 90 గంటలు పనిచేయాలని ఇటీవల చేసిన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని, కార్మిక వర్గానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ ఈరోజు బషీర్ బాగ్ లో ఉన్న ఎల్ అండ్ టీ ప్రధాన కార్యాలయం వద్ద సీఐటీయూ, ఐద్వా గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ ధర్నాను ఉద్దేశించి సీఐటీయూ గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి ఎం. వెంకటేష్, ఐద్వా నాయకురాలు కె.నాగలక్ష్మి లు మాట్లాడుతూ ఎల్ అండ్ టీ చైర్మన్ కార్మికులు వారానికి 90 గంటలు పని చేయాలని చేయాలని చెప్పడం గర్వనీయం అన్నారు. ఇటీవల కాలంలో ఇన్ఫోసిస్ నారాయణమూర్తి, గౌతమ్ అదానీలు కూడా ఇలాంటి వ్యాఖ్యలు చేశారని విమర్శించారు. ఇప్పుడున్న 8 గంటల పనిదినం వలన 2022 క్రైమ్ రిపోర్ట్స్ ప్రకారం దేశవ్యాప్తంగా కార్మికులు, ఉద్యోగస్తులు పని ఒత్తిడితో 11486 మంది ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సుబ్రహ్మణ్యం చేసిన వ్యాఖ్యల ప్రకారం కార్మికులు, ఉద్యోగస్తులు రోజుకు 15 గంటల పని చేయాల్సిన అవసరం ఏర్పడుతుందన్నారు. ఈ వ్యాఖ్యల ప్రకారం కార్మిక వర్గాన్ని బానిసలుగా మార్చడమేనని అన్నారు. ఈ వ్యాఖ్యల పైన కేంద్ర ప్రభుత్వం, బీజేపీ పార్టీ, అలాగే ఇతర పార్టీలు స్పందించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు రోజుకు 7 గంటల చొప్పున, వారంలో 5 రోజుల పని, వారానికి 35 గంటల పని దినాలు ఉండాలని డిమాండ్ చేశారు. కార్మిక వర్గానికి కనీస వేతనం రూ 26,000 లు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, కాంట్రాక్టు వ్యవస్థను రద్దు చేయాలని, కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నగర అధ్యక్షులు జె. కుమారస్వామి, ఐద్వా నగర అధ్యక్ష, కార్యదర్శులు A.పద్మ, వై.వరలక్ష్మి సిఐటియు నాయకులు కె.అజయ్ బాబు, వి.కామేష్ బాబు, జి.రాములు, డిఎల్.మోహన్, ఆర్.అశోక్, మెడికల్ రిప్స్ నాయకులు రాజు బట్, అశోక్ ఐద్వా నాయకులు పి.విమల, షబానా, పుష్ప, రోజా, లక్ష్మి పాల్గొన్నారు.

## దీర్ఘకాల రుణాలు పొందిన రైతులు సద్వినియోగం చేసుకోండి

**- సింగిల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా**



**విశ్వంభర, ఆమనగల్లు:** జిల్లా సహకార బ్యాంకు పాలకవర్గం ఏకగ్రీవ తీర్మానం మేరకు డీసీసీబీ బ్యాంకులు, సహకార సంఘాల సొసైటీలు ద్వారా పొందిన ఆమనగల్లు, కడ్తాల్, మాడుగుల, తలకొండపల్లి మండలాల కు చెందిన పీఏసీఎస్ ల ద్వారా రుణాలు పొందిన దీర్ఘకాలిక రుణ మొండిబకాయిదారులు ఏకకాల రుణ పరిష్కార పథకం ఓటీఎస్ ద్వారా పరిష్కారం చేసుకోవాలని డీసీసీబీ డైరెక్టర్, ఆమనగల్లు సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా, డీసీసీబీ మేనేజర్ గోపాలు తెలిపారు. శుక్రవారం ఆమనగల్లు సింగల్ విండో కార్యాలయంలో స్థానిక విలేకరులతో వారు మాట్లాడుతూ ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా సహకార బ్యాంకు పాలకవర్గ సమావేశంలో తీర్మానం ప్రకారం ఏకకాల రుణ పరిష్కార పథకంకు ఆమోదించడం జరిగిందన్నారు. ఏకకాల రుణ పరిష్కారానికి బ్యాంకు ద్వారా 31 మార్చి 2018 నాటికి రుణం తీసుకున్న రుణ గ్రహీతలు దీనికి అర్హులని ఆయన ప్రకటించారు. ఈ పథకాన్ని దీర్ఘకాలిక రుణ ఖాతాలు, పీఎం ఈజీపీ రుణాలకు మాత్రమే వర్తిస్తుందని వారు తెలిపారు. ఈ గడువు వచ్చేనెల 15 ఫిబ్రవరి 2025 వరకు దీర్ఘ కాలిక రుణ గ్రహీతలు సద్వినియోగపరచుకోవాలని వారు కోరారు. ఆమనగల్లు డీసీసీబీ పరిధిలోని 4 మండలాలకు చెందిన దీర్ఘకాలిక మొండి బకాయిదారులు ఈ ఓటీఎస్ ను సద్వినియోగపరచుకొని కొత్తగా మళ్లీ రుణాలు పొందాలని డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేష్ గుప్తా కోరారు. ఈ సమావేశంలో సింగల్ విండో ఉపాధ్యక్షుడు దోనాదుల సత్యం, సూపర్వైజర్ రాజు, సీఈఓ దేవేందర్ సింగల్ విండో సిబ్బంది అల్లాజీ, పద్మకర్ తదితరులు పాల్గొన్నారు.

## డిజిటల్ అరెస్ట్ ఉండదు, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి



**విశ్వంభర, భూపాలపల్లి:** ఇటీవల వివిధ ప్రభుత్వ ఏజెన్సీల పేరుతో, డిజిటల్ అరెస్ట్ పేరుతో సైబర్ నేరగాళ్లు ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని, డిజిటల్ అరెస్ట్ అనేది ఉండదని, ప్రజలు ఎవరూ డిజిటల్ అరెస్ట్ ను నమ్మవద్దని, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సైబర్ నేరగాళ్లు లాటరీలు, రివార్డులు, జాబ్స్, కమీషన్లు, డిస్కౌంట్లు, వివిధ రకాల పేరుతో సులభంగా డబ్బు సంపాదించుకోవచ్చని ఆశచూపి మోసం చేస్తున్నారని, మొబైల్‌కు వచ్చిన ఓటీపీ ఎవరికి చెప్పొద్దనీ, అనవసర సమయాల్లో ఇంటర్నెట్ ఆఫ్ చేయడం మంచిదనీ, గుర్తు తెలియని వ్యక్తులు పంపిన లింకులను ఎట్టి పరిస్థితుల్లో క్లిక్ చేయకూడదనీ, అధికారిక వెబ్‌సైట్లను మాత్రమే ఉపయోగించుకోవాలని ఎస్పీ సూచించారు. అలాగే సామాజిక మాధ్యమాల్లో వ్యక్తిగత విషయాలు అప్‌లోడ్ చేయవద్దనీ అన్నారు. సైబర్ నేరాల బారిన పడకుండా ఉండాలంటే అప్రమత్తతే ఆయుధమని ఎస్పీ పేర్కొన్నారు. మొబైల్ ఫోన్లు, వ్యక్తిగత ఈమెయిల్, వాట్సాప్‌లో వచ్చే అనుమానస్పద లింకులు సందేశాలతో స్పందించవద్దని, ఎక్కువ డబ్బు ఆశ చూపే వారిపట్ల అలర్ట్ గా ఉండాలని, ఎస్పీ కిరణ్ ఖరే పేర్కొన్నారు. అలాగే ప్రభుత్వ దర్యాప్తు సంస్థల పేరుతో ఎవరైనా వీడియో కాల్ లలో భయపడితే భయపడద్దని, నేరుగా పోలీసులను సంప్రదించాలని ఎస్పీ సూచించారు. ఎలాంటి నేరంలోనైనా డిజిటల్ అరెస్టులు ఉండవని, అలా ఎవరైనా బెదిరించారంటే, మోసం చేస్తున్నట్టే అని, అయితే ఏ పరిస్థితుల్లోనూ నగదును ఇతరుల ఖాతాలోకి బదిలీ చేయొద్దన్నారు. సైబర్ నేరాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి జిల్లా పోలీసులు గ్రామాల్లో, పాఠశాలు, కళాశాల్లో అవగాహన కల్పిస్తున్నారనీ, సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయిన వారు వెంటనే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేసి వివరాలు తెలియజేస్తే 24 గంటల్లో డబ్బు తిరిగి వచ్చే అవకాశం ఉందని, సైబర్ నేరానికి గురైతే వెంటనే పోలీసులను ఆశ్రయించాలని ఎస్పీ సూచించారు.

## మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్‌లకు ఘనంగా సన్మానం

*** నామినేటెడ్ పోస్టులలో ముదిరాజులకు ప్రాధాన్యత కల్పించాలి**

**- ముదిరాజ్ తాలూకా అధ్యక్షులు మంగ వెంకటేష్ ముదిరాజు**



**విశ్వంభర, గుడి మల్కాపూర్:** గుడి మల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ గా ఎన్నికైన తలారి మల్లేష్ ముదిరాజ్, వైస్ చైర్మన్ గా ఎన్నికైన కావలి చంద్రశేఖర్ ముదిరాజ్ ను షాద్ నగర్ తాలూకా ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా స్పీకర్ గడ్డం ప్రసాద్, షాద్ నగర్ శాసనసభ్యులు వీర్లపల్లి శంకర్, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్, మక్తల్ ఎమ్మెల్యే శ్రీహరి ముదిరాజు, ఎన్నికైన చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్లను అభినందిస్తూ రైతులకు అండగా నిలవాలని అన్నారు. అధ్యక్షులు మంగం వెంకటేష్ మాట్లాడుతూ గుడిమల్కాపూర్ మార్కెట్ చైర్మన్, వైస్ చైర్మన్ లుగా ముదిరాజులకు పెద్దపీట వేసిన నాయకులకు ముదిరాజులు ఎప్పుడు రుణపడి ఉంటారని అత్యధిక జనాభా ఉన్న ముదిరాజులకు స్థానిక ఎలక్షన్లలోను నామినేటెడ్ పోస్టుల లోను ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమానికి తాలూకా అధ్యక్షులు మంగ వెంకటేష్ ముదిరాజు, ముదిరాజ్ సంఘం గౌరవ సభ్యులు పైలయ్య ముదిరాజ్, గౌరవ సభ్యులు అంచరాములు ముదిరాజ్, చింతగూడెం అంజయ్య ముదిరాజ్, షాద్ నగర్ తాలూకా యువత అధ్యక్షులు ఏవీఎం శ్రీధర్ వర్మ ముదిరాజ్, యువత ఉపాధ్యక్షులు మంగ అశోక్ ముదిరాజ్, మండల అధ్యక్షులు కుడుముల బాలరాజు ముదిరాజ్, ముదిరాజు ఆర్గనైజింగ్ కమిటీ మానపాటి ప్రదీప్ కుమార్ ముదిరాజ్, మంగ భీమయ్య, మంగ మధు, చెక్కల బాలకృష్ణ, షాద్నగర్ ముదిరాజ్ సంఘం తరఫున శాలువా పూలమాలతో బొకేలతో అభినందనలు తెలియజేశారు.

## మార్కెట్ కమిటీ పాలకమండలి ప్రమాణ స్వీకారం

*** హాజరైన షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**



**విశ్వంభర, గుడిమల్కపూర్:** శుక్రవారం గుడిమల్కపూర్ మార్కెట్ యార్డు నందు నూతన మార్కెట్ కమిటీ ఛైర్మన్ మరియు వైస్ ఛైర్మన్ పాలకమండలి సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హజరయ్యారు. ఈ సందర్భంగా షాద్ నగర్ ఎమ్మెల్యే మాట్లాడుతూ నాలుగు సంవత్సరాల తరువాత పాలక మండలిని నియమించడమే కాకుండా ఛైర్మన్, వైస్ ఛైర్మన్ గా బీసీ బిడ్డలను నియమించడం హర్షించదగ్గ విషయం అని పేర్కొన్నారు. మార్కెట్ కు వచ్చే పేద రైతులకు మార్కెట్ కమిటీ సొంత లాభాలతో మధ్యాహ్నం భోజనం కల్పించే అవకాశాలను పరిశీలించాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్, శాసన మండలి చీఫ్ విప్ మహేందర్ రెడ్డి, స్థానిక శాసన సభ్యులు ప్రకాష్ గౌడ్, చేవెళ్ళ ఎమ్మెల్యే కాలే యాదయ్య, మక్తల్ శాసన సభ్యులు వాకాటి శ్రీహరి, లైబ్రరీ ఛైర్మన్ మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ



**విశ్వంభర, తంగళ్ళపల్లి:** రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి మండలం గోపాలపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకుల చేతుల మీదుగా ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని అందించడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. గ్రామంలోని లబ్ధిదారుడు జే రవీనా భర్త స్వామికి 35 వేల రూపాయల విలువ గల చెక్కును అందజేయడం జరిగిందని సబ్బండ వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాపాలన లక్ష్యమని ఈ సందర్భంగా తెలియజేశారు. కార్యక్రమంలో మిరియాల శ్రీనివాస్ యాదవ్, గ్రామ శాఖ అధ్యక్షుడు కటారి సునీల్ రెడ్డి, మండల సీనియర్ నాయకులు కొండ వేణిప్రశాంత్, కొండే వేణి, రవి, దూది చంద్రయ్య, జంగం సత్తయ్య, చదిరుమళ్ళ మల్లయ్య, కూతురి ఎల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## కల్వకుర్తి అభివృద్ధే లక్ష్యం : ఎమ్మెల్యే కసిరెడ్డి




**విశ్వంభర, కల్వకుర్తి:** కల్వకుర్తి మున్సిపాలిటీ పరిధిలో శుక్రవారం 4.8 కోట్ల రూపాయలతో వివిధ అభివృద్ధి పనులను కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ప్రారంభించారు. 89 లక్షల డి.ఎం.ఎఫ్.టి ఫండ్ నుండి 1.17 లక్షలు ఎస్.డి.ఎఫ్ ఫండ్ నుండి 2.80 లక్షలు జనరల్ ఫండ్ నుండి కేటాయించి వివిధ కులాలకు సంబంధించిన కమ్యూనిటీ హాల్స్, సీసీ రోడ్లు మరియు యు.జి.డి పనులకు మొత్తం దాదాపు 4.80 కోట్లరూపాయల అభివృద్ధి పనులను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధి కోసం అహర్నిశలు పనిచేస్తానని అన్నారు. కార్యక్రమంలో పొల్యూషన్ బోర్డ్ మెంబర్ బాలాజీ సింగ్, మాజీ సర్పంచ్ ఆనంద్ కుమార్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ వావిళ్ళ మనీలా సంజీవ్ కుమార్, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలి : సీఐ



**విశ్వంభర, ఆమనగల్లు:** ఆమనగల్లు, తలకొండపల్లి పోలీస్ స్టేషన్లలో ఏఎస్ఐ లుగా పనిచేస్తున్న కె.యాదయ్య, బి.సీతారాం రెడ్డిలు ఇటీవల పదోన్నతి పొంది, ఎస్ఐ లుగా శిక్షణ పూర్తి చేసుకున్నారు. శుక్రవారం వారిరువురికి ఆమనగల్లు సీఐ బి. ప్రమోద్ కుమార్ తన కార్యాలయంలో ఎస్ఐ లు వెంకటేష్, శ్రీకాంత్ ల సమక్షంలో పదోన్నతి బ్యాడ్జీలు అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ 'గత ముప్పై ఏళ్ళకు పైగా పోలీసు శాఖలో ఏ విధంగా ఐతే నిబద్ధతతో విధులు నిర్వర్తించారో అదే విధంగా భవిష్యత్తులో కూడా పనిచేసి పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలని వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై మురళీధర్ రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

## ఎస్ఐ నిరంజన్‌కు సన్మానం



**విశ్వంభర, కడ్తాల్:** కడ్తాల్ పోలీస్ స్టేషన్ లో ఏఎస్ఐ గా విధులు నిర్వహిస్తున్న నిరంజన్ కు ఎస్ఐ గా ప్రమోషన్ రావడం చాలా సంతోషకరంగా ఉందని లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కడ్తాల్ మాజీ జడ్పీటీసీ జర్పుల దశరథ్ నాయక్ అన్నారు. ఈ సందర్భంగా ఆయనను స్థానిక నాయకులతో కలిసి నిరంజన్ కు శాలువ కప్పి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

**పోక్సో కేసులో నిందితుడికి**

## 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష

**విశ్వంభర, ఎల్బీనగర్:** పోక్సో కేసులో నిందితుడికి రంగారెడ్డి జిల్లా ఫాస్ట్ ట్రాక్ కోర్టు 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష విధించింది. నాగర్ కర్నూలు జిల్లా వెల్దండ మండలం బస్నోన్ పల్లికి చెందిన ఆకుల నరేశ్ (24) కర్మన్ ఘాట్ లోని గ్రీన్ పార్క్ కాలనీలో ఉంటూ తాపీ మేస్త్రీగా పనిచేసేవాడు. 2017లో సరూర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో అతనిపై పోక్సో కేసు నమోదైంది. రంగారెడ్డి జిల్లా ఫాస్ట్ ట్రాక్ కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి గురువారం పోక్సో చట్టం ప్రకారం నిందితుడిని దోషిగా నిర్ధారించి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.30 వేలు జరిమానా విధించారు. బాధితురాలికి రూ.5 లక్షలు పరిహారం అందించారు. ఈకేసులో అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ సునీత వాదనలు వినిపించారు.



**నార్కెట్‌పల్లి మండలం షాపల్లి గ్రామంలో నిర్వహించిన కమలాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి బ్రహ్మోత్సవాలకు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించిన నకిరేకల్ మాజీ శాసనసభ్యులు చిరుమర్తి లింగయ్య. (విశ్వంభర, నకిరేకల్)**

# నారాయణ హాస్పిటల్‌లో 100 గుండె ఆపరేషన్లు



విశ్వంభర, కుత్బుల్లాపూర్: సూరారం లోని మల్లారెడ్డి నారాయణ హాస్పిటల్ లో మినిమల్ ఇన్వేసివ్ సర్జరీలో 100 గుండె ఆపరేషన్ లు విజయవంతంగా నిర్వహించి ఆ 100మంది కొలుకున్న పేషంట్స్ తో హాస్పిటల్ యాజమాన్యం మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. పేషంట్ల జీవితాలని దృష్టిలో ఉంచుకుని పేషెంట్ల గుండె ఆరోగ్యంగా ఉండేందుకు బైపాస్ సర్జరీలు చేయకుండా పెరిగిన టెక్నాలజీతో మినిమల్ ఇన్వేసిస్ సర్జరీ ద్వారా చాతీపై 3ఇంచుల కోతతో విజయవంతంగా ఆపరేషన్ లు నిర్వహించేందుకు వీలుగా మల్లారెడ్డి నారాయణ హాస్పిటల్ లో అత్యాధునిక పరికరాలను అందుబాటులోకి తీసుకొచ్చి గుండె ఆపరేషన్ లను సక్సెస్ చేశారు. మల్లారెడ్డి హెల్త్ సిటీ డైరెక్టర్ ప్రీతిరెడ్డి మాట్లాడుతూ నార్త్ హైదరాబాద్ లోనే మొట్టమొదటగా డా. హరీష్ బడామి(కార్డియాలజీ) ఆధ్వర్యంలో మినిమల్ ఇన్వేసివ్ సర్జరీలను మల్లారెడ్డి నారాయణ హస్పిటల్ లోనే తక్కువ రేటుకే చేస్తూ, 2వారాల్లో పేషెంట్లు పూర్తిగా కోలుకునే విధంగా గుండె ఆపరేషన్ లను విజయవంతంగా నిర్వహిస్తున్నామని దీన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మల్లారెడ్డి హెల్త్ సిటీ ఛైర్మెన్ డా. భద్రారెడ్డి మాట్లాడుతూ మల్లారెడ్డి నారాయణ హస్పిటల్ లో గడిచిన 10నెలల్లోనే 100 మినిమల్ ఇన్వేసివ్ కార్డియాక్ సర్జరీలు విజయవంతంగా నిర్వహించామని, రానున్న 3నెలల్లో రోబోటిక్ సర్జరీలతో అతి తక్కువ టైంలో మెరుగైన సర్జరీలను చేసి అతి తక్కువ టైంలో పేషెంట్లు త్వరగా కొలుకునే విధంగా ఆధునాతన ఎక్విప్మెంట్ మిషనరీల ఆదారంగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. హృదయ ఆరోగ్యానికి కేంద్రీకృత చికిత్స మినిమల్ ఇన్వేసివ్ కార్డియాక్ సర్జరీ చిన్న గాయాలతో హృదయ శస్త్రచికిత్సలు చేయడానికి అనుమతించే ప్రక్రియ. ఈ ఆధునిక విధానం ఛాతి ఎముకను కోయకుండా శస్త్రచికిత్స చేయడానికి వీలు కల్పిస్తుంది. ఫలితంగా శరీరంపై భౌతిక ఒత్తిడి తగ్గడం, త్వరితగతిన కోలుకోవడం, పునరావాస సమయంలో తక్కువ నొప్పి వంటి ప్రయోజనాలు లభిస్తాయి. డాక్టర్ హరీష్ బడామి నాకు కొత్త జీవితం ఇచ్చారు అని ఓ పేషెంట్ తెలిపారు. ఆసుపత్రిలో ఉన్నప్పుడు వారి జాగ్రత్త కారణంగా నాకు ఎటువంటి క్షతి రాలేదు. టీమ్ నాకు పునరావాసంలో సహాయం చేసి, కొద్ది రోజుల్లో నడవగలిగేలా చేసింది. వారి సూచనలు నేను కోలుకోవడంలో కీలకపాత్ర పోషించాయి. హృదయ శస్త్రచికిత్స చేయించుకోవడం గురించి నాకు మొదట భయం వేయించిందని, కానీ మినిమల్ ఇన్వేసివ్ పద్ధతి వల్ల నేను తక్కువ నొప్పితో, కొన్ని వారాల్లోనే నా రొటీన్‌కు తిరిగి వెళ్లగలిగానని, ఆ తర్వాతి చిట్కాలు, గాయాల పరిరక్షణపై ఇచ్చిన మార్గదర్శకాలు ఎంతో మేలుచేశాయని మరో పేషెంట్ తెలిపారు. డాక్టర్ హరీష్ నైపుణ్యం, ఆసుపత్రిలోని ఆధునిక సౌకర్యాలు నా శస్త్రచికిత్స విజయవంతం కావడానికి సహాయపడ్డాయి. రెగ్యులర్ ఫాలోఅప్‌లు నా జీవితంలో పూర్వపు ఆరోగ్యాన్ని తిరిగి తెచ్చాయి. ఈ ఆధునిక పద్ధతిలో అధునాతన ఉపకరణాలు, హై డెఫినిషన్ కెమెరాలను ఉపయోగించి చిన్న కట్లతో హృదయ శస్త్రచికిత్సలు చేస్తారు. ఈ ప్రక్రియలో ఎండోస్కోపిక్ వెయిన్ హార్వెస్టింగ్ (ఈవీహెచ్) అనే ప్రత్యేక పద్ధతిని ఉపయోగించడం మరో పెద్ద ముందడుగు. ఇది మరింత వేగవంతంగా కోలుకోగలిగాను, తక్కువ నొప్పికి కారణమవుతుంద రెండు వారాల్లో సాధారణ జీవనానికి తిరిగి రావచ్చు. తక్కువ సంక్లిష్టతలు ఇన్‌ఫెక్షన్, స్ట్రోక్ లేదా శ్వాసకోశ సమస్యల ముప్పు తక్కువగా ఉంటుంది ఇంకో పేషెంట్ అన్నారు. మెరుగైన జీవన ప్రమాణాలు వైద్య సేవల పొందేవారు తక్కువ నొప్పితో శస్త్రచికిత్స అనంతర జీవితం మరింత సజావుగా ఉంటుంది. మరింత సమాచారం కోసం ఫోన్ నెం. 92465 20296 / 98490 20296 సంప్రదించండి.

## సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అంజేయాలి

**సీపీఐ మరిపెడ మండల కార్యదర్శి మారగాని బాలకృష్ణ**



**విశ్వంభర, మానుకోట/మరిపెడ:** మానుకోట జిల్లా మరిపెడ మండల కేంద్రంలో శుక్రవారం విలేకర్ల సమావేశంలో సీపీఐ మరిపెడ మండల కార్యదర్శి మారగాని బాలకృష్ణ మాట్లాడుతూ రాష్ట ప్రభుత్వం జనవరి 26 నుండి ప్రవేశ పెట్టబోయే రైతు భరోసా, ఇందిరమ్మ ఇల్లు, నూతన రేషన్ కార్డులు, భూమిలేని రైతు కూలీలకు కూలి భరోసా మొదలగు సంక్షేమ పథకాలు పథకాలన్నిటికీ గ్రామ సభలో అధికారులు పారదర్శకత పాటించి అర్హులైన ప్రతి ఒక్క పేదవారికి అన్ని సంక్షేమ పథకాలు అందే విధంగా తారతమ్యం లేకుండా అర్హులైనవారికి అందేలా చూడాలని అన్నారు. అధికారులకు అన్ని రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని పార్టీలకు అతీతంగా క్షేత్రస్థాయిలో పరిశీలించి లబ్ధిదారుల జాబితాలను గ్రామసభలో పారదర్శకత పాటించి అర్హులైన పేదవారికి ఎంపిక చేయాలని కోరారు. అదేవిధంగా వానా కాలంలో రైతు భరోసా ఆగి నందుకు దానిని కూడా కలిపి ఏకకాలంలో రెండు పంటలకు రైతు భరోసా డబ్బులు రైతుల అకౌంట్లో జమ చేయాలి అన్నారు. అలాగే ఇందిరమ్మ ఇండ్లను గ్రామ సభల ద్వారా అధికారులు రాజకీయ నాయకుల ప్రమేయం లేకుండా క్షేత్రస్థాయిలో పరిశీలించి లబ్ధిదారులను ఎంపిక చేయాలని, భూమిలేని కూలీలకు ఇచ్చే భరోసా పథకాన్ని ఉపాధి హామీ పనిని 20 రోజులు కనీసం చేయని వారిని కూడా ఈ పథకంలో లబ్ధి దారులుగా చేకూర్చి వారికి కూడా ఈ పథకాన్ని వర్తింప చేయాలని కోరడం జరిగింది. ఈ సమావేశంలో సీపీఐ పట్టణ కార్యదర్శి మల్లెపాక యాకన్న, ఏఐటీయూసీ నాయకులు నారాయణ, అంజి మొదలగువారు పాల్గొన్నారు.

## గ్రామాలలో సాగుకు యోగ్యంకాని భూములు పరిశీలన



**విశ్వంభర, పెద్ద శంకరంపేట:** రైతు భరోసా పథకం పటిష్టంగా అమలు పరచడానికి ప్రభుత్వం చర్యలు గైకొందని అందులో భాగంగానే సాగుకు యోగ్యం కాని భూములను పరిశీలించి సాగుకు అనువైన భూములకే రైతు భరోసా పథకాన్ని అందించేందుకు ప్రభుత్వం చర్యలు గైకొంటుందని అందులో భాగంగానే భూముల పరిశీలన కార్యక్రమం మండల పరిధిలో చేపట్టడం జరిగిందని పెద్ద శంకరంపేట మండల తాహసీల్దార్ గ్రేసీ బాయ్ పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని గ్రామాలలో భూ పరిశీలన కోసం వ్యవసాయ రెవెన్యూ అధికారుల సమక్షంలో మండల పరిధిలో మూడు టీంలను వేసి భూ పరిశీలన కార్యక్రమాన్ని చేపట్టామని ఆమె తెలిపారు. రైతు భరోసా పథకం కింద ప్రభుత్వం 12,000 రెండు దఫారాలు ఇవ్వనున్నందున సాగుకు యోగ్యమైన భూములకే రైతు భరోసా ఇవ్వాలని లక్ష్యంగా ఈ పరిశీలన కొనసాగుతుందని అన్నారు. వెంచర్లు కొండలు గుట్టలు రహదారులు గ్రామ కంఠం లో ఉన్న భూములను రైతు భరోసా పథకానికి వర్తించవని ఆమె పేర్కొన్నారు. ఈ భూ పరిశీలన కార్యక్రమం టీం అధికారులు ఈనెల 16 నుండి 20వ తేదీ వరకు పరిశీలన నిర్వహిస్తారని అన్నారు. పెద్ద శంకరంపేట మండల పరిధిలోని బూరుగుపల్లి కొప్పల్ కొత్తపేట్ బద్దారం గొట్టిముక్కుల మల్కాపూర్ దానం పల్లి తదితర గ్రామాలలో భూ పరిశీలన కార్యక్రమం పూర్తయిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తాహసీల్దార్ గ్రేసీ బాయ్, వ్యవసాయాధికారి, స్పెషల్ ఆఫీసర్, సూపర్వైజర్లు, తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించే వరకు ఉద్యమిస్తాం

**శాంతి దీక్షకు మద్దతు ఇచ్చి పలువురు సీనియర్ పాత్రికేయులు**




**విశ్వంభర, సూర్యాపేట:** టీ.ఎస్.జె.ఎ ఆధ్వర్యంలో నిర్వహించిన శాంతి దీక్షకు పలువురు సీనియర్ పాత్రికేయులు మద్దతు ఇచ్చి మాట్లాడారు. జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించే వరకు తమ ఉద్యమాలను విడతలవారిగా కొనసాగిస్తామని పోరాటాల పురిటిగడ్డ సూర్యాపేట జిల్లా కేంద్రంలో జర్నలిస్టు భవనం ఏర్పాటు ప్రక్రియ వెంటనే చేపట్టాలని, సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన పలువురు సీనియర్ జర్నలిస్టులు తెలిపారు. తెలంగాణ స్టేట్ జర్నలిస్టు అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక వాణిజ్య భవన్ సెంటర్ లో నిర్వహించిన శాంతిదీక్ష కార్యక్రమానికి మద్దతు ఇచ్చి సంఘీభావం ప్రకటించిన అనంతరం వారు మాట్లాడుతూ తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు లో జర్నలిస్టులు కీలక పాత్ర పోషించిన సంగతి పాలకులు మరచిపోవద్దని అన్నారు. ప్రభుత్వానికి ప్రజలకు ఉచితంగా సేవ చేస్తున్న జర్నలిస్టు లను విస్మరించి పాలకులు మాత్రం లబ్ది పొందుతున్నారని అన్నారు. జర్నలిస్టు లకు కనీస వేతనాలు, కొత్త వారికి అక్రిడేషన్ లు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. వర్కింగ్ జర్నలిస్టులందరికి ఎటువంటి ఆంక్షలు లేకుండా ఇంటి స్థలాలు ఇచ్చి, పక్కా ఇల్లు నిర్మాణం చేపట్టి ఇవ్వాలని తెలిపారు. తమ పిలుపును అందుకుని యూనియన్ లకు అతీతంగా వచ్చి శాంతి దీక్షకు మద్దతు ఇచ్చిన జర్నలిస్టులందరికి అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కందుకూరి యాదగిరి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు గుండా శ్రీనివాస్ గుప్త, బంటు కృష్ణ, బూపతి రాములు, వేణుమాధవ్, పి. సైదిరెడ్డి, తొలిదశ ఉద్యమకారులు బొమ్మిడి లక్ష్మినారాయణ, బచ్చు పురుషోత్తం, సీపీఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, కొండా శ్రీనివాస్, మల్లికార్జున్, పల్లె మణిబాబు, కొండ్లె క్రిష్ణయ్య, జలగం మల్లేష్, గట్టు అశోక్, క్యూ న్యూస్ రిపోర్టర్ శ్రీనివాస్, ఉయ్యాల నర్సయ్య, దేవరగట్ల సతీష్, మామిడి శ్రవణ్, జహీర్, వాసా చంద్రశేఖర్, సోమా సుమన్, పాషా, పడిసిరి వెంకట్, వల్దాస్ శంకర్, అహ్మద్ లతో పాటు అసోసియేషన్ రాష్ట్ర నాయకులు మహ్మద్ గౌసుద్దిన్, దుర్గం బాలు, చిరంజీవి, వెంకట్, సాయి కృష్ణ, మధుసూధన్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

## రోడ్ల పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలి

**- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**




**విశ్వంభర, సూర్యాపేట:** రోడ్ల పనులను నాణ్యత ప్రమాణాలతో ప్రజావసరాలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పనులు చేపట్టాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం పంచాయతీరాజ్, రోడ్లు భవనాల శాఖ ఆధ్వర్యంలో రోడ్లు నిర్మాణాలు చేపట్టే క్రమంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టే క్రమంలో సంబంధిత శాఖ ఇంజనీర్లు, మిషన్ భగీరథ ఇంజనీరింగ్ అధికారులు సమన్వయంతో రోడ్ల నిర్మాణ కు సహకరించాలని కొన్నిచోట్ల నీటి సరఫరా పాత పైపులైన్లు పరిశీలించాలని, కాల పరిమితి ఆయనచో వాటి స్థానంలో రోడ్లకు ఇరువైపులా ముందస్తుగా క్షేత్ర స్థాయిలో పరిశీలించి నేటి సరఫరా పైపులైన్లు నిర్మాణం చేపట్టాలని వాటి అంచనా నివేదిక సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. రోడ్డు భవనాల శాఖ ఆధ్వర్యంలోని రోడ్లన్నీ టెండర్లు పూర్తయ్యాయని ఈఈ సీతారామయ్య కలెక్టర్ కు వివరించారు. గడేపల్లి టు జాన్ పాడు రోడ్, అనంతగిరి టు చనుపల్లి, దొండపాడు ఎన్ హెచ్ 9 పనులు పూర్తయ్యాయని టెండర్లు పూర్తయిన పనులన్నీ ఈ నెల 24 నుండి పనులు మొదలు పెడతామని తెలిపారు. మండలాల్లోని అన్ని పాఠశాలలో టాయిలెట్స్ నిర్మాణం మార్చి రెండో వారంలో పూర్తి చేయాలన్నారు. ఎంఆర్ఆర్, సీఆర్ఆర్ కింద చేపట్టిన పనులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. మిగిలి ఉన్న 2 బీహెచ్‌కే పనులు త్వరగా పూర్తి చేయాలని పంచాయతీ అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పీఆర్ ఎస్సీ ప్రకాష్, ఈఈ వెంకటయ్య, ఈఈ ఆర్ అండ్ బీ సీతారామయ్య, డీ ఈ పవన్, మిషన్ భగీరథ ఇంజనీర్లు అరుణ్ కుమార్ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

## రక్తదానం చేయండి.. ప్రాణ దాతలు కండి

*** లేమామిడిలో రక్తదాన శిబిరం**




విశ్వంభర, ఆమనగల్ : ప్రతి ఒక్కరు రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్ అధ్యక్షులు పసుల లక్ష్మా రెడ్డి పిలుపు నిచ్చారు. శుక్రవారం మండల పరిధిలోని లేమామిడి గ్రామంలో మాజీ సర్పంచ్ శ్రీశైలం గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని లయన్స్ క్లబ్ అధ్యక్షులు లయన్ పసుల లక్ష్మారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి యువత స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేస్తే ప్రాణదాతలు అవుతారని పేర్కొన్నారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న మనిషిని కాపాడడానికి కేవలం రక్తదాతలు అందిస్తున్న రక్తంతోనే వారి ప్రాణాలను కాపాడుతున్నట్లు తెలిపారు. గ్రామం మాజీ సర్పంచ్ శ్రీశైలం గౌడ్ ఇచ్చిన పిలుపుతో 42 మంది రక్తదానం చేయడం పట్ల యువకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో క్యాంప్ ఛైర్మన్ లయన్ పి అంజిరెడ్డి పి ఆర్ ఓ పాష క్లబ్ సభ్యులు మోహన్ రెడ్డి జిల్లా ఛైర్మన్ ఓంకారం, లయన్ యం.అంజయ్య మన్మధ రెడ్డి బ్లడ్ బ్యాంకు బృందం గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేద కుటుంబానికి ఆర్థిక సహాయం



విశ్వంభర, మరిపెడ: జనగామ జిల్లా జనగామ మండలం చిటకోడూరు గ్రామానికి చెందిన సురేష్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా మృతునికి భార్య ఇద్దరు పిల్లలున్నారు. వారి కుటుంబ పరిస్థితి దిన దిన గండంగా మారడంతో విషయం తెలుసుకున్న కురవికి చెందిన ప్రముఖ సామాజిక సేవకుడు ఇన్ స్టాగ్రాం రఘు తన ఫాలోవర్స్ తిరుపతిలో ఉండే సుధీర్ కి విషయం వివరించగా అతను స్పందించి వెంటనే రఘుకు ఐదు వేల రూపాయలు పంపించారు. వారి కుటుంబానికి తాత్కాలిక అవసరాలకు మన వంతు సహాయంగా ఈ 5,000 ఐదువేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు.

## కుంబాభిషేకంపై కలెక్టర్ సమీక్ష



**విశ్వంభర, భూపాలపల్లి:** పవిత్ర పుణ్యక్షేత్రం కాళేశ్వరంలో ఫిబ్రవరి 7, 8, 9 తేదీలలో జరిగే మహ కుంభాభిషేకం, మే లో జరుగు సరస్వతి పుష్కరాలు ఘనంగా నిర్వహిస్తామని కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. మే 15 నుండి 26 వరకు జరుగు సరస్వతీ పుష్కరాలు, ఫిబ్రవరి 7, 8, 9 తేదీల్లో జరిగే మహా కుంభాభి షేకం కార్యక్రమాల నిర్వహణ, ఆలయ అభివృద్ధి పనులపై శుక్రవారం కాళేశ్వరం ఈఓ కార్యాలయంలో దేవస్థానం, పోలీస్, రెవెన్యూ, పంచాయతీ రాజ్, ఇరిగేషన్, ఆర్ అండ్ బీ, వైద్య శాఖల జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ కాళేశ్వర దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించే మహా కుంభాభిషేకానికి సుమారు 20 వేల వరకు భక్తులు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. గోపురం పనులు పూర్తి చేయాలని దేవస్థానం అధికారులను ఆదేశించారు. సరస్వతి పుష్కరాలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా మరుగుదొడ్లు, లైటింగ్, దుస్తులు మార్చుకొకు గదులు, స్నానాలు చేయడానికి కుళాయిలు, ఘాట్స్, రహదారుల మరమ్మతులు, వాహనాల పార్కింగ్ స్థలాల ఏర్పాట్లపై అధికారులకు చేయాల్సిన పనులపై దిశానిర్దేశం చేశారు. పెండింగ్ ఉన్న పనులను అన్నిశాఖల అధికారులతో సమన్వయంతో త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. పుష్కరాలు నిర్వహణకు అన్ని శాఖల అధికారులు మాస్టర్ ప్లాన్ తయారు చేయాలని సూచించారు. సరస్వతి పుష్కరాలకు అన్ని ఏర్పాట్లు ఏప్రిల్ 30వ తేది వరకు పూర్తి చేయాలని అధికారులను అదేశించారు. ఈ సమావేశంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, ఎఎస్పీ బోనాల కిషన్, డీపీఓ నారాయణ రావు, జిల్లా వైద్యాధికారి డాక్టర్ మధుసూదన్, పీఆర్ ఈ ఈ వెంకటేశ్వర్లు, ఇరిగేషన్, ఆర్ అండ్ బీ, విద్యుత్ శాఖల అధికారులు, ఆలయ పర్యవేక్షకులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాలపై గ్రామ స్థాయిలో అవగాహన

*** రోడ్డు నియమ, నిబంధనలను తప్పక పాటించాలి**

**- జిల్లా రవాణా శాఖ అధికారి జి సురేష్ రెడ్డి.**

**విశ్వంభర, సూర్యాపేట:** రోడ్లపై జరిగే వాహనాల ప్రమాదాలపై ప్రతి ఒక్కరు జాగ్రత్త వహించాలని జిల్లా రవాణా శాఖ అధికారి జి సురేష్ రెడ్డి అన్నారు. శుక్రవారం మోతె మండల వాహన దారుల అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వాహనం నడిపే వ్యక్తితో పాటు, పక్కన ఉన్న వ్యక్తి తప్పనిసరిగా సీటు బెల్టు ధరించడం ద్వారా ప్రమాదాలను నివారించుకోవచ్చు అన్నారు. ముఖ్యంగా గ్రామాల, మండలాలలో వాహనదారులు రోడ్డు దాటేటప్పుడు రోడ్డుకు ఇరువైపులా చూసుకొని రోడ్డు దాటాలని చెప్పారు. ప్రభుత్వం నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పక ఆచరించాలన తెలిపారు. వాహనదారుడు తన వాహనాన్ని పార్కు చేసేటప్పుడు నిర్దేశిత పార్కింగ్ ప్రదేశంలో ప్రజలకు, ఇతర వాహనాలకు ఇబ్బందులు కలగకుండా పార్కింగ్ చేయాలని కోరారు. వాహనాల లైట్లను లైట్ ను ఎక్కువ కాంతివంతంగా లేకుండా చూసుకోవాలని చెప్పారు. వాహనాలు యూటర్న్ తీసుకునేటప్పుడు ప్రమాదాలను నివారించడానికి సిగ్నల్ ఇస్తూ, ముందు వెనక చూసుకొని నెమ్మదిగా వెళ్లాలని తెలిపారు. క్రమం తప్పకుండా కారు మెయింటెనెన్స్ సరిగ్గా చూసుకోవాలని అన్నారు. అవగాహన కార్యక్రమంలో మోటార్ రవాణా అధికారి జయప్రకాష్ రెడ్డి, ఏ ఆదిత్య, సహాయ వాహనా అధికారులు పాల్గొన్నారు.



# లబ్ధిదారుల ఎంపికలో ఎలాంటి లోటుపాట్లు ఉండకూడదు

**- కలెక్టర్ రాహుల్ శర్మ**



**విశ్వంభర, భూపాలపల్లి:** రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 26 నుండి అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేసేందుకు సిద్ధం చేసిన రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, నూతన ఆహార భద్రతా కార్డులు, ఇందిరమ్మ ఇండ్లకు లబ్ధిదారుల ఎంపిక సర్వేలో ఎలాంటి లోటుపాట్లుకు తావులేకుండా ఖచ్చితత్వం తో నమోదులు చేయాలని భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. శుక్రవారం కాటారం మండలం కొత్తపల్లిలో జరుగుతున్న రైతు భరోసా, ఆహార భద్రతా కార్డుల విచారణ ప్రక్రియ ను జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ నమోదు చేస్తున్న వివరాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన నాలుగు పథకాల అమలుకు జిల్లాలో సర్వే ప్రక్రియ ముమ్మరంగా జరుగుతున్నట్లు తెలిపారు. సర్వే నిర్వహణ వచ్చే టీములకు ప్రజల సహకారం అందించాలని ఆయన సూచించారు. ప్రభుత్వం ప్రకటించిన నాలుగు పథకాల లబ్ధి అర్హులైన ప్రతి కుటుంబానికి అందేలా చర్యలు తీసుకోవడం ప్రధాన లక్ష్యంగా క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి గ్రామసభల్లో జాభితా ప్రదర్శన చేసి అర్హులను ఎంపిక చేయనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. వ్యవసాయానికి అనువుగా లేని భూములు తదితర వివరాలను ఎలాంటి పొరపాటుకు తావులేకుండా పకడ్బందీగా నమోదులు చేస్తున్నట్లు తెలిపారు. సర్వేలో ఏమైనా సమస్య వస్తుందా? వస్తే అట్టి కారణాలను వ్రాయాలని సూచించారు. 16 నుండి 20వ తేది వరకు సర్వే జరుగుతుందని, 21 నుండి 24వ తేది వరకు గ్రామసభలు నిర్వహించి అర్హుల జాబితాను సిద్ధం చేయనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్,ఎంపీడీఓ బాబు, ఎంపీవో వీరస్వామి, నాయబ్ తహసీల్దార్ రామ్మోహన్, ఏఈఓ దివ్య జ్యోతి, కార్యదర్శి జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.

## లక్ష డప్పులు వెయ్యి గొంతుకల మండల కమిటీ నియామకం



**విశ్వంభర, భూపాలపల్లి:** ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ లక్ష డప్పులు వెయ్యి గొంతుకల మహాదేవపూర్ మండల కమిటీ అధ్యక్షులుగా ఇరుగురాల సమ్మరాజు మాదిగను నియమిస్తున్నట్లు జిల్లా కళా మండల అధ్యక్షులు బోనపాకల కుమార్ ఏకగ్రీవంగా ప్రకటించారు. మహాదేవపూర్ మండల కేంద్రంలో లక్ష డప్పులు కళానాయకుల సమావేశం సమ్మరాజు అధ్యక్షతన జరిగింది. అధ్యక్షులుగా ఇరుగురాల సమ్మరాజును ఉపాధ్యక్షులు గా అట కాపురం రాజేష్, కార్యదర్శి గా మంచినీళ్ల మధు లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగినది. ఫిబ్రవరి 7న హైదరాబాదు లో జరిగే లక్ష డప్పులు వెయ్యి గొంతుకల కార్యక్రమంలో మాదిగ, మాదిగ ఉప కులాల నాయకులందరూ పాల్గొని ఈ సభను విజయవంతం చేయవలసిందిగా భూపాలపల్లి జిల్లా నాయకులు విజ్ఞప్తి చేశారు.

## ఎస్ఐని సన్మానించిన టేకుమట్ల బీఆర్ఎస్ నాయకులు



**విశ్వంభర, భూపాలపల్లి:** భూపాలపల్లి జిల్లా టేకుమట్ల స్థానిక పోలీస్ స్టేషన్ కు నూతన ఎస్ఐ గా దాసరి సుధాకర్ పదవి బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఆయనను బి.ఆర్.ఎస్ పార్టీ మండల నాయకులు కలిసి మర్యాదపూర్వకంగా శాలువతో సన్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు సట్ల రవి గౌడ్, ప్రధాన కార్యదర్శి ఆకునూరు తిరుపతి, మాజీ ఎంపీటీసీ ఆది రఘు, పింగిలి వెంకటేశ్వర్ రెడ్డి, మాజీ ఎంపీపీ బందెల నరేష్, మాజీ సర్పంచులు ఉద్దమారి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## నవోదయ ఎంపిక పరీక్షకు ఏర్పాట్లు పూర్తి



**విశ్వంభర, పెద్ద శంకరంపేట:** నవోదయ ప్రవేశ పరీక్షకు సర్వం సిద్ధం చేశామని క్లస్టర్ లెవెల్ అధికారి రవి ఖాళ్ లెవెల్ అధికారి తారా సింగ్ తెలిపారు. జవహర్ నవోదయ విద్యాలయం వర్గల్ లో 2025, 26 విద్యా సంవత్సరానికి ఆరవ తరగతిలో ప్రవేశాలకు ఎంపిక పరీక్ష నిర్వహించేందుకు శుక్రవారం ఏర్పాటు చేయడం జరిగిందని ఏర్పాట్లను పరిశీలించడానికి క్లస్టర్ లెవెల్ అధికారి డాక్టర్ రవి, ఖాళ్ లెవెల్ అధికారి డి తారా సింగ్ కేంద్రాన్ని సందర్శించి పర్యవేక్షణ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు విఠల్, ఉపాధ్యాయులు సాయిలు నాయక్, శ్రీనివాస్, గుండస్వామి, సుధాకర్, పరమేశ్వరి మొదలైన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పడకేసిన పారిశుద్ధ్యం



**విశ్వంభర, మహాదేవపూర్:** జయశంకర్ భూపాల పల్లి జిల్లా మహాదేవపూర్ మండలం సూరారం గ్రామంలో పారిశుద్ధ్యం పడ కేసిందని చెప్పవచ్చు. గత కొద్ది రోజులుగా మిషన్ భగీరథ నీరు రోడ్డుపై వచ్చి చేరడంతో ప్రధాన రహదారి వద్ద బురదమయంగా మారుతుంది. అంతేకాకుండా ఇళ్లల్లో శుభ్రం చేసినటు వంటి అపరిశుభ్రమైన నీటిని రోడ్లపైకి వదలడంతో ప్రధాన రహదారులు కంపు కొడుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత గ్రామ కార్యదర్శి గాని, స్పెషల్ ఆఫీసర్ గానీ స్పందించి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## ఉచిత ఫ్రీజర్ బాక్స్ అందజేసిన కర్నె ప్రభాకర్



**విశ్వంభర, సంస్థాన్ నారాయణపూర్:** సంస్థాన్ నారాయణపురం ప్రజలకు కర్నె శివలీల జంగప్ప జ్ఞాపకార్థంగా మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ రూ.60 వేల రూపాయల విలువైన ఫ్రీజర్ బాక్స్ ను గ్రామానికి చెందిన శిరీష ఫౌండేషన్ నిర్వహకులు చెర్క కిరణ్ కుమార్ కు అందజేశారు. గ్రామస్తులతో కలిసి గ్రామ మాజీ సర్పంచ్ శికిలమెట్ల శ్రీహరి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు రాచకొండ రవి ఫౌండేషన్ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీరాములు నర్సింహ్మ, పాశం కృష్ణ యాదవ్ గ్రామశాఖ అధ్యక్షులు తెలంగాణ బిక్షం,లారీ బిక్షం,గుండమల్ల సతీష్ కుమార్, ఉప్పల శ్రీను,ఎడ్ల సత్తయ్య,రాసాల వేంకటేష్ ,చిలువేరు శంకర్,పేరా రమేష్,చిలువేరు వెంకులు, అబ్బనగోని వంశీ, బకారం శ్రీను,చింతకింది ఉషామ్మ,చిలువేరు శేఖర్,లింగస్వామి, పాత్రికేయులు సోమన బోయిన కృష్ణ కుమార్, శికిలమెట్ల ప్రభాకర్, సుధాకర్, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలను అందించేందుకు కృషి చేయాలి

*** జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యులు వడ్డేపల్లి రాంచందర్**

**విశ్వంభర, హనుమకొండ:** ప్రభుత్వ పథకాలు అర్హులైన షెడ్యూల్ కులాలకు చెందిన లబ్ధిదారులకు అందాలని జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యులు వడ్డేపల్లి రాంచందర్ అన్నారు. శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో జిల్లాలో షెడ్యూల్ కులాలకు అందిస్తున్న వివిధ పథకాలు, కార్యక్రమాలపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షా సమావేశాన్ని హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య నిర్వహించారు. జిల్లా పరిధిలోని మండలాలు, షెడ్యూల్ కులాల జనాభా, ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు, బ్యాక్ లాగ్ ఉద్యోగాలు, ప్రమోషన్లు, ఎస్సీ కార్పొరేషన్ ద్వారా మంజూరు చేసిన రుణాలు, శిక్షణ కార్యక్రమాలు, దళిత బంధు, ఎస్సీ స్టడీ సర్కిల్ శిక్షణ కార్యక్రమాలు, సంక్షేమ హాస్టల్స్, బెస్ట్ అవైలబుల్ స్కీమ్, అంబేద్కర్ ఓవర్సీస్ విద్యా నిధి పథకం, వైద్య ఆరోగ్య, ఉపాధి హామీ, పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో షెడ్యూల్డ్ కులాలకు అందించే వివిధ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు, తదితర అంశాల గురించి సంబంధిత శాఖల అధికారులు జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యులు వడ్డేపల్లి రాంచందర్ కు వివరించారు. సంబంధిత శాఖల అధికారులతో ఆయా పథకాల అమలు తీరుతెన్నుల గురించి సుదీర్ఘంగా చర్చించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ పథకాలు క్షేత్రస్థాయిలో ఏ విధంగా అమలు చేస్తున్నారని వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యులు వడ్డేపల్లి రామచందర్ మాట్లాడుతూ షెడ్యూల్ కులాలు అభివృద్ధి చెందే విధంగా రుణాలను అందించి ప్రోత్సహించాలన్నారు. సకాలంలో సబ్సిడీ రుణాలు అందే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సబ్సిడీ రుణాలు సకాలంలో అందకపోవడం వలన షెడ్యూల్ కులాల లబ్ధిదారుల సిబిల్ స్కోర్ తగ్గిపోవడం జరుగుతుందని, ప్రభుత్వం, అధికారులు సబ్సిడీ రుణాలు సకాలంలో అందే విధంగా కృషి చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఫసల్ బీమా యోజన పథకాన్ని ఎంతమంది రైతులు జిల్లాలో సద్వినియోగం చేసుకుంటున్నారనే వివరాల జాబితాను తమకు సమర్పించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం రైతులకు అందిస్తున్న సంక్షేమ పథకాలను గురించి క్షేత్రస్థాయిలో తెలియజేయాలన్నారు. ప్రైవేటు రంగంలో ఉద్యోగాల కల్పనలో కూడా షెడ్యూల్డ్ కులాలకు రిజర్వేషన్ ప్రకారం ఉద్యోగ అవకాశాలను కల్పించాలన్నారు. షెడ్యూల్డ్ కులాలలో ఔత్సహికులను పారిశ్రామికవేత్తలుగా ఎదిగేలా అధికారులు ప్రోత్సహించాల న్నారు. పేద దళితులు ఆర్థికాభివృద్ధిని సాధించేందుకు అధికారులు తోడ్పాటు అందించాలన్నారు.




## మాతా శిశు ఆస్పత్రిపై మంత్రికి నిర్లక్ష్యం ఎందుకో చెప్పాలి

**- మంథని మాజీ ఎమ్మెల్యే మధూకర్**



**విశ్వంభర, భూపాలపల్లి:** ఆడబిడ్డల కాన్పు తల్లిదండ్రులకు భారం కాకూడదనే గొప్ప ఆలోచనతో ఆనాడు బీఆర్ఎస్ ప్రభుత్వంలో మాతా శిశు ఆస్పత్రి నిర్మాణం చేసి మెరుగైన సేవలు అందిస్తే ఈనాడు కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆ ఆస్పత్రిపై మంత్రి నిర్లక్ష్యం చేస్తున్నారని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ ఆరోపించారు. శుక్రవారం మంథని పట్టణంలోని మాతా శిశు ఆస్పత్రిని ఆయన సందర్శించి ఆయా వార్డులను పరిశీలించారు. ఆస్పత్రిలో ఎంత మంది డాక్టర్లు ఉన్నారని, సిబ్బంది ఎంతమంది అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రెండు మాసాలుగా గైనకాలజిస్ట్ వైద్యుల నియామకం జరగలేదని సిబ్బంది ఆయన దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ నిత్యం ముఖ్యమంత్రితో కలిసి తిరుగుతున్న మంథని ఎమ్మెల్యే తన సొంత నియోజకవర్గంలోని మాతా శిశు ఆస్పత్రిలో ఒక వైద్యుడిని నియమించకపోవడం దురదృష్టకరమన్నారు. ప్రజల ఓట్లతో గెలిచిన నాయకుడికి ఒక పెద్ద పదవి వస్తే ప్రజలు ఎంతో ఆనందిస్తారని, తమకు ఎంతోమేలు జరుగుతుందని ఆశిస్తారని, కానీ ఇక్కడ మాత్రం అందుకు బిన్నంగా జరుగుతోందన్నారు. మంథని ప్రజల ఓట్లతో గెలిచి మంత్రిగా అయిన మంథని ఎమ్మెల్యే మంథని ప్రజల కష్టాలను పట్టించుకోవడం లేదని, రెండు నెలలుగా మాతా శిశు ఆస్పత్రిలో ఒక గైనకాలజిస్ట్ డాక్టర్‌ను నియమించడంలో విఫలం అయ్యారని ఆయన ఎద్దేవా చేశారు. మంత్రి హోదాలో ఉండి ఈ ప్రాంత ప్రజలను పురోగతిలోకి తీసుకెళ్ళాల్సి ఉండగా అందుకు బిన్నంగా తిరోగమనంలోకి తీసుకెళ్తున్నారని ఆయన అన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో మంథనిలో మాతా శిశు ఆస్పత్రిని మంజూరీ చేయించి నిర్మించామని, అటుతర్వాత వైద్యులను నియమించి ఈ ప్రాంత ఆడబిడ్డలకు కాన్పులు చేయించామని అన్నారు.

## పోలీసులు తప్పకుండా హెల్మెట్ ధరించాలి



**విశ్వంభర, తిరుమలగిరి:** పోలీస్ సిబ్బంది అందరు విధిగా హెల్మెట్ ధరించాలని లైసెన్సు లేకుండా ప్రయాణం చేయరాదని అపసవ్య దిశలో ప్రయాణం చేయరాదని రాహుల్ హెగ్డే బి.కె.ఐ.పి.ఎస్ డీసీపీ ట్రాఫిక్ నార్త్ హైదరాబాద్, శంకర్ రాజు అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ నార్త్ జోన్ ట్రాఫిక్ పోలీసు స్టేషన్ తిరుమలగిరి కి వచ్చి సిబ్బందికి సూచనలు చేశారు. అనతరం పోలీసు స్టేషన్ నందు ఉన్నటువంటి అన్ని రికార్డ్స్ ను తనికి చేశారు. అందరితో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకుని వాటిని పరిష్కరిస్తామని చెప్పారు. అంతేకాక ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది విధులు నిరహించేతప్పుడు పాటించాల్సిన నియమాలు వివరించారు. వాహనారులకి ఎప్పుడు ఇబ్బంధిలేకుండ ట్రాఫిక్ సాఫీగా వెళ్ళేలా విధులు నిర్వహించాలని మరియు జంక్షన్ లో రొడ్డుదాటే పాదచారులకు రోడ్డు దాటడంలో సహాయం చేయాలని సూచించారు. ట్రాఫిక్ సిబ్బంది తప్పనిసరిగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని అప్పుడే మనం సమర్ధవంతంగా విధులు నిర్వహించగలుగుతమని సూచించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ ప్రయాణికులకు ఎల్లవేళలా ఇబ్బంది లేకుండా సాఫీగా ప్రయాణం జరిగేలా తమ సిబ్బంది ఎల్లవేళలా కృషి చేస్తున్నారని పౌరులు కూడా విధిగా ట్రాఫిక్ నియమాలు పాటించాలని విజ్ఞప్తి చేశారు. ప్రతిరోజూ ట్రాఫిక్ నియమాలు పాటించని వారిపై జరిమానాలు విధిస్తూ గౌరవ కోర్టు యందు హాజరు పరిచి శిక్ష పడేలా చేస్తున్నామని అదేవిధంగా వారం లో 5 రోజులు డ్రంక్ డ్రైవ్ నిర్వహిస్తూ మద్యం తాగి వాహనం నడిపే వారిపై చార్జిషీట్ ఫైల్ చేసి వారికి శిక్ష పడేలచేస్తూ వారి లైసెన్సు కూడా రద్దు చేయిస్తున్నమని తెలిపారు. నార్త్ జోన్ ఎ సీ పీ శ్రీ శంకర్ రాజు కూడా వివిధ అవగాహన కార్యక్రమాల ద్వారా పౌరులను ట్రాఫిక్ ఉల్లంగలపై చైతన్య పరుస్తున్నారని కొనియాడారు. తిరుమలగిరి ట్రాఫిక్ సిబ్బంది ప్రమాదాల నివారణకు కృషిచేసినందుకు గాను అభినదించినారు.

## కేజీబీవీ నాన్ టీచింగ్ అండ్ వర్కర్స్‌కు జీతాలు పెంచాలి

**- టీ.యు.సీ.ఐ**



**విశ్వంభర, హైదరాబాద్ :** తెలంగాణా రాష్ట్రంలో వున్న 485 కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో పనిచేస్తున్న సుమారు 6 వేల మంది నాన్ టీచింగ్, వర్కర్స్ కు బేసిక్ పే చెల్లించాలనీ, వేతనాలు పెంచాలనీ అన్ని రెసిడెన్షియల్ విద్యా సంస్థలతో సమానంగా జీతభత్యాలు ఇవ్వాలనీ, ఉద్యోగ భద్రత కల్పించాలనీ, మెడికల్ ఇన్సూరెన్స్ ను కల్పించాలనీ, డ్యూటీలో వుండి చనిపోయిన కేజీబీవీ నాన్ టీచింగ్, వర్కర్స్ కుటుంబానికి రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలనీ, రిటైర్మెంట్ బెనిఫిట్ రూ. లక్షలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ హైదరబాద్ విద్యానగర్ లోని మార్క్స్ భవన్లో శుక్రవారం రాష్ట్ర సదస్సు జరిగింది. ఈ సదస్సు టీయుసీఐ అనుబంధ ప్రగతిశీల కేజీబీవీ నాన్ టీచింగ్, వర్కర్స్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో జరిగింది. సదస్సుకు తెలంగాణాలోని అన్ని జిల్లాల నుండి ప్రతినిధులు హాజరై తమ సమస్యలపై చర్చించారు. ఈ సదస్సులో రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శి ఎస్.ఎల్. పద్మ, పాల్గొని ప్రసంగించారు. రాష్ట్ర ప్రభుత్వం కేజీబీవీ సిబ్బంది పట్ల తీవ్ర నిర్లక్ష్యంను అనుసరిస్తుందనీ, 12 గం॥లు పనిచేయిస్తూ కనీస వేతనాలు అమలు చేయకుండా వెట్టిచాకిరి చేయిస్తున్నారని విమర్శించారు. బేసిక్ పే నిర్ణయించి, వాటిపై జీతాలు పెంచాలి. పి.ఎ.బి. లో నాన్ టీచింగ్, వర్కర్స్ తగినంత జీతాలు పెంపు ప్రతిపాదన చేయాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధీనంలో నడుస్తున్న ఈ పాఠశాలల్లో పని చేస్తున్న సిబ్బందికి ఎలాంటి ప్రయోజనాలు నెరవేర్చటం లేదని, లింగ వివక్షను కొనసాగిస్తున్నాయన్నారు. తీవ్ర పనిభారంతో, అనారోగ్యంతో, ఉద్యోగ భద్రత లేకుండా, వీక్లీ ఆఫ్ అమలు కాకుండా నిత్యం సమస్యలతో కేజీబీవీ సిబ్బంది జీవితాలను వెళ్ళతీస్తున్నారని ఈ సందర్భంగా వాపోయారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి కేజీబీవీ నాన్ టీచింగ్, వర్కర్స్ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి రేణుక, మౌనిక, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు అరుణ, మధుర, భద్రమ, త వినోద, రాజేశ్వరి, సైదమ్మ, లక్ష్మి, రాష్ట్ర నాయకులు అశోక్, సుధాకర్, హేమలత, అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్టీ కార్పొరేషన్ పెండింగ్ నిధులను విడుదల చేయాలి

**విశ్వంభర, హన్మకొండ:** గత 2017 నుండి 2021 వరకు పెండింగ్ లో ఉన్న ఎస్టీ కార్పొరేషన్ నిధులను విడుదల చేయాలని లంబాడి హక్కుల పోరాట సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అజ్మీరా వెంకట్ నాయక్ ఐటీడీఏ పీఓ క్యాంపు కార్యాలయంలో మెమోరండం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా అజ్మీర వెంకట్ మాట్లాడుతూ.. ఈ ఎస్ ఎస్ స్కీమ్ ఎస్టీ కార్పొరేషన్ ద్వారా మంజూరైన యూనిట్ సబ్సిడీని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు లావుడియా శ్రీను నాయక్, భాస్కర్ నాయక్, సంతోష్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.



# గ్రామాల సమగ్ర అభివృద్ధే మా లక్ష్యం

*** ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**



**విశ్వంభర, సంగారెడ్డి:** పటాన్ చేరు నియోజకవర్గ పరిధిలోని ప్రతి పల్లె సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామని స్థానిక ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని అందూరు, రాళ్లకత్వ, సొలక్పల్లి, ఊట్ల, వావిలాల, జంగంపేట, జిన్నారం, కొర్లకుంట, కొడకంచి, అలీ నగర్ తదితర గ్రామాలలో మూడు కోట్ల 90 లక్షల రూపాయల నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్లు, అంతర్గత మురుగునీటి కాలువల నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల సమగ్ర అభివృద్ధే మా లక్ష్యం అని తెలిపారు. ఈ కార్యక్రమాలలో మాజీ జడ్పి వైస్ ఛైర్మన్ ప్రభాకర్, మాజీ ఎంపీపీ రవీందర్ గౌడ్, సీనియర్ నాయకులు వడ్డే కృష్ణ, శ్రీకాంత్ రెడ్డి, ఆయా గ్రామాల తాజా మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి సహకరించాలని ఎమ్మెల్యేకు వినతి**

**అమీన్పూర్:** సంగారెడ్డి జిల్లా అమీన్పూర్ మున్సిపల్ పరిధిలోని బీరంగూడ ప్రాంతంలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి సహకరించాలని కోరుతూ శుక్రవారం సాయంత్రం బీరంగూడ ప్రాంతానికి చెందిన పుర ప్రముఖులు, ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యేగూడెం మహిపాల్ రెడ్డికి వినతిపత్రం అందించారు.

ఈ కార్యక్రమంలో అమీన్పూర్ మున్సిపల్ ఛైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, మున్సిపల్ వైస్ ఛైర్మన్ నరసింహ గౌడ్, ఎడ్ల రమేష్, ఆదెల్లి రవీందర్, వివిధ పార్టీల నాయకులు, పుర ప్రముఖులు పాల్గొన్నారు.

## జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం



**విశ్వంభర, ఏటూరునాగారం:** ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం చిన్న బోయినపల్లి గ్రామ శివారు చింతలమోరి సమీపంలో కారు ట్రాక్టర్ నీ ఢీ కొట్టిన ఘటన చోటు చేసుకుంది. ఏటూరునాగారం మండల కేంద్రం నుండి నర్సంపేటకు వస్తున్న కారు చింతలమూరి సమీపంలో ట్రాక్టర్ ను ఢీ కొట్టడంతో ట్రాక్టర్ ఇంజన్, ట్రాలీ విడిపోయాయి. కారులో ప్రయాణిస్తున్న వారిలో ఇద్దరికీ తీవ్ర గాయాలు కావడంతో వారిని ములుగు ఏరియా ఆసుపత్రికి తరలించారు.

**చాకలి, రజక, మడేల్ కుల నామాలను మాత్రమే**

## ప్రభుత్వ గెజిట్‌లో చేర్చాలి : ఎం. రాజేశ్వరి



**విశ్వంభర, బషీర్ బాగ్:** తెలంగాణలో చాకలి, రజక, మడేల్ కుల నామాలను మాత్రమే ప్రభుత్వ గెజిట్ లో చేర్చాలని తెలంగాణ రాష్ట్ర రజక మహిళ సంఘం ఫౌండర్ ఛైర్మన్ అధ్యక్షురాలు మల్లేశ్వరపు రాజేశ్వరి అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో వన్నార్ పదంకు పర్యాయ పదంగా మండేల్ కుల నామాన్ని మాత్రమే చేర్చాలని, ధోబి పదంను ఎట్టి పరిస్థితుల్లో తెలంగాణ రాష్ట్రంలో కుల నామంగా చేర్చ కూడదని తెలంగాణ బీసీ కమిషన్ ముందు వాదనలు వినిపించామని ఆమె వెల్లడించారు.

## బి.టి రోడ్డుకు నిధులు విడుదల చేయాలి

**- ఐటీడీఏ పీఓ కు బీజేవైఎం మదన్ వినతి**



**విశ్వంభర, నెల్లికుదురు:** మండలంలోని కునాయి కుంట తండకు బీటీ రోడ్డు నిర్మాణానికి, 2017 నుంచి 2021 వరకు పెండింగ్ లో ఉన్న ఎస్టీ కార్పొరేషన్ నిధులు విడుదల చేయాలని కోరుతూ ఐటీడీఏ పీవో చిత్ర మిశ్రా కు బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎంపీటీసీ గుగులోతు మదన్ లాల్ వినతి పత్రం అందజేశారు. శుక్రవారం ఆయన పీవో క్యాంపు కార్యాలయంలో చిత్ర మిశ్రను కలిసి పుష్పగుచ్చం అందజేసి సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రత్తి రామ్ తండ బొజ్యా, నరేష్ ల నిలిచిపోయిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మాణం పూర్తి చేయాలని, ఈ ఎస్ ఎస్ స్కీం సబ్సిడీని విడుదల చేయాలని కోరినట్లు తెలిపారు.

## డోకూరు ప్రభాకర్ రెడ్డి చేయూత



**విశ్వంభర, తలకొండపల్లి:** తలకొండపల్లి మండలం వెంకటాపూర్, చెన్నంపల్లి ప్రీమియర్ క్రికెట్ లీగ్ రన్నర్ ప్రైజ్ మనీ పదివేల రూపాయలను మండల కాంగ్రెస్ అధ్యక్షులు డోకూరి ప్రభాకర్ రెడ్డి సహకారంతో గ్రామ మాజీ సర్పంచ్ రమేష్ యాదవ్ అందజేశారు. చుక్కాపూర్ గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ఎన్నడ్ల జంగారెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించిన కాంగ్రెస్ నాయకులు వారి కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటామని మనోధైర్యాన్నిస్తూ తమ వంతుగా ఆర్థిక సహాయం అందించడం జరిగింది. తలకొండపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డోకూరి ప్రభాకర్ రెడ్డి ద్వారా 3 వేల రూపాయలు, స్థానిక సర్పంచ్ దాసరి కిష్టమ్మ ద్వారా ఒక వెయ్యి రూపాయలు కలిపి మొత్తం నాలుగు వేల రూపాయలను మృతుడి కుమారుడికి అందజేశారు. కార్యక్రమాలలో మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్ యాదవ్, పయ్యావుల రమేష్ యాదవ్ ఏరువ రాజాలింగం, ఉపాధ్యక్షులు దుక్కపురం రఘు, మాజీ ఉప సర్పంచ్ జక్కు శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

## నవోదయ ఎంపిక పరీక్ష ఏర్పాట్లు పూర్తి

**విశ్వంభర, భూపాలపల్లి:** జవహర్ నవోదయ విద్యాలయ ఎంపిక పరీక్ష 18 జనవరి 2025 ఉదయం 11.30 గంటలకు 80 మంది విద్యార్థుల అడ్మిషన్ కోసం నిర్వహించేందుకు సంబంధించి పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వరంగల్ జవహర్ నవోదయ కళాశాల ప్రిన్సిపాల్ బి పూర్ణిమ తెలిపారు. 202526 విద్యా సంవత్సరం పూర్వపు వరంగల్ నుండి 6వ తరగతిలో ప్రవేశానికి ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. పరీక్ష రోజున పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు బందోబస్త్ ఉంటుందని, విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ప్రశాంతంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేసునట్లు ఆమె తెలిపారు.ఫ్లయింగ్ స్క్వాడ్ పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేయడానికి జిల్లా అధికారులను నియమించడం జరిగిందని ఆమె తెలిపారు. న్యాయవిద్యను అభ్యసించే షెడ్యూల్డ్ కులాలకు చెందినవారికి ప్రభుత్వ సహాయం అందుతున్న విషయాన్ని పబ్లిసిటీ ద్వారా ప్రజలకు తెలియజేయాలన్నారు. జాతీయ ఎస్సీ కమిషన్ డైరెక్టర్ డాక్టర్ సునీల్ కుమార్ బాబు మాట్లాడుతూ షెడ్యూల్ కులాలకు చెందిన వ్యక్తులు భూ, ఎస్సీ ఎస్టీ కేసుల, తదితర ఫిర్యాదులను జాతీయ ఎస్సీ కమిషన్ స్వీకరిస్తుందన్నారు. న్యాయపరమైన విశేష అధికారాలు జాతీయ ఎస్సీ కమిషన్ కు ఉన్నాయన్నారు. దేశవ్యాప్తంగా సేవలందించే జాతీయ ఎస్సీ కమిషన్ లో తెలంగాణ నుంచి వడ్డేపల్లి రామచందర్ నియమితులు కావడం ఎంతో సంతోషకరమైన విషయమన్నారు.

## కళాకారుడు వినోద్ రెడ్డికి సన్మానం



**విశ్వంభర, నెల్లికుదురు:** మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం శ్రీరామగిరి గ్రామానికి చెందిన ప్రాచీన జానపద వచన కవి బొమ్మిడి వినోద్ రెడ్డిని ఎమ్మెల్యే డా.మురళి నాయక్ తో పాటు వికాస తరంగిణి వరంగల్,హనుమకొండ విభాగాల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.భారతీయ సాంస్కృతిక వైభవాన్ని భవిష్యత్ తరాలకు అందించడమే లక్ష్యంగా చిన్న జీయర్ స్వామి ఆదేశానుసారం జిల్లా కేంద్రం మానుకోట యశోద గార్డెన్లో శుక్రవారం జరిగిన కళాకారులను ప్రోత్సహించే కార్యక్రమంలో వినోద్ రెడ్డికి పూలమాలలు శాలువాలతో ఘనసత్కారం జరిగింది. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు జెన్నారెడ్డి భరత్ చందర్ రెడ్డి మానుకోట వికాస తరంగిణి సభ్యులు శ్రీలత,ఉమ, ఓం నారాయణ,ప్రాచీన జానపద కళాకారులు పాల్గొన్నారు.

# భారత్ పెట్టుబడులకు స్వర్గధామం: ప్రధాని మోడీ

**ఢిల్లీ:** దేశంలో ఎలక్ట్రిక్ మొబిలిటీ విస్తరణకు ప్రభుత్వం విధాన పరమైన నిర్ణయాలు తీసుకుంటోందని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. దిగ్గజ వ్యాపారవేత్తలు రతన్ టాటా, ఒసాము సుజుకీ భారతదేశ ఆటో రంగం వృద్ధికి.. మధ్యతరగతి ప్రజల కలను నెరవేర్చడానికి ఎంతో సహకారం అందించారని అన్నారు. భారత్ పెట్టుబడులకు స్వర్గధామమని.. మొబిలిటీ రంగంలో తమ భవిష్యత్తును రూపొందించుకోవాలని చూస్తున్న ప్రతీ పెట్టుబడిదారుడికి భారతదేశం అత్యుత్తమ గమ్యస్థానంగా నిలుస్తుందని అన్నారు.ప్రధాని నరేంద్ర మోడీ 'భారత్ మొబిలిటీ ఎక్స్ పో 2025'ను ప్రారంభించారు. గ్రీన్ టెక్నాలజీ, ఈవీలు, హైడ్రోజన్ ఇంధనం, జీవ ఇంధనాల అభివృద్ధిపై భారతదేశం దృష్టిసారిస్తోందన్నారు. మేక్ ఇన్ ఇండియా కార్యక్రమం దేశంలో ఆటో పరిశ్రమ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించిందన్నారు. ఈ దశాబ్దం చివరికి ఎలక్ట్రిక్ వాహనాల అమ్మకాలు ఎనిమిది రెట్లు పెరుగుతాయని అన్నారు.5 ఏళ్ల క్రితం ప్రారంభించిన ఫ్రేమ్-2 పథకం కింద రూ.8000 కోట్లకు పైగా సబ్సిడీగా ఇచ్చామని ప్రధాని పేర్కొన్నారు.దీంతో 16 లక్షలకు పైగా ఎలక్ట్రిక్ బస్సులు ఏర్పాటు చేశామన్నారు. ఢిల్లీలోనే 1200 కంటే ఎక్కువ ఎలక్ట్రిక్ బస్సులు నడుస్తున్నాయని తెలిపారు. ఒకప్పుడు భారతదేశంలో నాణ్యమైన రోడ్లు లేకపోవడంతో ప్రజలు కార్లు కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపకపోయేవారని ప్రధాని పేర్కొన్నారు. ప్రస్తుతం ఆ పరిస్థితి మారుతుండటంతో కార్లకు డిమాండ్ పెరుగుతోందన్నారు. ఏడాదికి దాదాపు 2.5 కోట్ల కార్లు విక్రయమవుతున్నాయని తెలిపారు.పెరుగుతున్న మధ్యతరగతి, వేగవంతమైన పట్టణీకరణ, సరసమైన వాహనాలు భారతదేశంలో ఆటో రంగాన్ని ముందుకు తీసుకువెళుతున్నాయని ప్రధాని పేర్కొన్నారు. దాదాపు 25 కోట్ల మంది ప్రజలు పేదరికం నుంచి బయటపడ్డారని, వీరు వాహనాలను కొనుగోలు చేయాలనుకుంటున్నారని ప్రధాని మోదీ చెప్పారు. ఈవీలను ప్రోత్సహించడానికి పలు ప్రాంతాల్లో ఛార్జింగ్ పాయింట్లను ఏర్పాటుచేశామన్నారు.దేశ రాజధానిలోని భారత మండపంలో నేడు ప్రారంభమైన 'భారత్ మొబిలిటీ ఎక్స్ పో.. 22వ తేదీ వరకు జరగనుంది. యశోభూమి, గ్రేటర్ నోయిడా



లోని ఇండియా ఎక్స్‌పో సెంటర్%ు%మార్ట్ వేదికల్లో ఎక్స్‌పో కొనసాగనున్నట్లు నిర్వాహకులు తెలియజేశారు.

## గర్భిణీలకు రూ.21వేలు.. ఢిల్లీ బీజేపీ మేనిఫెస్టో విడుదల



**ఢిల్లీ:** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి బీజేపీ మేనిఫెస్టోను ప్రకటించింది. 'సంకల్ప పత్రా' పార్ట్-1 పేరుతో భాజపా జాతీయాధ్యక్షుడు జేపీ నడ్డా పార్టీ మేనిఫెస్టోను ప్రకటించారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే.. గర్భిణీలకు రూ.21వేల ఆర్థిక సాయం, ఎల్పీజీ సిలిండర్లపై రూ.500 సబ్సిడీ ఇస్తామని పేర్కొన్నారు. 'మహిళా సమృద్ధి యోజన' కింద ఢిల్లీలోని మహిళలకు నెలకు రూ.2500 ఆర్థిక సాయాన్ని అందిస్తామన్నారు. వీటితోపాటు ప్రస్తుతం ఉన్న అన్ని సంక్షేమ పథకాలను కొనసాగిస్తామని హామీ ఇచ్చారు.

## మెట్రో రైళ్లలో విద్యార్థులకు 50 శాతం రాయితీ ఇవ్వండి.. ప్రధానికి కేజ్రీవాల్ లేఖ



**ఢిల్లీ:** అసెంబ్లీ ఎన్నికల తేదీ దగ్గరపడుతోన్న కొద్దీ దిల్లీలోని పార్టీలన్నీ తమ వ్యూహాలకు పదునుపెడుతున్నాయి. అలాగే ఓటర్లను ఆకట్టుకునేలా ముందుకు అడుగులు వేస్తున్నారు. ఈక్రమంలో ప్రధాని మోడీ కి ఆప్ అధినేత, దిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ లేఖ రాశారు. దేశ రాజధాని పరిధిలోని మెట్రో రైళ్లలో ప్రయాణించే పాఠశాల, కళాశాల విద్యార్థులకు 50 శాతం టికెట్ రాయితీని అమలుచేయాలని కోరారు. రాయితీ కారణంగా పడే భారాన్ని రాష్ట్రం, కేంద్ర ప్రభుత్వం 50:50 నిష్పత్తిలో భరించాలని ప్రతిపాదన చేశారు ."ఢిల్లీ విద్యార్థులకు సంబంధించి ముఖ్యమైన విషయాన్ని మీ దృష్టికి తీసుకువచ్చేందుకు ఈ లేఖ రాస్తున్నాను. విద్యాసంస్థలకు వెళ్లి వచ్చే క్రమంలో విద్యార్థులు మెట్రోపై ఆధారపడుతున్నారు. వారిపై ఆర్థికభారాన్ని దించేందుకు 50 శాతం రాయితీ అందించాలని ప్రతిపాదిస్తున్నాను" అని కేజ్రీవాల్ ఆ లేఖలో పేర్కొన్నారు. అలాగే తాము అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యార్థులకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామని చెప్పారు. ఇప్పటికే మహిళా ప్రయాణికులు బస్సుల్లో ఉచితంగా ప్రయాణిస్తోన్న విషయాన్ని గుర్తుచేశారు.

## ఢిల్లీ ఎయిమ్స్ రోగులకు ఇలాంటి దుస్థితా..?

**ఢిల్లీ:** కేంద్రం, ఢిల్లీ ప్రభుత్వంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ధ్వజమెత్తారు. ఢిల్లీ ఎయిమ్స్ రోగులు, వారి బంధువులు ఎదుర్కొంటున్న దుస్థితి గురించి ఓ వీడియోను షేర్ చేసి ఆగ్రహం వ్యక్తంచేశారు. చికిత్స కోసం రోగులు నెలలతరబడి వేచిచూడాల్సి వస్తున్నా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. రోగుల బంధువులు వణికే చలిలో ఫుట్‌పాత్, సబ్‌వేలపై నిద్రపోవాల్సిన దుస్థితి నెలకొందని వ్యాఖ్యానించారు. గురువారం రాత్రి ఆ కుటుంబాలను రాహుల్ పరామర్శించారు.

## బీజాపూర్‌లో కొనసాగుతున్న ఎదురు కాల్పులు.. నారాయణపూర్‌లో ఐఈడీ పేల్చిన నక్సల్స్



**నారాయణపూర్:** ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్ జిల్లాలో నక్సల్స్ ఐఈడీ పేల్చారు. ఈ ఘటనలో ఇద్దరు జవాన్లకు గాయాలయ్యాయి. ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని బీజాపూర్ జిల్లాలో గురువారం మావోయిస్టులు, భద్రతా బలగాలకు మధ్య భీకర ఎదురు కాల్పులు జరిగిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో 17 మంది మావోయిస్టులు మృతి చెందారు. మరోవైపు శుక్రవారం కూడా ఇక్కడ ఎదురు కాల్పులు కొనసాగుతున్నాయి. దక్షిణ బస్తర్ అడవుల్లో పెద్దఎత్తున మావోయిస్టులు ఉన్నారనే నిఘా వర్గాల సమాచారంతో బీజాపూర్, సుక్మా, దంతెవాడ జిల్లాల నుంచి డీఆర్‌జీ(డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్), కోబ్రా 204, 205, 206, 208, 210, సీఆర్పీఎఫ్ 229 బెటాలియన్లకు చెందిన సుమారు 1,500 మంది వరకు జవాన్లు గురువారం దండకారణ్యంలో కూంబింగ్ చేపట్టారు. ఈక్రమంలో ఇరువర్గాల మధ్య ఉదయం నుంచి సాయంత్రం వరకు భారీ ఎదురుకాల్పులు జరగ్గా 17 మంది మావోయిస్టులు మృతిచెందినట్లు తెలుస్తోంది. ఘటనా ప్రాంతం నుంచి ఒక ఎస్ఎల్ఆర్‌తోపాటు పెద్దఎత్తున ఆయుధ సామగ్రిని భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. ఈ విషయాన్ని పోలీసులు అధికారికంగా ధ్రువీకరించలేదు. ప్రస్తుతం ఆ ప్రాంతంలో ఎదురు కాల్పులు జరుగుతున్నట్లు బస్తర్ ఐజీ సుందర్‌రాజ్ వెల్లడించారు. పూర్తి వివరాలను ఆపరేషన్ తర్వాత వెల్లడిస్తామన్నారు.

## ఇజ్రాయెల్, హమాస్‌ల మధ్య కుదిరిన సయోధ్య!



**జెరూసలెం:** అమెరికా, ఖతార్ మధ్యవర్తిత్వంతో ఇజ్రాయెల్-హమాస్‌ల మధ్య సయోధ్య కుదిరింది. బందీలను విడుదల చేయడానికి ఇరువర్గాల మధ్య ఒప్పందం చివరిదశకు చేరుకుందని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి కార్యాలయం వెల్లడించింది. ఈమేరకు ఇజ్రాయెల్ మీడియాలో వార్తలు వచ్చాయి. కాల్పుల విరమణ ఒప్పందానికి అడ్డుగా మారిన చిక్కులను మధ్యవర్తులు తొలగించినట్లు పేర్కొంది. అలాగే కేబినెట్ సమావేశం అనంతరం ఈ ఒప్పందాన్ని ఆమోదించేందుకు ఇజ్రాయెల్ ప్రభుత్వం సమావేశమవుతుంది. కేబినెట్ ఈ ఒప్పందాన్ని ఆమోదిస్తే.. ఆదివారం నుంచి ఇది అమలుకావొచ్చని తెలుస్తోంది. బందీల విడుదలకు ప్రతిగా ఇజ్రాయెల్ పాలస్తీనా ఖైదీలను విడిచిపెట్టనుంది. తర్వాత పూర్తిస్థాయిలో యుద్ధాన్ని ముగించేందుకు నిబంధనలు ఖరారు కానున్నట్లు తెలుస్తోంది. ఇక ఈ ఒప్పందం విషయమై ఇప్పటికే బందీల కుటుంబాలకు సమాచారం ఇచ్చినట్లు ప్రధానమంత్రి కార్యాలయం వెల్లడించింది.2023 అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌పై హమాస్ మెరుపుదాడి చేసిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో 1200 మందికి పైగా ఇజ్రాయెల్ పౌరులు చనిపోగా, 250 మందిని హమాస్ మిలిటెంట్లు బందీలుగా చేసుకున్నారు. దీంతో హమాస్‌పై ఇజ్రాయెల్ భీకరంగా విరుచుకుపడింది. హమాస్ అగ్రనేత ఇస్మాయెల్ హనియా, అక్టోబర్ 7 నాటి ఘటనకు సూత్రధారి యహ్యా సిన్వాంతోపాటు కీలక నేతలను హత మార్చింది. గాజాపై ఇజ్రాయెల్ చేసిన దాడుల్లో 46,000 మందికిపైగానే పాలస్తీనీయులు మృతి చెందారు.

## ఇమ్రాన్‌ఖాన్‌కు మరో ఎదురుదెబ్బ.. అల్‌ఖాదిర్ కేసులో 14 ఏళ్ల జైలు



**ఢిల్లీ:** పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన ఖాన్‌కు వరుస ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. అల్ ఖాదిర్ కేసులో ఇమ్రాన్, ఆయన సతీమణి బుష్రా బీబీ దోషులుగా తేలారు.ఆయనకు14ఏళ్ల జైలుశిక్ష పడగా.. ఆమెకు ఏడేళ్ల జైలు శిక్షను విధిస్తూ న్యాయస్థానంతీర్పు ఇచ్చింది. అడియాలా జైలులో కట్టుదిట్టమైన భద్రత నడుమ న్యాయమూర్తి తుదితీర్పు చదివి వినిపించారు. ఇమ్రాన్, బుష్రాలకు 10 లక్షలు, 5 లక్షల పాకిస్థానీ రూపాయల జరిమానా విధించారు.ఇమ్రాన్ దంపతులతోపాటు మరో ఆరుగురిపైనా నేషనల్ అకౌంటబులిటీ బ్యూరో 2023లో ఈ కేసు నమోదు చేసింది. లండన్‌లో ఉంటున్న పాక్ స్థిరాస్తి వ్యాపారి మాలిక్ రియాజ్ హుసేన్ నుంచి వసూలు చేసిన 19 కోట్ల పౌండ్లను బ్రిటన్ పాక్‌కు పంపగా..ఆ సొమ్మును ఇమ్రాన్ దంపతులు గోల్‌మాల్ చేశారని ఆరోపణ. దీన్ని అల్ ఖాదిర్ ట్రస్టు కేసుగా వ్యవహరిస్తున్నారు. ఇమ్రాన్ ప్రధానిగా ఉన్నప్పుడు బ్రిటన్ నుంచి అందిన ఆ 19 కోట్ల పౌండ్లను జాతీయ ఖజానాలో జమ చేయకుండా, సుప్రీంకోర్టు గతంలో రియాజ్‌హుసేన్‌కు విధించిన జరిమానాలో కొంత మొత్తాన్ని ఆ నగదులో నుంచి కట్టడానికి అనుమతించారని అభియోగం.దీనికి బదులుగాఇమ్రాన్ దంపతుల ట్రస్టు నెలకొల్పదలచిన అల్‌ఖాదిర్ విశ్వవిద్యాలయానికి హుసేన్ 57 ఎకరాలను బహుమానంగా ఇచ్చినట్లు చెబుతున్నారు. ఆగస్టు 2023 నుంచి ఇమ్రాన్ ఖాన్ జైలు జీవితం గడుపుతున్నారు. ఆయనపై సుమారు 200కు పైగా కేసులు నమోదయ్యాయి. అవన్నీ రాజకీయ ప్రేరేపితమైనవేనని, తనను అధికారానికి దూరంగా ఉంచేందుకు చేస్తోన్న కుట్ర అని మాజీ ప్రధాని తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. ఇటీవల తనపై ఉన్న జైలు శిక్ష సస్పెండ్ కావడంతో బుష్రాబీబీ ప్రస్తుతం బయటే ఉన్నారు. అయితే తాజా తీర్పు సందర్భంగా ఆమె కోర్టుకు వచ్చినట్లు తెలుస్తోంది.

## ఆగి ఉన్న బస్సును ఢీకొట్టిన మినీ వ్యాన్.. 9 మంది మృతి



**ముంబై:** ఆగి ఉన్న బస్సును మినీ వ్యాన్ ఢీకొట్టింది. ఆ వాహనంలోని 9 మంది ఈ ప్రమాదంలో మరణించారు. ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పోస్ట్ మార్టం కోసం మృతదేహాలను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మహారాష్ట్రలోని పూణే జిల్లాలో ఈ సంఘటన జరిగింది. శుక్రవారం ఉదయం పది గంటల సమయంలో పూణే-నాసిక్ హైవేపై నారాయణగావ్ వైపు వెళ్తున్న మినీ వ్యాన్‌ను టెంపో ఢీకొట్టింది. దీంతో మినీ వ్యాన్ అదుపు తప్పింది. రోడ్డు పక్కన ఆగి ఉన్న ఖాళీ బస్సును అది బలంగా ఢీకొట్టింది.కాగా, ఈ ప్రమాదం గురించి తెలుసుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మినీ వ్యాన్‌లో ప్రయాణించిన 9 మంది ఈ ప్రమాదంలో మరణించినట్లు తెలిపారు. మృతులను గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. పోస్ట్‌మార్టం కోసం మృతదేహాలను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు వివరించారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ అధికారి వెల్లడించారు.

## ఇరువురి మధ్య నెలకొన్న వివాదాన్ని పరిష్కరించుకోవాలి

**లేనిపక్షంలో తాము జోక్యం చేసుకుని పరిష్కరిస్తాం**
**వైస్ ఛాన్సలర్ల నియామకం వివాదంపై..**
**తమిళనాడు ప్రభుత్వం, గవర్నర్‌కు సుప్రీంకోర్టు హెచ్చరిక**



**న్యూఢిల్లీ:** తమిళనాడు ప్రభుత్వం, గవర్నర్‌ను సుప్రీంకోర్టు హెచ్చరించింది. ఇరువురి మధ్య నెలకొన్న వివాదాన్ని పరిష్కరించుకోవాలని సూచించింది. లేనిపక్షంలో తాము జోక్యం చేసుకుని పరిష్కరిస్తామని పేర్కొంది. తమిళనాడులోని విశ్వవిద్యాలయాలకు వైస్ ఛాన్సలర్ల (వీసీ) నియామకంపై సీఎం స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే ప్రభుత్వం, గవర్నర్ ఆర్ఎన్ రవి మధ్య చాలా కాలంగా వివాదం కొనసాగుతున్నది. గవర్నర్ వీసీగా వ్యహరించే అధికారాన్ని ప్రభుత్వం రద్దు చేసింది. దీనితో పాటు పలు నియామకాల్లో గవర్నర్ అధికారాలను పరిమితం చేసింది. అయితే ఈ బిల్లులను ఆమోదించడానికి ఆర్ఎన్ రవి నిరాకరించారు.కాగా, మద్రాస్ విశ్వవిద్యాలయం, భారతియార్ విశ్వవిద్యాలయం, తమిళనాడు ఉపాధ్యాయ శిక్షణ విశ్వవిద్యాలయాలకు వైస్-ఛాన్సలర్లను నియమించడానికి గవర్నర్ రవి ఒక కమిటీని ఏర్పాటు చేశారు. అయితే ఈ చర్య చట్టవిరుద్ధమని రాష్ట్ర ప్రభుత్వం ఆరోపించింది. కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ పరిధిలోని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ నుంచి సభ్యులను తొలగించడంతోపాటు ఆ కమిటీని పునరుద్ధరించింది. ఈ నేపథ్యంలో ఈ వివాదం సుప్రీంకోర్టుకు చేరింది.మరోవైపు తమిళనాడు ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్బీ పార్దివాలా నేతృత్వంలోని ధర్మాసనం శుక్రవారం విచారణ జరిపింది. ఇరువురు కలిసి బిల్లుల పెండింగ్ వివాదాన్ని పరిష్కరించుకోవడం మంచిదని సూచించింది. లేనిపక్షంతో ఈ సమస్యను తాము పరిష్కరిస్తామని కోర్టు హెచ్చరించింది.

## క్రిప్టో కరెన్సీకి జాతీయస్థాయి ప్రాధాన్యం.. ట్రంప్ యోచన!

**వాషింగ్టన్:** అమెరికా తదుపరి అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ విజయం సాధించడంతో క్రిప్టోకరెన్సీ బిట్‌కాయిన్ జోరు మీదుంది. క్రిప్టోకరెన్సీకి అనుకూలంగా ట్రంప్ ప్రభుత్వ నిర్ణయాలు ఉండొచ్చన్న అంచనాలతో దీని విలువ రికార్డు స్థాయిలో పెరుగుతోంది. ఈ క్రమంలో అమెరికా జాతీయ ప్రాధాన్యత అంశంగా క్రిప్టో కరెన్సీని మార్చేదిశగా ట్రంప్ ఉత్తర్వులు ఇచ్చే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. జనవరి 20న అమెరికా అధ్యక్షుడిగా ఆయన బాధ్యతలు స్వీకరించిన తర్వాత క్రిప్టోపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని బ్లూమ్‌బర్గ్ కథనం పేర్కొంది. అలాగే క్రిప్టో రంగానికి సంబంధించిన విధివిధానాల నిమిత్తం క్రిప్టో కరెన్సీ అడ్వైజరీ కౌన్సిల్‌ను ఏర్పాటుచేయనున్నట్లు తెలుస్తోంది.అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేసి, రెండోసారి విజయం సాధించిన డొనాల్డ్ ట్రంప్‌నకు క్రిప్టో పరిశ్రమ నుంచి భారీ మద్దతు లభించింది. ఆయన పదవీ స్వీకార సమయంలో వేడుకలు, ఇతర ప్రారంభోత్సవ కార్యక్రమాల నిర్వహణ నిధికి ఆ సంస్థల నుంచి నిధులు అందాయి. అలాగే కొత్త ప్రభుత్వంతో సంబంధాలను చాటుకునేలా వాషింగ్టన్‌లో 'ఇనాగరల్ క్రిప్టో బాల్' పేరిట శుక్రవారం ఒక కార్యక్రమాన్ని నిర్వహించనున్నాయి.ప్రస్తుత అధ్యక్షుడు జో బైడెన్ పాలనలో క్రిప్టో రంగం తీవ్ర ఒడుదొడుకులను ఎదుర్కొంది. అయితే ట్రంప్ తీసుకువస్తారని భావిస్తోన్న ఉత్తర్వుల్లో.. అన్ని ప్రభుత్వ ఏజెన్సీలు డిజిటల్ ఆస్తులకు సంబంధించిన తమ విధానాలను సమీక్షించుకునేలా ఆదేశాలు ఉండొచ్చని ఆ కథనం పేర్కొంది. అలాగే ఆ సంస్థలపై కొనసాగుతోన్న వ్యాజ్యాలను నిలిపివేయడంపైనా చర్చ జరుగుతున్నట్లు సమాచారం. ఈ చర్యలు గనక అమలైతే ట్రంప్ హయాంలో క్రిప్టో రంగం దూసుకెళ్లనుందని అంచనాలు వ్యక్తమవుతున్నాయి. ఇదిలాఉంటే.. ట్రంప్ సన్నిహితుడు, ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ క్రిప్టో కరెన్సీకి మస్క్ మద్దతు ఇస్తుంటారన్న సంగతి తెలిసిందే.



## ఏఐ ఫోన్‌కాల్‌తో థాయ్‌లాండ్ ప్రధానికి సైబర్ మాయగాళ్ల వల

**బ్యాంకాక్:** కృత్రిమ మేధస్సు నానాటికీ అభివృద్ధి చెందుతోంది. ప్రస్తుతం అన్నిరంగాల్లో దీన్ని వినియోగిస్తున్నారు. అయితే.. ఈ సాంకేతికత ద్వారా కొందరు మోసాలకు తెర లేపుతున్నారు. సైబర్ నేరగాళ్లు ఏఐను ఉపయోగించుకొని ప్రజల నుంచి అందినకాడికి దోచేస్తున్నారు. కాగా సైబర్ మాయగాళ్లు ఏఐ ఫోన్ కాల్‌తో ఏకంగా దేశ ప్రధానినే మోసం చేయాలని యత్నించారు. సైబర్ నేరస్థులు ఏఐ సహాయంతో తనకు ఫోన్‌కాల్ చేసి.. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ఓ నేత గొంతుతో మాట్లాడి తనను నమ్మించడానికి ప్రయత్నించారని థాయ్‌లాండ్ ప్రధాన మంత్రి పేటోంగ్టార్న్ షినవత్రా పేర్కొన్నారు. అయితే ఈ మోసాన్ని తాను వెంటనే గుర్తించానని అన్నారు. అయినప్పటికీ ప్రధాని స్థానంలో ఉన్న తనకే ఇలా సైబర్ నేరగాళ్లు కాల్ చేస్తే.. ఇక సామాన్యుల పరిస్థితి ఏంటని ఆందోళన వ్యక్తంచేశారు. ఏఐతో ఈ స్థాయిలో నేరాలు పెరిగిపోవడం ఆశ్చర్యానికి గురిచేసిందని పేటోంగ్టార్న్ పేర్కొన్నారు. ఏ నేత పేరుతో తనకు ఫోన్ వచ్చిందనే విషయాన్ని ఆమె తెలియజేయలేదు. ప్రఖ్యాత నేత మాదిరిగా అత్యంత స్పష్టమైన గొంతుతో 'ఎలా ఉన్నారు.. మీతో కలిసి పని చేయాలనుకుంటున్నా' అని తొలుత వాయిస్ మెసేజ్ వచ్చిందని వెల్లడించారు.తిరిగి కాల్ చేయడానికి ప్రయత్నించగా కాల్ కట్ అయ్యిందని అన్నారు. అనంతరం 'అసోసియేషన్ ఆఫ్ సౌత్ ఈస్ట్ ఏషియన్ నేషన్స్'లోని దేశాలలో థాయ్‌లాండ్ మాత్రమే విరాళం ఇవ్వలేదని.. తమకు వెంటనే విరాళాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మరో వాయిస్ మెసేజ్ రావడంతో తాను ఒక్కసారిగా అవాక్కయ్యానని అన్నారు. అయితే ఫోన్‌కాల్ ఎక్కడినుంచి వచ్చిందనే విషయంపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారన్నారు. ఇటువంటి సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా ప్రజలు జాగ్రత్తపడాలని సూచించారు.



## దక్షిణ కొరియా విమాన ప్రమాద ఘటన.. ఇంజిన్‌లో పక్షి ఈకలు!

దక్షిణ కొరియా: దక్షిణ కొరియాలో ఇటీవల జెజు ఎయిర్ విమానం డిసెంబర్ 29న ల్యాండ్ అవుతూ రక్షణ గోడను ఢీకొట్టిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో 179 మంది మృతి చెందారు. అయితే ఈ ప్రమాదానికి గల కారణాలపై పలు ఊహాగానాలు వ్యక్తమయ్యాయి. ఈ ఘటన జరగడానికి నాలుగు నిమిషాల ముందు బ్లాక్ బాక్స్ పని చేయకపోవడం పలు అనుమానాలకు దారితీసింది. దీంతో అసలు కారణం ఏమిటనే విషయంపై దర్యాప్తు కొనసాగుతోంది. ఈక్రమంలోమరో కీలక విషయం వెలుగులోకి వచ్చింది. దర్యాప్తు సమయంలో ఆ విమానం రెండు ఇంజిన్లలో పక్షి ఈకలు, రక్తం ఉన్నట్లు అధికారిక వర్గాలు గుర్తించాయి. విమానం పక్షిని ఢీకొనడం వల్లే ప్రమాదం జరిగిఉంటుందా అనే ప్రశ్నలు పునరావృతమవుతున్నాయి. కాగా, ఈ వార్తలపై దక్షిణ కొరియా రవాణా మంత్రిత్వశాఖ నుంచి ఎటువంటి స్పందన లేదు.డిసెంబర్ 29న ముయాన్ ఎయిర్‌పోర్టు రన్‌వేపై ల్యాండింగ్ సమయంలో విమానంఅదుపుతప్పి రక్షణగోడను ఢీకొట్టింది. దీంతో భారీగా మంటలు చెలరేగి విమానం పేలిపోయింది. ఈ ప్రమాదంలో 179 మంది మృతి చెందినట్లు అక్కడి అధికారులు తెలిపారు. బ్యాంకాక్ నుంచి ముయాన్‌కు వస్తుండగా ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. విమానం రన్‌వేపై అత్యవసరంగా దిగే సమయంలో ల్యాండింగ్ గేర్ పని చేయకపోవడంతో అది బాడీ పైనే బెల్లీ ల్యాండింగ్ చేసిందని అధికారులు పేర్కొన్నారు. అప్పటికే ఒక ఇంజిన్‌ను పక్షి ఢీకొనడంతో దానిలో శక్తి కూడా గణనీయంగా తగ్గిందని.. అందువల్లే ల్యాండ్ అయ్యాక నియంత్రణ కోల్పోయి ముందుకు దూసుకెళ్లి కాంక్రీట్ గోడను ఢీకొట్టిందని తెలిపారు.దర్యాప్తులో అధికారులు యాంత్రిక, ప్రొసీజర్ సమస్యలను గుర్తించినట్లు ది టైమ్స్ పత్రిక పేర్కొంది. ముఖ్యంగా ఎయిర్ క్రాఫ్ట్ థ్రస్ట్ రివర్సర్స్, ఫ్లాప్స్, స్పీడ్‌బ్రేక్స్ వంటివి పూర్తిస్థాయిలో పని చేయలేదని చెబుతున్నారు. మరోవైపు ఏవియేషన్ నిపుణుడు జెఫ్రీ థాంప్సన్ మాట్లాడుతూ అగ్నిమాపక సిబ్బంది పూర్తిస్థాయిలో సన్నద్ధంగా లేకుండానే విమానం నేల పైకి దిగడానికి అనుమతించినట్లుందన్నారు.



# విశాఖ ఉక్కుకు రూ.11,440 కోట్లు.. ప్యాకేజీ ప్రకటించిన కేంద్రం

**ఢిల్లీ:** విశాఖ ఉక్కుకు కేంద్ర ప్రభుత్వం కొత్త ఊపిరులూదింది. తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఉన్న కర్మాగారాన్నిపునరుజ్జీవింపజేయడానికి ముందు కొచ్చింది. ఇందుకోసం రూ.11,440 కోట్ల ప్యాకేజీని ప్రకటించింది. ఈ మేరకు కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ శుక్రవారం అధికారిక ప్రకటన విడుదల చేశారు. ఈ ప్యాకేజీకి గురువారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యర్యంలోజరిగినఆర్థికవ్యవహారాల కేబినెట్ కమిటీ సమావేశం ఆమోదముద్ర వేసినట్లు కేంద్ర మంత్రి పేర్కొన్నారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారం చేపట్టిన రోజు నుంచి విశాఖ ఉక్కుపై ప్రత్యేక దృష్టి సారించారు.ఢిల్లీ వెళ్లిన ప్రతిసారి ప్రధాని మోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామిలతో సమావేశమై కర్మాగారం పునరుజ్జీవంపై చర్చలు జరుపుతూ ఉన్నారు.ఇటీవల ప్రధానిని మరోమారు కలిసి విశాఖ ఉక్కుకు అవసరమైన ఆర్థిక సాయం అందించాలని కోరారు. దీనిపై విభిన్న కోణాల్లో చర్చించిన అనంతరం కేంద్ర ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ ఈ ప్యాకేజీకి ఆమోదం తెలిపింది.

నష్టాల నుంచి గట్టెక్కించేందుకు..

ఏటా 7.3 మిలియన్ టన్నుల ఉక్కు ఉత్పత్తి సామర్థ్యమున్నవిశాఖ ఉక్కు కర్మాగారం 2023-24లో రూ.4,848.86 కోట్లు, 2022-23లో రూ.2,858.74 కోట్ల నష్టాన్ని మూటగట్టుకొంది. వర్కింగ్ క్యాపిటల్ కోసం చేసిన అప్పులు పెరగడం దీనికి ప్రధాన కారణం. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ఎన్డీయే కూటమి అధికారంలోకి రావడంతో స్టీల్ ప్లాంట్‌పై ప్రత్యేక దృష్టి సారించారు. కేంద్ర ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామి ప్లాంటును సందర్శించారు. ప్లాంటు నిలదొక్కుకోవడానికి రూ.18 వేల కోట్లు అవసరమని విశాఖ ఎంపీ శ్రీభరత్, తెదేపా రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, కార్మిక సంఘాల నేతలు ఆయనకు విన్నవించారు. ఆ తర్వాత కొన్ని రోజులకే కేంద్ర ఉక్కుశాఖ ఎమర్జెన్సీ అడ్వాన్స్ ఫండ్ కింద.. జీఎస్టీ చెల్లింపులకు రూ.500 కోట్లు, ముడిసరకుకు సంబంధించి బ్యాంకు అప్పుల చెల్లింపులకు రూ.1,150 కోట్ల చొప్పున రెండు విడతల్లో సాయం చేసింది.




### సమగ్ర ప్రణాళికతో ముందుకు..

వర్కింగ్ క్యాపిటల్ కోసం చేసిన అప్పుల భారం, తగినంత ముడిసరకు లేకపోవడం, కోర్టు ఎటాచ్‌మెంట్లు, ఇన్‌సాల్వెన్సీ ప్రొసీడింగ్స్‌తో విశాఖ ఉక్కు కర్మాగారం తీవ్ర ఇబ్బందుల్లో ఉంది. వీటిని తీర్చడంతోపాటు భవిష్యత్తులో తలెత్తే కష్టాల నుంచి తప్పించడానికి ఒక సమగ్ర ప్రణాళికను తయారు చేస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం ఇదివరకే పార్లమెంటు స్థాయీసంఘానికి చెప్పింది. దానిపై త్వరగా నిర్ణయం తీసుకోవాలని ఆ సంఘం పార్లమెంటుకు సమర్పించిన నివేదికలో సిఫార్సు చేసింది. దాని ప్రకారమే కేంద్ర ప్రభుత్వం ఈ ప్యాకేజీకి ఆమోదముద్ర వేసినట్లు తెలుస్తోంది.

### కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు హర్షం

విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు కేంద్ర ప్యాకేజీపై కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు హర్షం వ్యక్తం చేశారు. రివైవల్ ప్యాకేజీ కింద కేంద్రం రూ.11,440 కోట్లు కేటాయించిందని మంత్రి వెల్లడించారు. ప్యాకేజీ కేటాయించిన ప్రధాన మంత్రి నరేంద్రమోడీ, కేంద్రానికి ధన్యవాదాలు తెలిపారు. నష్టాలను అధిగమించేందుకు, ప్లాంట్ పూర్తి ఉత్పాదనతో లాభాల బాట పట్టేందుకు కేంద్ర ప్యాకేజీ దోహద పడుతుందన్నారు. రాష్ట్రాభివృద్ధి, ప్రజల ఆకాంక్షల పట్ల కేంద్ర ప్రభుత్వ చిత్తశుద్ధికి ఇదే నిదర్శనమన్నారు.

## నిషేధిత జాబితా నుంచి తొలగించిన భూములపై అధ్యయనానికి మంత్రుల కమిటీ



**విశ్వంభర, అమరావతి:** నిషేధిత జాబితా నుంచి అక్రమంగా తొలగించిన భూములపై నిర్ణయం తీసుకునేందుకు మంత్రి వర్గ ఉపసంఘం ఏర్పాటుకు కేబినెట్ నిర్ణయించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన శుక్రవారం సచివాలయంలో కేబినెట్ సమావేశం జరిగింది. వైసీపీ హయాంలో దాదాపు 7 లక్షల ఎకరాల భూములు నిషేధిత జాబితా నుంచి తొలగించారు. దీనిపై అధ్యయనం చేసి ఆయా భూములను ఏం చేయాలన్న దానిపై మంత్రుల కమిటీ ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనుంది. వచ్చే కేబినెట్ భేటీలోపు భూముల అవకతవకలపై నివేదిక ఇవ్వాలని ఆయా జిల్లాల ఇన్‌ఛార్జి మంత్రులను సీఎం ఆదేశించారు. రాష్ట్రంలోని సత్యసాయి, అన్నమయ్య, తిరుపతి జిల్లాల్లో నిషేధిత జాబితా నుంచి భారీగా భూములు తొలగించినట్లు ప్రభుత్వం దృష్టికి వచ్చింది.

### కేబినెట్ సమావేశంలో ఆమోదించిన అంశాలివే..

ధాన్యం కొనుగోలుకు రూ.700 కోట్లు రుణం తీసుకోవడంపై ఆమోదం
ఏపీ మార్క్‌ఫెడ్‌కు ప్రభుత్వ హామీ ప్రతిపాదనకు ఆమోదం
గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల క్రమబద్ధీకరణకు ఆమోదం
గ్రామ, వార్డు సచివాలయాల్లో ఆర్‌టీజీఎస్ ఏర్పాటుకు ఆమోదం
తోటపల్లి బ్యారేజీపై మినీ హైడల్ ప్రాజెక్టుల నిర్మాణాలకు ఆమోదం
కడప జిల్లా సీకేదిన్నెలో 2,595 ఎకరాల బదిలీకి స్టాంప్ డ్యూటీ మినహాయింపుకు ఆమోదం
అభ్యంతరం లేని ఆక్రమిత స్థలాల క్రమబద్ధీకరణ ప్రతిపాదనలకు ఆమోదం
ఫెర్రో అల్లాయ్స్ పరిశ్రమలకు విద్యుత్ టారిఫ్ తగ్గింపు ప్రతిపాదనపై కేబినెట్ ఆమోదం.
విద్యుత్ సుంకంలో టారిఫ్‌ల తగ్గింపును మార్చి వరకు పొడిగిస్తూ ఆమోదం
62 నియోజకవర్గాల్లో 63 అన్న క్యాంటీన్ల ప్రారంభానికి ఆమోదం
పేదలకు ఇళ్ల స్థలాలపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలి: సీఎం

వచ్చే ఆర్థిక సంవత్సరం (2025-26) ప్రారంభంలోనే పలు పథకాలకు శ్రీకారం చుట్టనున్నట్లు సీఎం చంద్రబాబు తెలిపారు. కేబినెట్ భేటీ అనంతరం పలు రాజకీయ అంశాలపై చంద్రబాబు చర్చించారు. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, మత్స్యకార భరోసా పథకాల అమలుకు సిద్ధం కావాలని అధికారులను ఆదేశించారు. పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు ప్రతిపాదనలు రూపొందించాలన్నారు. పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్లు చొప్పున ఇచ్చేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. పోలవరం ప్రాజెక్టు డయాఫ్రం వాల్ నిర్మాణం, రాజధాని అమరావతిలో నిర్మాణ పనులు వెంటనే ప్రారంభమవుతాయని సీఎం వెల్లడించారు.

## సూపర్ సిక్స్‌లు అమలు చేయమంటే వింత మాటలు మాట్లాడుతున్నారు..

చంద్రబాబుపై వైఎస్ షర్మిల మండిపాటు



**విశ్వంభర, అమరావతి :** ఏపీ సీఎం చంద్రబాబుపై ఆ రాష్ట్ర పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల మండిపడ్డారు. 'ఏరు దాటే దాకా ఓడ మల్లన్న.. దాటాక బోడి మల్లన్న' అనే సామెతను తలపిస్తోందని ట్విటర్‌లో ఆరోపించారు.ఎన్నికల్లో సూపర్ సిక్స్ అంటూ ఆర్భాటం చేసిన బాబు .. అమలుకొచ్చేసరికి ఆదాయం పెరిగితేనే అంటూ మడతపేచి పెట్టారని దుయ్యబట్టారు.అప్పులు దొరకవని, ఆదాయం పెంచుకోవాలని, తలసరి ఆదాయం పెరగాలని, మనుషులు మన ఆస్తి అంటూ వింత వింత మాటలు చెప్తున్నారు. ఆడలేక మద్దెల దరువన్నట్లుందని బాబు వ్యవహారముందని ఆరోపించారు. ఎన్నికల్లో సూపర్ సిక్స్ హామీలు ఇచ్చే ముందు తెలియదా రాష్ట్రం రూ.10 లక్షల కోట్ల అప్పుల్లో ఉందని..? సూపర్ సిక్స్ హామీలు అమలుకు ఏటా రూ.2 లక్షల కోట్లు అవసరం ఉందని..? తెలియదా అంటూ ప్రశ్నించారు.రాష్ట్ర బడ్జెట్ మొత్తం డైవర్ట్ చేసినా ఇంకా నిధుల కొరత ఉంటుందని తెలియదా..? అని అన్నారు. కేంద్రానికి మీరొక్కరే కాదని తెలిసినప్పుడు ఎందుకు మద్దతు ఇచ్చారు ?. రాష్ట్రాన్ని సహాయపడనప్పుడు మోడీతో చెట్టాపట్టాలు దేనికోసమని నిలదీశారు. ప్రజలు ఓట్లేసి అధికారం ఇస్తే, ఏదో ఉద్ధరిస్తారని నమ్మకం పెట్టుకుంటే, హామీలను తుంగలో తొక్కి, విజన్ల పేరుతో , వృద్ధి రేట్ల సాకుతో కాలయాపన తప్పా..పనితనం శూన్యమని విమర్శించారు.ఎప్పటికైనా రాష్ట్రానికి సంజీవని ప్రత్యేక హోదా. హోదాతోనే రాష్ట్ర అభివృద్ధి. నిధులు పారాలన్నా, పరిశ్రమలు స్థాపన జరగాలన్నా, ప్రజల ఆదాయం పెరగాలన్నా.. యువతకు ఉద్యోగాలు రావాలన్నా. ప్రత్యేక హోదా ఒక్కటే శరణ్యమని షర్మిల పేర్కొన్నారు.

## మోహన్‌బాబు ఫ్యామిలీలో ఇరువురిపై కేసులు నమోదు.. ఏ 1గా మంచు మనోజ్

విశ్వంభర, అమరావతి : సీనియర్ నటుడు, దర్శక, నిర్మాత మంచు మోహన్‌బాబు ఇంట కొనసాగుతున్న వివాదాలు ఆసక్తికరంగా మారుతున్నాయి. గత కొన్ని రోజులుగా కుటుంబ సభ్యులు ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకుంటుండడం తెలుగు రాష్ట్రాల్లో చర్చాంశనీయంగా మారింది.రెండు రోజుల క్రితం మంచు మనోజ్ , తన భార్యతో కలిసి మోహన్‌బాబు వర్సిటీకి రాగా అక్కడ ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. తనపై , భార్య మౌనికపై దాడులకు పాల్పడ్డారంటూ మంచు మనోజ్ చంద్రగిరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనుమతులు లేకుండా వర్సిటీలోకి చొచ్చుకు వచ్చేందుకు మనోజ్ ప్రయత్నించారని మోహన్‌బాబు పీఏ చంద్రశేఖర్ నాయుడు పోలీసు స్టేషన్‌లో మరో ఫిర్యాదు చేశాడు.దీంతో ఫిర్యాదులను పరిశీలించిన పోలీసులు ఇరువురిపై కేసు నమోదు చేశారు. పీఏ చంద్రశేఖర్ నాయుడు ఫిర్యాదుతో నమోదైన కేసులోఏ-1గా మనోజ్, ఏ-2గా మౌనిక, మరో ముగ్గురిపై కేసులు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. కాగా మనోజ్ ఫిర్యాదు కేసులో ఏ-1గా విజయ్ సింహా, ఏ-2 గా సురేంద్ర, మరో 7గురిపై కేసులు నమోదు చేశామని వివరించారు. ఇప్పటికే హైదరాబాద్‌లో జర్నలిస్టుపై దాడి కేసులో మోహన్‌బాబుపైనా కేసు నమోదు అయిన విషయం తెలిసిందే.

## ఫిబ్రవరి 19 నుంచి శ్రీశైలం మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు..







### ఏర్పాట్లపై ఈవో సమీక్ష

**విశ్వంభర, శ్రీశైలం:** జ్యోతిర్లింగ క్షేత్రమైన శ్రీశైలంలో ఫిబ్రవరి 19 నుంచి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి. దాదాపు 11 రోజుల పాటు ఉత్సవాలు దేవస్థానం వైభవోపేతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నది. ఈ క్రమంలో ఉత్సవాల నిర్వహణ, ఏర్పాట్లపై ఈవో శ్రీనివాసరావు దేవస్థానం అధికారులు, అర్చకులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ సంక్రాంతి బ్రహ్మోత్సవాలు విజయవంతయ్యేందుకు సహకరించిన సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. ఇదే తరహాలో జిల్లా యంత్రాంగం సహాయ సహకారాలతో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను సమర్థవంతంగా నిర్వహించేందుకు కృషి చేయాలని సూచించారు.ప్రతి ఉద్యోగి భక్తులకు పూర్తి స్థాయిలో సౌకర్యాలు కల్పించడంలో శ్రద్ధ వహించాలని సూచించారు.ఎక్కడా అసౌకర్యం కలుగకుండా ఉండేలా అన్ని చర్యలు చేపట్టాలని ఆయా విభాగాల అధికారులనుఆదేశించారు. ఇప్పటికే రూపొందించిన యాక్షన్ ప్లాన్‌ను మేరకు ఏర్పాట్లలో నిమగ్నం కావాలని చెప్పారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ఫిబ్రవరి 19న మొదలవుతాయని తెలిపారు. భక్తులు ముందస్తుగానే శ్రీశైల క్షేత్రానికి చేరుకునే అవకాశం ఉందన్నారు. ఈ క్రమంలోనే ఏర్పాట్లను వేగవంతం చేయాలని ఆదేశించారు.పనుల్లోనాణ్యత పాటించేలా చూడాలన్నారు. అన్ని విభాగాల అధికారులు సమష్టిగా విధులు నిర్వర్తించాలని చెప్పారు.

**కైంకర్యాల్లో సమయపాలన పాటించాలి..**

వైదిక సిబ్బంది, ఆలయ విభాగ అధికారులు పరస్పర సమన్వయంతో ఉత్సవాల్లో ఎలాంటి లోటుపాట్లు లేకుండా కైంకర్యాలన్నీ సంప్రదాయబద్ధంగా జరిపించాలని స్పష్టం చేశారు. ఈ విషయంలో ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని చెప్పారు. ఉత్సవాల్లో కైంకర్యాల సమయపాలనను ఖచ్చితంగా పాటించాలన్నారు. మహాశివరాత్రి పర్వదినమైన ఫిబ్రవరి 26న జరిగే ప్రభోత్సవం, పాగాలంకరణ, బ్రహ్మోత్సవ కల్యాణం, మరుసటి రోజున నిర్వహించే రథోత్సవం, తెప్పోత్సవం కార్యక్రమాలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలన్నారు. పాదయాత్రగా వచ్చే భక్తుల సౌకర్యార్థం పెద్దచెరువు, భీమునికొలను, కైలాసద్వారం, సాక్షిగణపతి తదితర చోట్ల చేయాల్సిన ఏర్పాట్లపై దృష్టి సారించాలన్నారు.

**భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలి..**

శివదీక్షా భక్తులకు ప్రత్యేక క్యూలైన్లు, జ్యోతిర్ముడి సమర్పణకు ఏర్పాట్లు ప్రణాళికాబద్ధంగా ఉండాలన్నారు. క్యూకాంప్లెక్స్, క్యూలైన్లలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యంగా దర్శనం కోసం బారులు తీరే భక్తులకు ఎప్పటికప్పుడు మంచినీరు,అల్పాహారం అందజేయాలని అన్నప్రసాదవితరణ విభాగాన్ని ఆదేశించారు. ఇందుకోసం స్వచ్ఛంద సేవకుల సేవలను వినియోగించుకోవాలని సూచించారు. క్యూలైన్లలో బారికేడ్లు ధృడంగా ఉండేలా చూడాలని ఇంజినీరింగ్ అధికారులనుఆదేశించారు. పారిశుధ్యంపై దృష్టిసారించాలన్నారు.పార్కింగ్ ప్రదేశాల వివరాలు స్పష్టంగా తెలిసేలా బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. ట్రాఫిక్‌కు ఇబ్బందులకు లేకుండా చూడాలన్నారు. ఈ విషయంలో పోలీస్‌శాఖ సహకారం తీసుకోవాలన్నారు. పాతాళగంగలో రక్షణఏర్పాట్లు, దస్తులు మార్చుకునేందుకు అవసరమైన గదుల ఏర్పాట్లు చేయాలన్నారు. సమావేశంలో డిప్యూటీ ఈవో ఆర్ రమణమ్మ, ప్రధాన అర్చకులు వీరస్వామి, ఉమానాగేశ్వరశాస్త్రి, పూర్ణానంద ఆరాధ్యులు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నరసింహారెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## లండన్‌లో జగన్.. సైన్స్‌లో పట్టా పొందిన కుమార్తెకు అభినందనలు



విశ్వంభర, అమరావతి : వైసీపీ అధినేత, ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి లండన్‌లో పర్యటిస్తున్నారు. రెండు వారాల పర్యటన సందర్భంగా రెండు రోజుల క్రితం విజయవాడ నుంచి బయలు దేరిన జగన్, సతీమణి భారతీతో కలిసి లండన్‌కు చేరుకున్నారు.కుమార్తె వర్షారెడ్డి ప్రపంచ ప్రతిష్టాత్మక కింగ్స్ కాలేజ్ నుంచి మాస్టర్ ఆఫ్ సైన్స్ పట్టా పుచ్చుకున్న సందర్భంగా లండన్‌కు వెళ్లారు. ఆమెను జగన్ ఎక్స్ ఖాతాలో అభినందిస్తూ పోస్ట్ చేశారు. డిస్టింక్షన్‌లో ఉత్తీర్ణత సాధించడం మాకు ఎంతో గర్వకారణమయ్యావని వర్షమ్మకు అభినందనలు అంటూ ట్వీట్ చేశారు. ఆ దేవుడి ఆశీస్సులు నీపై ఎల్లవేళలా ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని తెలిపారు.కాగా మాజీ మంత్రి రోజా సెల్వమణి కూడా జగన్‌కు కూతురు పట్టా సాధించినందుకు ట్విటర్‌లో అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సొంతం కావాలని మనసారా కోరుకుంటున్నానని పేర్కొన్నారు.వైఎస్ జగన్ అక్రమాస్తుల కేసుల్లో నిందితుడిగా ఉండడంతో విదేశాలకు వెళ్లేందుకు ఏసీబీ కోర్టు గతంలో అనుమతించలేదు. పలుమార్లు కోర్టులో పిటిషన్లు దాఖలు చేయడం దానికి కోర్టు నుంచి అనుమతి రావడంతో జగన్ లండన్‌కు బయలు దేరారు. ఈనెల చివరి వారంలో తిరిగి స్వదేశానికి చేరుకోనున్నారు.

## స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నాం: రామ్మోహన్ నాయుడు




ఢిల్లీ: విశాఖ ఉక్కు పరిరక్షణకు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నామని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌కు కేంద్రం రూ.11,440 కోట్ల ప్యాకేజీ ప్రకటించిన విషయాన్ని కేంద్ర ఉక్కుశాఖ మంత్రి కుమారస్వామి, మరో కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మతో కలిసి రామ్మోహన్ నాయుడు మీడియాతో మాట్లాడారు. ప్యాకేజీ ప్రకటించిన ప్రధాన మంత్రి నరేంద్రమోదీకి ఏపీ ప్రజల తరఫున ధన్యవాదాలు తెలిపారు. ఎన్నో ఏళ్లుగా నెలకొన్న స్టీల్ ప్లాంట్ సమస్యల పరిష్కారానికి అడుగులు పడ్డాయని పేర్కొన్నారు. విశాఖ ఉక్కు.. ఆంధ్రుల హక్కు నినాదాన్ని కేంద్రం కాపాడిందన్నారు.సీఎం చంద్రబాబు ప్రధాన మంత్రిని కలిసినప్పుడల్లా వైజాగ్ స్టీల్ ప్లాంట్ అంశమే ప్రధాన ఎజెండాగా చర్చించారని గుర్తు చేశారు. ప్యాకేజీ రావడానికి కృషి చేసిన కేంద్ర ఉక్కుశాఖ మంత్రి కుమారస్వామికి రాష్ట్ర ప్రజల తరఫున ధన్యవాదాలు తెలిపారు. కేంద్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టిన మొదటి నెలలోనే కుమారస్వామి విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను సందర్శించి, కార్మికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారని గుర్తు చేశారు.ఏపీ ప్రజలకు ఇచ్చిన హామీని ఎన్డీయే ప్రభుత్వం అమలు చేసిందని కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ అన్నారు. ప్లాంటు కార్మికులు, కుటుంబాలకు భద్రతే ధ్యేయంగా కేంద్రం చర్యలు ప్రారంభించిందన్నారు. ప్లాంట్‌ను మరింత సమర్థంగా నడిపించాలని కేంద్రం నిర్ణయించిందన్నారు. ఏపీ ప్రజలు ఉద్యమాలు చేసి స్టీల్ ప్లాంట్‌ను సాధించుకున్నారని ఈ సందర్భంగా గుర్తు చేశారు

## రెచ్చిపోయిన బీటెక్ రవి వర్గీయులు.. ఎమ్మెల్సీ అనుచరుడిపై దాడి



**విశ్వంభర, పులివెందుల:** పులివెందుల టీడీపీలో వర్గ విభేదాలు బయటపడ్డాయి. బీటెక్ రవి అనుచరులు మరోసారి రెచ్చిపోయారు. తెదేపా ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి అనుచరుడు, వేంపల్లికి చెందిన ప్రకాశ్ రేషన్ దుకాణం కోసం పులివెందులలోని పాఠశాలలో పరీక్ష రాయడానికి వచ్చారు. ఈ క్రమంలో ఎగ్జామ్ రాసేందుకు వెళ్తుండగా అతడిని బీటెక్ రవి అనుచరులు చితకబాదారు. ప్రకాశ్‌ను వదిలిపెట్టాలని ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి భార్య ఉమాదేవి ధర్నాకు దిగారు. పోలీసుల జోక్యంతో ప్రకాశ్‌ను వదిలేశారు. మరోవైపు గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లో ఇసుక టెండర్ల కోసం బీటెక్ రవి అనుచరులు హంగామా సృష్టించారు. ఆ ఘటన మరవకముందే శుక్రవారం పులివెందులలో మరోసారి రెచ్చిపోయారు.

## ఖాళీగా విశాఖ - చర్లపల్లి రైలు..





**విశ్వంభర, విశాఖ:** విశాఖ నుంచి చర్లపల్లి వెళ్లే సికింద్రాబాద్ జనసాధారణ్ రైలు (08533) ఖాళీగా బయలుదేరింది. విశాఖ నుంచి ఉదయం 10 గంటలకు ఈ రైలు బయలుదేరగా.. దాదాపు అన్ని బోగీలు ఖాళీగానే ఉన్నట్లు ఫొటోలు, వీడియోలు చూస్తే తెలుస్తోంది. ఓవైపు సంక్రాంతి పండగ సందర్భంగా రైళ్లలో సీట్లు దొరక్క ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న సమయంలో ఇలా జరగడం గమనార్హం.మిగతా రైళ్లు ప్రయాణికులతో కిక్కిరిసిపోతుండగా.. ఈ ట్రైన్ విశాఖ నుంచి ఖాళీగా బయలుదేరింది. రిజర్వేషన్ అవసరం లేకుండా సామాన్య ప్రయాణికుల కోసం రైల్వే శాఖ ఈ రైలును అందుబాటులోకి తీసుకువచ్చింది. దీనిపై వాల్తేరు రైల్వే అధికారులు స్పందిస్తూ.. ఈ ట్రైన్ గురించి ప్రచారం చేశామని.. అయితే, ప్రయాణికుల్లో పెద్దగా అవగాహన లేకపోవడంతోనే ఇలా జరిగి ఉంటుందని చెబుతున్నారు. మరోవైపు ఇదే సమయంలో విశాఖ నుంచి విజయవాడ వెళ్లే రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ ప్రయాణికులతో కిక్కిరిసి వెళ్లింది.

## టైరు పేలి కారు పైకి దూసుకెళ్లిన లారీ .. ముగ్గురు మృతి

విశ్వంభర, అమరావతి : ఏపీలోని కర్నూలు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కోడుమూరు మండలం ప్యాలకుర్తి వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందారు. జాతీయ రహదారిపై వెళ్తున్న లారీ టైరు ఒక్కసారిగా పేలిపోయింది.దీంతో లారీ అదుపుతప్పి పక్క నుంచి వెళ్తున్న కారుపైకి దూసుకెళ్లడంతో కారులో ఉన్న ముగ్గురు దుర్మరణం చెందారు. ప్రమాదంలో మరో ఇద్దరికీ తీవ్ర గాయాలు కాగా వారిని ఆస్పత్రికి తరలించారు. మృతులు కోడుమూరు వాసులు సోమశేఖర్, శ్రీనివాస్, బండ శ్రీనుగా గుర్తించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు..

# సజీవంగానే నా కల..
# జట్టులోకి మళ్లీ వస్తా

**కరుణ్ నాయర్**



ముంబయిః భారత జట్టులోకి పునరాగమనంపై ఎన్నో ఆశలతో ఉన్నట్లు సీనియర్ క్రికెట్ కరుణ్ నాయర్ వెల్లడించాడు. ఇటీవల విజయ్ హజారే ట్రోఫీలో వరుసగా సెంచరీల మోత మోగించిన కరుణ్ నాయర్‌ను ఎంపిక చేయాలని ఇప్పటికే పలువురు మాజీలు సూచించారు. ఛాంపియన్స్ ట్రోఫీ కోసం టీమ్‌ను ఇంకా ప్రకటించాల్సి ఉంది. వన్డే ఫార్మాట్‌లో జరిగిన విజయ్ హజారే ట్రోఫీలోనే కరుణ్ దూకుడుగా ఆడాడు. మరోవైపు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ పేలవ ఫామ్‌తో ఇబ్బంది పడుతున్నారు. ఇంగ్లండ్‌తో (IND vs ENG) వన్డే సిరీస్‌కు కూడా జట్టును ఇంకా వెలువరించలేదు. ఈ క్రమంలో తాను మళ్లీ జాతీయ జట్టులోకి వస్తానని కరుణ్ నాయర్ నమ్మకంగా చెప్పాడు. విజయ్ హజారే ట్రోఫీలో ఏడు మ్యాచుల్లో 750కిపైగా పరుగులు చేశాడు.

''దేశం కోసం ఆడాలనేదే నా కల. ఇప్పటికే నేను దానిని సాధించా. కానీ, ఆ కల ఇప్పటికీ సజీవంగానే ఉంది. అందుకే, నేను ఇంకా క్రికెట్ ఆడుతున్నాననిపిస్తోంది. ఒకవేళ నేను ఇప్పుడు ఎంపికైతే ఇది నా మూడో పునరాగమనం అనుకుంటా. ఆ అవకాశం కోసం నిరంతరం శ్రమిస్తూనే ఉన్నా. నేనెప్పుడు క్రీజ్‌లోకి వెళ్లినా ఇదే నా చివరి ఛాన్స్ అనుకొని ఆడతా. ఒక్కో మ్యాచ్‌లో మెరుగైన ప్రదర్శన చేసుకుంటూ ముందుకు సాగా. నాణ్యమైన క్రికెట్ ఆడటం వరకే నా చేతుల్లో ఉంటుంది. మిగతావన్నీ మన నియంత్రణలో లేనివి. ఇప్పటికీ నేను సెలక్ట్ అవుతాననే నమ్మకం ఉంది.

గతంతో పోలిస్తే నేనేమీ విభిన్నంగా ప్రయత్నించలేదు. ఇందులో ఎలాంటి రహస్యం లేదు. సంవత్సరాలుగా చేస్తోన్న తీవ్ర కృషికి ఇప్పుడు ఫలితం వచ్చినట్లు అనిపిస్తోంది. ప్రతిరోజు కొత్త సవాల్‌గా భావించా. ఇప్పుడు అవకాశం వస్తుందో లేదోనని భయపడటం లేదని చెబితే అది అబద్ధమే అవుతుంది. ప్రతి ఒక్కరికీ ఈ ఫీలింగ్ కలుగుతుంది. కానీ, రాకపోయినా నా కెరీర్ ఏమీ ముగిసిందని భావించను. ఏం జరిగిందనేది కాస్త ఆలోచిస్తా. ఆ తర్వాత మళ్లీ నేనేం చేయాలనే దానిపై దృష్టిసారిస్తా. సున్నా నుంచే మొదలు పెట్టాలని.. మరికొన్నేళ్లు కష్టపడాలని అనుకుంటా. ఇదే నా ఆలోచనా విధానం. వస్తే మాత్రం ఈసారి ఎట్టిపరిస్థితుల్లోనూ ఛాన్స్‌ను వదులుకోను'' అని కరుణ్ నాయర్ వెల్లడించాడు.

**18న ఛాంపియన్స్ ట్రోఫీ జట్టు ప్రకటన..**

ఛాంపియన్స్ ట్రోఫీలో ఆడే టీమ్ ఇండియా జట్టును శనివారం ప్రకటించనున్నారు. ముంబయిలో మధ్యాహ్నం 12.30కి చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహిస్తారు. అందులో టీమ్ వివరాలు వెల్లడిస్తారు. ఫిబ్రవరి 19 నుంచి పాకిస్థాన్ - దుబాయిలో ఛాంపియన్స్ ట్రోఫీ మ్యాచ్‌లు ఉంటాయి.

# అర్జున్ టెండూల్కర్‌తో కలిసి
# తొలిసారి ఆ మ్యాచ్ చూశా

**పృథ్వీషా**





**ముంబయిః** ముంబయిలోని వాంఖడే స్టేడియం వేదిక 50వ వసంతంలోకి అడుగుపెట్టింది. ఇప్పటికే వారోత్సవాలను ముంబయి క్రికెట్ అసోసియేషన్ ప్రారంభించింది. 2018లో అండర్-19 వరల్డ్ కప్‌ను భారత్ నెగ్గడంలో కీలకపాత్ర పోషించిన పృథ్వీషాకు వాంఖడే స్టేడియంతో మంచి అనుబంధమే ఉంది. ఈ వేడుకలకు హాజరైన అతడు తొలిసారి ఇక్కడ చూసిన మ్యాచ్‌ను గుర్తుచేసుకున్నాడు. క్రికెట్ దిగ్గజం సచిన్ తెందూల్కర్ కుమారుడు అర్జున్ తెందూల్కర్ తో కలిసి తొలిసారి మ్యాచ్‌ను చూసినట్లు వెల్లడించాడు. ఎంఎస్ ధోనీ నాయకత్వంలోని టీమ్‌ఇండియా ఫైనల్‌లో శ్రీలంకపై విజేతగా నిలిచిన సంగతి తెలిసిందే.

''నా జీవితంలో గుర్తుండిపోయే తొలి జ్ఞాపకం అదే. 2011 వరల్డ్ కప్ ఫైనల్‌ను చూసేందుకు వచ్చా. అప్పుడు నాకు 11 ఏళ్లు. నా స్నేహితుడు అర్జున్ తెందూల్కర్‌తో కలిసి వీక్షించా. భారత్ విజయం సాధించడం ప్రత్యక్షంగా చూడటం భలేగా అనిపించింది. మనం వరల్డ్ కప్‌ను సగర్వంగా ఎత్తుకొన్న క్షణం అద్భుతం. అలాంటి అనుభవం తొలిసారి రుచి చూశా. చిన్నారులుగా మేం ఎప్పుడూ వాంఖడే స్టేడియంలో ఆడాలని కలలు కన్నాం. ఇప్పుడు మనం 50 ఏళ్ల సంబరాలను చేసుకుంటున్నాం. ప్రతిఒక్కరూ వేడుకలకు రావాలని కోరుతున్నా. ముంబయి ప్రజలంతా 19వ తేదీన భారీ సంబరాలు చేసుకోవాలి'' అని పృథ్వీ షా వెల్లడించాడు.

**రంజీ మ్యాచ్‌కు పక్కనపెట్టడంపై పోస్టు**

జనవరి 23న జమ్మూకశ్మీర్ జట్టుతో రంజీ మ్యాచ్ కోసం ముంబయి సిద్ధమవుతోంది. యశస్వి జైస్వాల్, రోహిత్ (ఇంకా ఖరారు కాలేదు) తదితర భారత క్రికెటర్లు బరిలోకి దిగబోతున్నట్లు తెలుస్తోంది. ఈక్రమంలో పేలవ ఫామ్‌తో ఇబ్బందిపడుతోన్న పృథ్వీషాకు అవకాశం దక్కడం కష్టమేనని ముంబయి క్రికెట్ వర్గాలు పేర్కొన్నాయి. ఇప్పటికే విజయ్ హజారే ట్రోఫీలోనూ అవకాశం రాలేదు. దీంతో పృథ్వీషా తన సోషల్ మీడియా వేదికగా పెట్టిన పోస్టు వైరల్‌గా మారింది. ''మీరు నన్ను గేమ్ నుంచి మాత్రమే పక్కన పెట్టగలరు. కానీ, శ్రమించడాన్ని ఎప్పటికీ ఆపలేరు'' అని పెట్టాడు.

**వాంఖడే సిబ్బందికి ప్రత్యేకమైన గిఫ్ట్‌లు**

ప్రస్తుతం వాంఖడే స్టేడియంలో 178 మంది యాక్టివ్ గ్రౌండ్‌మన్ ఉన్నారు. వారందరికి 50 ఏళ్ల వేడుక సందర్భంగా ప్రత్యేకంగా గిఫ్ట్ హ్యాంపర్‌ను అందించాలని నిర్ణయించింది. అందులో''ఐదేసి కిలోల చొప్పున గోధుమ పిండి, బియ్యం, పప్పు ధాన్యాలు. ఒక మిక్సర్ గ్రైండర్, మెడికల్, హైడ్రేషన్ కిట్లు, మినీ కిట్ ప్యాక్, మోచేతి బాండ్లు, టీ బ్యాగులు, కెటెల్, టవళ్లు, నాప్‌కిన్లు, పెన్లు, నోట్‌పాడ్లు, బెడ్‌షీట్లు, దిండు, టీ షర్ట్, ట్రాక్ ప్యాంట్లు, షార్ట్‌లు, సాక్స్, షూలు, జాకెట్లు, సన్‌గ్లాసెస్‌లు, క్యాప్‌లు, టూత్ బ్రష్, టూత్ పేస్ట్, సబ్బులు, తలనూనె, దువ్వెన, బ్లాంకెట్, గొడుగు, రెయిన్ కోట్, సన్‌స్క్రీన్, మంచినీళ్ల బాటిళ్లతో కూడిన ప్యాకెట్‌ను అందించనుంది. 1974/75 సీజన్‌లో వాంఖడే వేదికగా తొలి మ్యాచ్ ఆడిన వారిని సన్మానించాలని నిర్ణయించింది. ఒక్కొక్కరికి రూ. 10 లక్షల చొప్పున నజరానా ఇవ్వనుంది.

# ఇప్పటికే భారత స్క్వాడ్ ఖరారు..
# కొత్త వారికి నో ఛాన్స్

**దినేశ్ కార్తీక్**



**ముంబయిః** ఫిబ్రవరి 19 నుంచి ఛాంపియన్స్ ట్రోఫీ ప్రారంభం కానుంది. భారత్ ఇంకా తన స్క్వాడ్‌ను ప్రకటించలేదు. జనవరి 19లోగా ఎప్పుడైనా ఈ ప్రకటన రావొచ్చు. ఈ రేసులో దేశవాళీలో అదరగొట్టిన కరుణ్ నాయర్ కూడా ఉన్నాడని వార్తలు వస్తున్నాయి. అయితే, భారత మాజీ క్రికెటర్ దినేశ్ కార్తీక్ మాత్రం జట్టు ఎంపిక ఇప్పటికే ఓ కొలిక్కి వచ్చి ఉంటుందని.. కొత్తవారికి అవకాశం కష్టమేనని వ్యాఖ్యానించాడు. మయాంక్ అగర్వాల్ కూడా మంచి ఫామ్‌లో ఉన్నాడని పేర్కొన్నాడు.

''కరుణ్ నాయర్ పేరు ఇప్పుడు బాగా వినిపిస్తోంది. అతడు అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. మయాంక్ అగర్వాల్ కూడా బాగానే ఆడాడు. అయితే ఛాంపియన్స్ ట్రోఫీ కోసం భారత వన్డే జట్టు ఇప్పటికే సిద్ధమైందని భావిస్తున్నా. పెద్దగా మార్పులు కూడా ఉండకపోవచ్చు. కరుణ్ నాయర్‌ను జట్టులోకి తీసుకోవాలనే డిమాండ్లూ వస్తున్నాయి. పునరాగమనం చేసేందుకు అతడికి హక్కు ఉంది. బ్యాటింగ్‌తో అదరగొట్టాడు. కానీ, ఇప్పుడు ఉన్న పరిస్థితుల్లో అవకాశం వస్తుందని మాత్రం అనుకోవడం లేదు. ఇలాగే కొనసాగితే ఎందుకు తీసుకోకూడదనే ప్రశ్నలూ ఉత్పన్నమవుతాయి. ఫాస్ట్, స్పిన్‌ను అద్భుతంగా ఆడే బ్యాటర్‌ను వదులుకోకూడదు. అతడు 'గన్ షాట్' ప్లేయర్. జట్టులోకి వస్తే మాత్రం చాలా ఆనందిస్తా'' అని వెల్లడించాడు. ఛాంపియన్స్ ట్రోఫీతో పాటు ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్‌కూ జట్టును ఎంపిక చేయాల్సిఉంది.

**బీసీసీఐ ఆగ్రహం.. సంజుకు కష్టమేనా?**

ప్రతిఒక్కరూ దేశవాళీ క్రికెట్ ఆడాలని.. అప్పుడే జాతీయ జట్టు కోసం పరిగణనలోకి తీసుకుంటామని బీసీసీఐ ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. మరోవైపు ఛాంపియన్స్ ట్రోఫీ కోసం జట్టును ప్రకటించాల్సిఉంది. వన్డే జట్టులోకి రావాలని గట్టిగా శ్రమించిన సంజు శాంసన్ (Sanju Samson) ఇప్పుడు బీసీసీఐ ఆగ్రహానికి గురైనట్లు తెలుస్తోంది. విజయ్ హజారే ట్రోఫీలో ఆడకుండా.. దుబాయ్ వెళ్లినట్లు సమాచారం. దీనిపైనే బీసీసీఐ గుర్రుగా ఉన్నట్లు క్రికెట్ వర్గాలు వెల్లడించాయి. సరైన కారణం చూపించకపోతే ఛాంపియన్స్ ట్రోఫీ కోసం సెలక్టర్లు ఎంపిక చేసే అవకాశాలు లేనట్లేనని పేర్కొన్నాయి.

# విశ్వనాథన్ ఆనంద్‌పై కార్ల్‌సన్ విమర్శలు

**తీవ్రంగా స్పందించిన ఫిడే చీఫ్**



**విశ్వంభర (క్రీడలు)ః** భారత్‌లో ఎంతో మందికి స్ఫూర్తిగా నిలిచే దిగ్గజ చెస్ ప్లేయర్ విశ్వనాథన్ ఆనంద్ పై ప్రస్తుత స్టార్ మాగ్నస్ కార్ల్‌సన్ గత వరల్డ్ ర్యాపిడ్, బ్లిట్జ్ ఛాంపియన్‌షిప్ సందర్భంగా తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేశాడు. తనను టోర్నీ నుంచి బయటకు పంపాలనే ఉద్దేశంలో ఆనంద్‌తో పాటు ఫిడే అధికారులు ఉన్నట్లు వ్యాఖ్యానించాడు. వాటిపై తాజాగా ఫిడే అధ్యక్షుడు ఆర్కడే డ్వోర్కోవిచ్ ఘాటుగా స్పందించాడు. ఆనంద్ వంటి సీనియర్‌లతో పాటు ఫిడే అధికారులపై ఏదైనా వ్యాఖ్యలు చేసేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించాడు. ఇక్కడెవరినీ వ్యక్తిగతంగా టార్గెట్ చేయకూడదని హితవు పలికాడు. ''ఫిడేలో ఎవరిపైనైనా మాటల దాడి చేయాలనుకుంటే.. ముందు నాపై చేయాలి. ఏదైనా విమర్శ చేస్తే నిర్మాణాత్మకంగా ఉండాలి. ఫిడేలో ఎవరితోనైనా వాదించొచ్చు. సరైన కారణాలతోనే అలా చేయాలి. ఇక్కడ ఎవరికీ వ్యక్తిగత అజెండా ఉండదు. అదే విధంగా పర్సనల్‌గా అటాక్ చేయకూడదు. ప్రపంచ చెస్‌లో విశ్వనాథన్ ఆనంద్ భాగస్వామ్యం అద్భుతం. అతడికి ధన్యవాదాలు చెప్పాలి. జీన్స్ ప్యాంట్ ఘటన తర్వాత కార్ల్‌సన్ వ్యాఖ్యలు మరీ దారుణంగా ఉన్నాయి. అందులో ఎలాంటి అనుమానం లేదు. మేం ప్రతి ఒక్కరినీ సమానంగా గౌరవిస్తాం. ఆ విషయం అతడికీ తెలుసు. కానీ, అతడు వెల్లడించిన అంశాలు మాత్రం సరిగ్గా లేవు'' అని ఆర్కడే వ్యాఖ్యానించాడు.

**రూల్స్ బ్రేక్ చేశాడు...**

''జీన్స్ ప్యాంట్ విషయంలో నిబంధనలను అతిక్రమించినట్లు మాగ్నస్‌కూ తెలుసు. అతడికి అవగాహన ఉంది. దానిని అంగీకరించాడు. రూల్స్‌పై మాగ్నస్‌తోపాటు అతడి తండ్రి హెన్రిక్‌తో మాట్లాడాం. డ్రెస్‌కోడ్‌ను అతిక్రమించినట్లు అంగీకరించారు. రూల్స్ ప్రకారమే చీఫ్ ఆర్బిటర్ వ్యవహరించారు. ఇందులో ఎక్కడా ఫిడే నుంచి తప్పిదం లేదు. నిబంధనల్లోనూ కొన్నిసార్లు మార్చుకోవడానికి అనుమతి ఉంటుంది. అంగీకరించి ఉంటే నిర్ణయాలు విభిన్నంగా ఉండేవి. ప్రతి ఒక్కరూ తప్పులు చేయడం సహజమే. ఫిడే కూడా అప్పుడప్పుడు పొరపాట్లు చేస్తుంది. మాగ్నస్ కార్ల్‌సన్ కూడా చేస్తాడు. కానీ, వాటిని ఇతరులపై నెట్టేయడం సరికాదు '' అని ఫిడే అధ్యక్షుడు వెల్లడించాడు.

# ఢిల్లీ స్క్వాడ్‌లో విరాట్‌కి చోటు.. మెడ నొప్పితో ఫైనల్ XIకి దూరం!

**ఢిల్లీః**

రంజీ ట్రోఫీ గ్రూప్ స్టేజ్‌లోని తొలి రెండు మ్యాచ్‌లకు ఢిల్లీ జట్టు తమ స్క్వాడ్‌ను ప్రకటించింది. ఇందులో వింతేముందంటారా? ఈసారి రంజీ మ్యాచ్‌లు మరింత ప్రత్యేకత సంతరించుకున్నాయి. స్టార్ క్రికెటర్లు బరిలోకి దిగబోతున్నారనే వార్తలు వస్తున్నాయి. ఈ క్రమంలో ఢిల్లీ జట్టులో విరాట్ కోహ్లీ, రిషభ్ పంత్‌కు స్థానం కల్పించింది. పంత్ ఇప్పటికే ఓకే చెప్పగా.. కోహ్లీ నుంచి ఎలాంటి స్పందన రాలేదని ఢిల్లీ క్రికెట్ వర్గాలు చెబుతున్నాయి. అయినాసరే అతడికి స్క్వాడ్‌లో చోటు కల్పించడం విశేషం. ఒకవేళ కోహ్లీ ఆడటానికి అంగీకరిస్తే మాత్రం.. దాదాపు 13 ఏళ్ల తర్వాత దేశవాళీ క్రికెట్‌లో అడుగు పెట్టినట్లు అవుతుంది. చివరిగా 2012లో రంజీ మ్యాచ్ ఆడాడు. మరోవైపు కోహ్లీ మెడ నరం పట్టేసిందని.. ఆ నొప్పితో బాధపడుతున్నట్లు కథనాలు వస్తున్నాయి. దాని కోసం ఇంజెక్షన్లను కూడా తీసుకుంటున్నట్లు సమాచారం. దీంతో ఫైనల్ XIలో ఆడటమూ కష్టమేనని క్రికెట్ వర్గాలు పేర్కొన్నాయి. అతడి గాయంపై అధికారికంగా మాత్రం ఎలాంటి ప్రకటనా వెలువడలేదు. ఇదే నిజమైతే ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్‌తోపాటు ఛాంపియన్స్ ట్రోఫీలో ఆడతాడా? లేదా? అనే విషయంలో ఉత్కంఠ నెలకొంది.

**కెప్టెన్‌గా అతడు..**

రంజీ గ్రూప్ స్టేజ్‌లో మొదట సౌరాష్ట్రతో జనవరి 23న ఢిల్లీ తలపడనుంది. ఈ మ్యాచ్‌కు రిషభ్ పంత్ సారథిగా ఉంటాడని తొలుత వార్తలు వచ్చాయి. అయితే, కెప్టెన్సీ వద్దని రిషభ్ స్వయంగా చెప్పినట్లు తెలుస్తోంది. దీంతో అతడికి చోటు ఇచ్చిన ఢిల్లీ.. సారథ్య బాధ్యతలను మాత్రం ఆయుష్ బదోనికి అప్పగించనుందని సమాచారం. ఇప్పుడు సౌరాష్ట్రతో పంత్ మ్యాచ్ ఆడితే.. దాదాపు ఏడేళ్ల తర్వాత రంజీ ఆడినట్లు అవుతుంది. చివరిగా 2018 సీజన్‌లో పంత్ దేశవాళీ టోర్నీ బరిలోకి దిగాడు.

**అందరూ ఆడాల్సిందే..**

బీసీసీఐ గైడ్‌లైన్స్ ప్రకారం.. ప్రతి ఒక్కరూ దేశవాళీ క్రికెట్‌లో ఆడాలి. శుభ్‌మన్ గిల్, యశస్వి జైస్వాల్ ఇప్పటికే తమ జట్ల తరఫున ఆడేందుకు సిద్ధమయ్యారు. మరోవైపు రోహిత్ శర్మ కూడా ఆడతాడని తెలుస్తోంది. ప్రస్తుతం ముంబయి ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్యతో కలిసి నెట్స్‌లో సాధన చేస్తోన్న వీడియోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. భారత మాజీ క్రికెటర్ యువరాజ్ సింగ్ కూడా స్టార్లను దేశవాళీలో ఆడాలని సూచించిన సంగతి తెలిసిందే. ఛాంపియన్స్ ట్రోఫీకి ముందు ఫామ్ అందుకోవచ్చని పేర్కొన్నాడు.



# విప్రో లాభం రూ.3,354 కోట్లు

**టెక్ మహీంద్రా లాభం 89% వృద్ధి**




**ఢిల్లీ:** ప్రముఖ ఐటీ సేవల సంస్థ విప్రో త్రైమాసిక ఫలితాలను ప్రకటించింది. డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికానికి రూ.3,354 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని నమోదు చేసింది. గతేడాది ఇదే త్రైమాసికంతో పోలిస్తే 24.4 శాతం వృద్ధి నమోదైంది. కంపెనీ ఆదాయం 0.5 శాతం పెరిగి రూ.22,319 కోట్లు నమోదైనట్లు కంపెనీ తన రెగ్యులేటరీ ఫైలింగ్‌లో తెలిపింది. మార్చితో ముగిసే త్రైమాసికానికి -1 లేదా +1 శాతం వృద్ధి నమోదు కావొచ్చని అంచనాలు వెలువరించింది. త్రైమాసిక ఫలితాల సందర్భంగా ఒక్కో షేరుకు రూ.6 చొప్పున డివిడెండ్ ప్రకటించింది. మరో ఐటీ సేవల సంస్థ టెక్ మహీంద్రా మూడో త్రైమాసికానికి రూ.989 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గతేడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.524 కోట్ల లాభంతో పోలిస్తే 89 శాతం మేర వృద్ధి నమోదైంది. కంపెనీ ఆదాయం సైతం 1.4 శాతం వృద్ధితో రూ.13,286 కోట్లుగా నమోదైనట్లు కంపెనీ తన రెగ్యులేటరీ ఫైలింగ్‌లో తెలిపింది. నిర్వహణ ఖర్చులు 5.1 శాతం మేర తగ్గగా.. ఆపరేటింగ్ ప్రాఫిట్ మార్జిన్ 13.6 శాతం మేర పెరిగినట్లు కంపెనీ తెలిపింది.

### సంచార్ సాథీ మొబైల్ యాప్ విడుదల..

# మోసపూరిత కాల్స్‌కు చెక్

ఢిల్లీ: మోసపూరిత కాల్స్/ సందేశాలకు చెక్ పెట్టేందుకు టెలికాం శాఖ కొత్తగా సంచార్ సాథీ మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. కేంద్ర టెలికాం శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా ఈ యాప్‌ను శుక్రవారం విడుదల చేశారు. అనుమానిత కాల్స్ వచ్చినప్పుడు మొబైల్ ఫోన్ లాగ్ నుంచే నేరుగా ఫిర్యాదు చేయడం, మొబైల్ ఫోన్ బ్లాక్ వంటి సదుపాయాలు ఇందులో ఉన్నాయి. తొలుత సంచార్ సాథీ పోర్టల్‌ను 2023లో కేంద్ర టెలికాం శాఖ అందుబాటులోకి తెచ్చింది. మొబైల్ యాప్‌ను లాంచ్ చేయడం ద్వారా మరింత సమర్థంగా మోసాలకు చెక్ పెట్టొచ్చని కేంద్రం భావిస్తోంది. ఆండ్రాయిడ్, ఐఓఎస్‌లో ఈ యాప్ వినియోగించొచ్చు.

**సంచార్ సాథీ ఫీచర్లు ఇవే..**

అనుమానిత కాల్స్/ ఎస్సెమ్మెస్‌లు వచ్చినప్పుడు కాల్ లాగ్ నుంచే నేరుగా ఫిర్యాదు చేయొచ్చు. మీ పేరు మీద ఎన్ని మొబైల్ కనెక్షన్లు ఉన్నాయో తెలుసుకోవచ్చు. మీ పేరు మీద అనధికారికంగా ఏవైనా నంబర్లు ఉంటే ఫిర్యాదు చేయొచ్చు.మొబైల్ పోయినప్పుడు, దొంగతనానికి గురైనప్పుడు బ్లాక్ చేసే సదుపాయం ఇందులో ఉంది.మొబైల్ ఫోన్ ప్రామాణికతను కూడా యాప్ సాయంతో గుర్తించొచ్చు. ఇందుకోసం ఐఎంఈఐ నంబర్‌ను ఎంటర్ చేయాల్సి ఉంటుంది. సెకండ్ హ్యాండ్ మొబైల్ కొనుగోలు చేసేటప్పుడు ఈ ఫీచర్ ఉపయోపడుతుంది.

# మూడు రోజుల వరుస లాభాలకు బ్రేక్..
# నష్టాల్లో ముగిసిన సూచీలు

**ముంబయిః**

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. వరుసగా మూడు రోజుల పాటు లాభాలు చవిచూసిన సూచీలు.. ఐటీ, బ్యాంకింగ్ షేర్ల రూపంలో అమ్మకాల ఒత్తిడి ఎదుర్కొన్నాయి. మరికొన్ని రోజుల్లో ట్రంప్ అధికార పగ్గాలు చేపట్టనుండడం, అంతర్జాతీయ మార్కెట్లో క్రూడాయిల్ ధరలు పెరుగుదల, విదేశీ మదుపర్ల అమ్మకాలు కొనసాగుతుండడం వంటివి సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. ఓ దశలో సెన్సెక్స్ 700 పాయింట్ల మేర నష్టపోగా.. తర్వాత కాస్త కోలుకుంది. నిఫ్టీ 23,200 స్థాయికి చేరింది. సెన్సెక్స్ ఉదయం 77,069.19 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 77,042.82) స్వల్ప లాభాల్లో ప్రారంభమైంది. కాసేపటికే నష్టాల్లోకి జారుకుంది. ఇంట్రాడేలో 76,263.29 వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 423.49 పాయింట్ల నష్టంతో 76,619.33 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 108.60 పాయింట్ల నష్టంతో 23,203.20 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 86.61 వద్ద ఫ్లాట్‌గా ముగిసింది.సెన్సెక్స్ 30 సూచీలో గురువారం ఫలితాలు ప్రకటించిన ఇన్ఫోసిస్ అత్యధికంగా 6 శాతం మేర నష్టపోయింది. బలహీన త్రైమాసిక ఫలితాలు ప్రకటించిన యాక్సిస్ బ్యాంక్ సైతం 5 శాతం మేర క్షీణించింది. దీని ప్రభావం ఇతర బ్యాంక్ షేర్లపైనా పడింది. కోటక్ మహీంద్రా బ్యాంక్, మహీంద్రా అండ్ మహీంద్రా, టీసీఎస్ సైతం నష్టాల్లో ముగిశాయి. జొమాటో, రిలయన్స్, నెస్లే ఇండియా, టాటా స్టీల్, ఏషియన్ పెయింట్స్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 81 డాలర్ల ఎగువన ట్రేడవుతుండగా.. బంగారం సైతం 2730 డాలర్ల వద్ద కొనసాగుతోంది.



# గుర్తింపు రాకపోవడం నన్నెంతో బాధించింది: సుందర్.సి

విశాల్ హీరోగా సుందర్.సి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'మద గజ రాజ' . తాజాగా ఈ సినిమా సక్సెస్ మీట్ చెన్నైలో జరిగింది. ఇందులో పాల్గొన్న సుందర్, విశాల్ పలు విశేషాలు పంచుకున్నారు. ఈ సినిమా విజయాన్ని విశాల్‌కే అంకితం చేస్తానని దర్శకుడు చెప్పారు. దీని కోసం విశాల్ ఎంతో శ్రమించాడని మెచ్చుకున్నారు.''విశాల్‌తో నాకు ఎంతో కాలం నుంచి పరిచయం ఉంది. అతడు నాకు ఒక సోదరుడితో సమానం. ఈ సినిమా కోసం ఎంతో శ్రమించాడు. షూట్ సమయంలో ఓసారి కారులో కళ్లు తిరిగి పడిపోయాడు. ఇటీవల జరిగిన ఆడియో విడుదల కార్యక్రమంలోనూ ఆయన అనారోగ్యంతో పాల్గొన్నారు. ఆ ఈవెంట్ తర్వాత ఆయన ఆరోగ్యం గురించి ఎన్నో వార్తలు వచ్చాయి. ఆయన ఎదుర్కొన్న సవాళ్లు నాకు మాత్రమే తెలుసు. ఈ విజయం తనకొక మెడిసిన్‌లా ఉపయోగపడింది. అందుకే ఈ సినిమా సక్సెస్ క్రెడిట్ మొత్తం అతడికే ఇస్తున్నా'' అని చెప్పారు. ''ప్రేక్షకులను అలరించాలనే ఉద్దేశంతో పలు చిత్రాలు తెరకెక్కించాను. నా సినిమాలు కమర్షియల్‌గా విజయాన్ని అందుకున్నాయి. ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అయినప్పటికీ నాకు రావాల్సిన గుర్తింపు మాత్రం రాలేదు. ఇండస్ట్రీకి సంబంధించి గొప్ప దర్శకుల జాబితాలో నా పేరు లేదు. అందుకు నాకెంతో బాధగా ఉంది. దేవుడి దయ వల్ల ఆ జాబితాలో నా పేరు కూడా చేరాలని కోరుకుంటున్నా'' అని తెలిపారు.విశాల్ మాట్లాడుతూ.. తమ చిత్రాన్ని ఆదరించిన ప్రేక్షకులకు ధన్యవాదాలు చెప్పారు. ఈ సినిమాలో సంతానం కామెడీ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుందని అన్నారు. ''ఇందులో సంతానం రెండో హీరో. ప్రస్తుతం ఆయన హీరోగా సినిమాలు చేస్తున్నారు. ఆయన కామెడీని ప్రేక్షకులు ఎంతగానో మిస్ అవుతున్నారు. ఇకపై ఆయన ఏడాది కనీసం రెండు లేదా మూడు చిత్రాల్లో కమెడియన్‌గా కనిపించాలని కోరుకుంటున్నా'' అని చెప్పారు. రానున్న రోజుల్లో వరుస సినిమాలు చేయనున్నట్లు తెలిపారు. 'తుప్పరివాలన్ 2' (డిటెక్టివ్2) కాకుండా గౌతమ్ మేనన్‌తో సినిమా చేస్తున్నానని తెలిపారు. దాదాపు 12 ఏళ్ల క్రితమే ఈసినిమా పూర్తైనప్పటికీ అనివార్య కారణాల వల్ల వాయిదా పడుతూ వచ్చింది. ఎట్టకేలకు జనవరి 12న విడుదలై విజయాన్ని అందుకుంది.

# లాస్ ఏంజెలెస్ నుంచి హైదరాబాద్‌కు ప్రియాంక చోప్రా

ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీప్రియులు ఎదురుచూస్తున్న ప్రాజెక్ట్ #SSMB29. మహేశ్‌బాబు హీరోగా దర్శకధీరుడు రాజమౌళి తెరకెక్కించనున్న ఈ సినిమా ఎప్పుడెప్పుడు సెట్స్ పైకి వెళ్తుందా అని ఆసక్తిగా ఉన్నారు. దీంతో ఈ సినిమాకు సంబంధించిన వార్తలు క్షణాల్లో వైరల్‌గా మారుతున్నాయి. ఇందులో బాలీవుడ్ హీరోయిన్ ప్రియాంక చోప్రా నటించనున్నట్లు ఎన్నో రోజులుగా వార్తలు వస్తోన్న విషయం తెలిసిందే. తాజాగా ఆమె హైదరాబాద్ చేరుకున్నారు. దీంతో మహేశ్- రాజమౌళి ప్రాజెక్ట్ కోసమే హైదరాబాద్‌కు వచ్చారంటూ కామెంట్స్ వినిపిస్తున్నాయి. ఆమె విమానాశ్రయంలో కనిపించిన వీడియోలు సోషల్ మీడియాలో షేర్ అవుతున్నాయి. ఈ సినిమా షూటింగ్‌పై త్వరలోనే అధికారిక అప్‌డేట్ వచ్చే అవకాశం ఉందని ఫ్యాన్స్ భావిస్తున్నారు. ఇటీవలే చిత్రబృందం హైదరాబాద్‌లో పూజా కార్యక్రమాల్ని నిర్వహించి సినిమాకి శ్రీకారం చుట్టింది. కథానేపథ్యం మినహా, ఈ సినిమాకి సంబంధించి ఇప్పటివరకూ అధికారికంగా ఎలాంటి సమాచారాన్ని బయట పెట్టలేదు. అమెజాన్ అడవుల నేపథ్యంలో సాగే ఈ కథలో పలువురు విదేశీ నటులు కనిపించనున్నారు. భారతీయ భాషలతో పాటు, విదేశీ భాషల్లోనూ దీనిని అనువదించనున్నారు. దుర్గా ఆర్ట్స్‌పై కె.ఎల్.నారాయణ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. వెండితెరపై సరికొత్త లుక్‌లో మహేశ్ కనిపించనున్నారు.

**హాలీవుడ్‌కు జేమ్స్‌బాండ్.. టాలీవుడ్‌కు మహేశ్ బాబు: తమన్**

ఇప్పటికే #SSMB29పై రచయిత విజయేంద్ర ప్రసాద్, టాలీవుడ్ నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ లాంటి ప్రముఖులు చేసిన కామెంట్స్ సినిమాపై అంచనాలు రెట్టింపు చేశాయి. తాజాగా మ్యూజిక్ డైరెక్టర్ తమన్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ఈ భారీ ప్రాజెక్ట్ ఆసక్తికర కామెంట్స్ చేశారు. 'హాలీవుడ్‌కు జేమ్స్‌బాండ్ ఎలానో.. టాలీవుడ్‌కు మహేశ్ అలాగా. ఈ సినిమా అలవోకగా రూ.1000 కోట్లు సాధిస్తుందని, దీని బాక్సాఫీస్ లెక్కలు ఎవరూ ఊహించలేరు' అని అన్నారు. దీంతో ఈ కామెంట్స్ మహేశ్ అభిమానుల్లో జోష్ నింపుతున్నాయి. భారతీయ చిత్ర పరిశ్రమలో ఇప్పటివరకూ చూడని సరికొత్త ప్రపంచాన్ని రాజమౌళి ఆవిష్కరించబోతున్నారని రచయిత విజయేంద్రప్రసాద్ గతంలో ఓ ఇంటర్వ్యూలో చెప్పిన విషయం తెలిసిందే.



# లేడీ గెటప్‌లో విశ్వక్‌సేన్.. ఆకట్టుకునేలా 'లైలా' టీజర్



ప్రేమికుల రోజున 'లైలా'గా సినీప్రియులకు గిలిగింతలు పెట్టనున్నారు నటుడు విశ్వక్ సేన్. ఆయన ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'లైలా'. రామ్ నారాయణ్ తెరకెక్కిస్తున్నారు. సాహు గారపాటి నిర్మిస్తున్నారు. ఆకాంక్ష శర్మ కథానాయిక. చిత్రీకరణ దశలో ఉన్న ఈ సినిమా ఫిబ్రవరి 14న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే చిత్రబృందం తాజాగా 'లైలా' టీజర్ విడుదల చేసింది. 'మనకు తెల్లగా చేసుడే కాదు. తోలు తీసుడు కూడా వచ్చు' అంటూ విశ్వక్ చెప్పిన డైలాగ్‌లు ఆకట్టుకునేలా ఉన్నాయి. టీజర్ చివర్లో అమ్మాయి వేషధారణలో విశ్వక్ సేన్ లుక్స్, నటన సినీ ప్రియులను విశేషంగా అలరించేలా ఉంది.

## మమ్మల్ని బావి నుంచి బయటపడేసింది 'సంక్రాంతికి వస్తున్నాం': నిర్మాత శిరీష్



'సంక్రాంతికి వస్తున్నాం'తో మంచి హిట్‌ను అందుకున్నారు స్టార్ హీరో వెంకటేశ్. తాజాగా చిత్రబృందం సక్సెస్ సెలబ్రేషన్స్ నిర్వహించింది. అందులో అనిల్ రావిపూడి, వెంకటేశ్ మాట్లాడుతూ.. ఈ సినిమాను ఆదరించిన ప్రేక్షకులకు ధన్యవాదాలు తెలిపారు. అందరి ఆదరణ వల్లే ఈ సినిమాకు ఇంత సక్సెస్ వచ్చిందన్నారు. ప్రతి దర్శకుడు కొత్త ఆలోచనలతో ప్రచారం చేస్తే, ఎంత అద్భుతం జరుగుతుందో ఇప్పుడు దర్శకుడు అనిల్ నిరూపించారని, తాము కూడా నేర్చుకోవాల్సిన సమయం వచ్చిందని నిర్మాత దిల్ రాజు అన్నారు.ఈ సందర్భంగా నిర్మాతల్లో ఒకరైన శిరీష్ మాట్లాడుతూ.. ''పెద్ద విజయాన్ని అందించిన తెలుగు ప్రేక్షకులకు ధన్యవాదాలు. మేము మొదట థ్యాంక్స్ చెప్పాల్సింది ఎన్టీఆర్ ఆర్ట్స్ హరిగారికి. ఆయన లేకపోతే 'పటాస్' చూసేవాళ్లం కాదు. అనిల్ ఈరోజు మాతో ఉండేవాడు కాదు. అప్పుడు మా కాంపౌండ్‌లోకి వచ్చిన అనిల్‌ను బయటకు పోనీయడం లేదు. (నవ్వులు) ఆయన లేకపోతే ఈరోజు మేము లేము. 'ఈ సినిమా మీ మొత్తం సమస్యను పరిష్కరిస్తుంది' అని అనిల్ అంటూ ఉండేవాడు. మేము బావిలో పడిపోతున్నామని ఎంతో మంది సంతోషపడేలోపు ఈ సినిమా మమ్మల్ని పక్కన పడేసింది. ఆ క్రెడిట్ అనిల్‌కే దక్కుతుంది. వెంకటేశ్ నిర్మాతల హీరో. ఒక నిర్మాత కుమారుడు కాబట్టి, ఎప్పుడూ నిర్మాత క్షేమమే కోరుకుంటారు' అని శిరీశ్ అన్నారు.

# సైఫ్‌పై దాడి కేసులో ఎవరినీ అదుపులోకి తీసుకోలేదు

### ముంబయి పోలీసులు

**ముంబయి:** బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్‌పై దాడి కేసులో అనుమానితుడిగా భావిస్తూ పోలీసులు ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు ఉదయం నుంచి వార్తలు వస్తోన్న విషయం తెలిసిందే. దీనిపై తాజాగా ముంబయి పోలీసులు స్పష్టతనిచ్చారు. బాంద్రా పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చిన వ్యక్తికి ఈ కేసుతో ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. ఈ కేసుకు సంబంధించి ఇంకా ఎవరినీ అదుపులోకి తీసుకోలేదని వెల్లడించారు. నిందితుడి కోసం గాలింపు ముమ్మరం చేశామని అన్నారు.గురువారం తెల్లవారుజామున 2.30 గంటలకు బాంద్రాలోని సైఫ్ నివాసంలో దాడి ఘటన చోటు చేసుకుంది. సైఫ్, అతడి కుటుంబసభ్యులు నిద్రలో ఉండగా.. ఇంట్లోకి చొరబడిన దుండగుడు చోరీకి యత్నించాడు. సైఫ్ అడ్డుకునేందుకు ప్రయత్నించగా దాడి చేసి పరారయ్యాడు. ఈ విషయంపై కేసు నమోదు చేసుకున్న ముంబయి పోలీసులు అన్ని కోణాల్లోనూ దర్యాప్తు చేపట్టారు. నిన్న రాత్రి నిందితుడి ఫొటోను రిలీజ్ చేశారు. అతడిని పట్టుకునేందుకు పోలీసులు 20 బృందాలుగా ఏర్పడి గాలింపు చర్యలు చేపట్టారు. బాంద్రా రైల్వేస్టేషన్ వద్ద అతడు చివరిసారి కనిపించాడని పోలీసులు తెలిపారు. ఘటన తర్వాత అతడు వసాయి-విరార్ ప్రాంతాలవైపు లోకల్ ట్రైన్‌లో ప్రయాణం చేసినట్లు అనుమానిస్తున్నారు. సైఫ్ ప్రస్తుతం లీలావతి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయన ఆరోగ్యం మెరుగుపడుతోందని వైద్యులు తాజాగా వెల్లడించారు. ఐసీయూ నుంచి ప్రత్యేక గదికి మారుస్తున్నట్లు చెప్పారు. ఆయన నడవగలుగుతున్నారని, సాధారణ భోజనం తీసుకుంటున్నారని, మాట్లాడుతున్నారని చెప్పారు. ఇన్‌ఫెక్షన్స్ బారిన పడకుండా ఉండేందుకు కొన్ని వారాల పాటు విశ్రాంతి సూచించినట్లు తెలిపారు.







Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com